RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com




# వుదయం




గుంటూరు 04-06-2026 గురువారం సంపుటి : 13 | సంచిక : 87 SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal Postal Regd. No. GTR/117/2025-27 Follow us on

# డ్రగ్స్ లింక్ బట్టబయలు

## థాయ్‌లాండ్, ముంబై, హైదరాబాద్ కేంద్రాలుగా నెట్‌వర్క్

**అంతర్జాతీయ హైడ్రోపోనిక్ గంజాయి స్మగ్లింగ్ ముఠాను ఛేదించిన ఈగిల్ ఫోర్స్**

**40 మంది నిందితుల గుర్తింపు**

**300 మందికి పైగా క్యారియర్ల వినియోగం**



**హైదరాబాద్, జూన్ 4 (ఎఎంఎస్) :** తెలంగాణ ఈగిల్ ఫోర్స్ అంతర్జాతీయ హైడ్రోపోనిక్ గంజాయి స్మగ్లింగ్ ముఠాను ఛేదించింది. థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు అధిక టిహెచ్ సి శాతం కలిగిన ప్రీమియం హైడ్రోపోనిక్ గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముఠా కార్యకలాపాలను వెలికితీసింది. ఈ ముఠా గతంలో అరుదైన వస్తువుల మిగతా 2లో

### ఇరాన్‌తో కాల్పుల విరమణకు

# బ్రేక్ పడినట్లేనా?

- ఇరాన్ జరిపే దాడుల్లో అమెరికా సైనికులు చనిపోనంతవరకు యుద్ధం తిరిగి ప్రారంభించకూడదు అని మీడియాలో పలు కథనాలు
- కాల్పుల విరమణ అమల్లోనే ఉంటుంది : ట్రంప్

**వాషింగ్టన్, జూన్ 4** ఇరాన్‌తో యుద్ధం విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. ఇరాన్ జరిపే దాడుల్లో అమెరికా సైనికులు చనిపోనంతవరకు.. యుద్ధం తిరిగి ప్రారంభించకూడదని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. మిగతా 2లో

కాల్పుల విరమణ అమల్లోనే ఉంటుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ దాడుల్లో అమెరికా సైనికులు మరణిస్తే.. ఆ కాల్పుల విరమణను ముగించే విషయాన్ని పరిశీలిస్తానని ట్రంప్ తన సలహాదారులతో పేర్కొన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఒప్పంద చర్చల్లో తమ డిమాండ్లు ఆమోదించేవరకు చిన్నపాటి ఘర్షణలు నిర్వహించాలని ఆయన అనుకుంటున్నట్లు వెల్లడించాయి.



### విద్యార్థులు, ఉద్యమకారులను, సంఘాలను

# మళ్లీ కలుస్తాం

- ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశం
- తెలంగాణ ఉద్యమకారులందరికీ న్యాయం చేస్తాం : కెకె
- నష్టపోయిన వారందరికీ న్యాయం చేస్తాం: మంత్రి పొన్నం
- ఉద్యమ జేఏసీలతో సమావేశమవుతాం : ఎమ్మెల్సీ కోదండరాం




**హైదరాబాద్, జూన్ 4(వుదయం ప్రతినిధి) :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేశవరావు మాట్లాడారు. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు. ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. మిగతా 2లో

### నష్టపోయిన వారందరికీ న్యాయం చేస్తాం : మంత్రి పొన్నం

**ఉద్యమకారులను గుర్తించడానికి కమిటీ ఏర్పాటు**

**అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచాం**



### అమీర్‌పేటలో

# అగ్నిప్రమాదం

**షాపింగ్ కాంప్లెక్స్‌లో చెలరేగిన మంటలు**

**తప్పిన ప్రాణ నష్టం : భారీగా ట్రాఫిక్ జామ్**

**హైదరాబాద్, జూన్ 4 (ఎఎంఎస్) :** అమీర్‌పేటలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో గురువారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మెట్రో పిల్లర్ నెంబరు 1043 సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్ రెండో అంతస్తులో ఉన్న కేఎస్ఆర్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు చెలరేగాయి. క్రమంగా ఇతర దుకాణాలకూ వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది 3 ఫైరింజన్లు, 8 వాటర్ ట్యాంకర్లతో మంటలు అదుపు చేశారు. ఇతర దుకాణాల్లోని వారిని ఖాళీ చేయించారు. అమీర్‌పేటలోలోని ప్రధాన రహదారికి సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రమాదం జరగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దట్టమైన పొగ అలముకోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. మిగతా 2లో

### మక్తల్ -నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను

# పరిశీలించిన సిఎం

**ఫోటో ఎగ్జిబిషన్, ప్లాన్ మ్యాప్స్‌ను పరిశీలించి, వివరాలపై ఆరా**

**ఎత్తిపోతల పథకంపై జరుగుతున్న పనుల ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన సిఎం**

**కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశం**



**మక్తల్, జూన్ 4(వుదయం ప్రతినిధి) :** మక్తల్ – నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం ( భీమా, కృష్ణా నదులపై ప్రతిపాదిత బ్యారేజీల పనుల పురోగతి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, ప్లాన్ మ్యాప్స్‌ను పరిశీలించి, వివరాలను అధికారులను అడిగి తెలుకున్నారు. అవసరమైన కొన్ని సూచనలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టుల పనులను పరిశీలించడానికి ఈరోజు బెంగుళూరు నుంచి నేరుగా నారాయణపేట జిల్లా మక్తల్ చేరుకున్న ముఖ్యమంత్రి మొదటగా మక్తల్ – నారాయణపేట – కొడంగల్ మిగతా 2లో

### తెలంగాణకు వ్యతిరేకంగా

## పవన్ ఎప్పుడూ మాట్లాడలేదు

**కొందరి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి**

**సమావేశం పెట్టుకోవడం ప్రజాస్వామ్య హక్కు**

**తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్**



**హైదరాబాద్, జూన్ 4(వుదయం ప్రతినిధి) :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుంది..? అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రశ్నించారు. తెలంగాణకు వ్యతిరేకంగా.. పవన్ ఎప్పుడూ మాట్లాడలేదని అన్నారు. గురువారం హైదరాబాద్ వేదికగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంని ఎందుకు దగ్గరకు తీసుకున్నారని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ జనసేన సభ కోసం అనుమతి అడిగారని.. మిగతా 2లో

# అత్యుత్తమ సేవలే లక్ష్యంగా..

**రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు**

**కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు**

**ఇప్పటికే నాలుగు ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన**

**రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదు : మంత్రి పొంగులేటి**

**సందేహాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 4788**

**వాట్స్ యాప్ నెంబర్ 8247619983 ఏర్పాటు**



గచ్చిబౌలిలోని తాలిమ్ లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టర్ కార్యాలయం పనులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

* రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచే ఆలోచన ఈ ప్రభుత్వానికి ఏమాత్రం లేదు. గత బీ.ఆర్.ఎస్. ప్రభుత్వం 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచింది. ఒక్క శాతం పెంచిన కూడా వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతుందనే ఆలోచనతో ప్రజాకోణంలో నిర్ణయం తీసుకొని వాస్తవానికి దగ్గరగా శాస్త్రీయ పద్ధతిలో భూముల విలువలను సవరించాం. – మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూన్ 4(వుదయం ప్రతినిధి) :** తెలంగాణ ప్రజలకు వేగవంతంగా పారదర్శకంగా అత్యుత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గచ్చిబౌలిలోని తాలిమ్ లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టర్ కార్యాలయ నిర్మాణ పనులను గురువారం నాడు మంత్రి గారు పరిశీలించారు. అంతకు ముందు సచివాలయంలో తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచే ఆలోచన ఈ ప్రభుత్వానికి ఏమాత్రం లేదని మంత్రి గారు స్పష్టంచేశారు. మిగతా 2లో

# అవయవ మార్పిడిలో పారదర్శకత

## ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ చట్టం అమలుకు గ్రీన్ సిగ్నల్

**అవయవ మార్పిడి ప్రక్రియలో పారదర్శకత, వైద్య సదుపాయాల మెరుగుదలే లక్ష్యంగా నిర్ణయం**


**తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే అమలులో ఉన్న విధానాన్ని ఎపిలో కూడా**

**భీమిలి, విశాఖపట్నం, శ్రీకాకుళం, చీరాల బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా ఈ పాలసీ అమలు**

**ఆంధ్రప్రదేశ్ రిజర్వాయర్ల కేజ్ కల్చర్ పాలసీ-2025 ముసాయిదాకు ఆమోద ముద్ర**

**యేలేరు రిజర్వాయర్లలో ఫిషిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కేజ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి**

**సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఎపి క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు**



అమరావతి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఏవియేషన్, ఉపాధి, మత్స్యరంగం, పోలవరం, పారిశ్రామిక పార్కులు, పోర్టులు, పర్యాటకం వంటి వివిధ రంగాల్లోని ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**అమరావతి, జూన్ 4(వుదయం ప్రతినిధి) :** ఏపీ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మూడు గంటలపాటు కొనసాగిన క్యాబినెట్ భేటీలో పలు అంశాలపై చర్చించారు. కృష్ణా నదీ తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు టెండర్లకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఆంధ్రప్రదేశ్ రిజర్వాయర్ల కేజ్ కల్చర్ పాలసీ-2025 ముసాయిదాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మద్దువలస, ఏలేరు రిజర్వాయర్లలో కేజ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటు ఆమోదం తెలిపింది. ఆ నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ చట్టం అమలుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. 2011 కేంద్ర చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. అవయవ మార్పిడి ప్రక్రియలో పారదర్శకత, వైద్య సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే అమలులో ఉన్న విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయనున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మిగతా 2లో

### 20 మంది టిఎంసి ఎంపీలు

# తిరుగుబాటు?

- త్వరలో మమతా బెనర్జీకి మరో షాక్?
- టీఎంసీ రెబల్ వర్గం బలం మరింత పెరుగనుందా?

**కోల్ కత్తా, జూన్ 4 :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ఇటీవల కనిపించిన దృశ్యాలు పార్లమెంటులో కూడా పునరావృతం కానున్నాయా? టీఎంసీ ఎంపీలు కూడా తిరుగుబాటు బావుటా ఎగరవేయనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. టీఎంసీకి చెందిన సుమారు 20 మంది ఎంపీలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇప్పటికే ఈ ఎంపీలు బీజేపీతో టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఉన్నతస్థాయిలో చర్చలు కూడా జరుగుతున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తృణమూల్‌కు లోక్‌సభలో 28 మంది ఎంపీలు, రాజ్యసభలో 13 మంది ఎంపీలు ఉన్నారు. పార్లమెంటులో ఎంపీల సంఖ్యాపరంగా టీఎంసీ రెండో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉంది. ఈ నేపథ్యంలో పార్లమెంటు వేదికగా టీఎంసీ చీలిపోతే పార్లమెంటులో ప్రతిపక్షం ప్రభావం గణీయంగా తగ్గుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇటీవల పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో కనిపించిన సీన్ రాబోయే కొన్ని రోజుల్లో పార్లమెంటులో కూడా కనిపిస్తుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. టీఎంసీ రెబల్ వర్గం బలం మరింత పెరుగుతుందని అంటున్నారు. ప్రస్తుతం తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ తమ పార్టీ ఎన్నికల గుర్తు, పార్టీ పేరును కాపాడుకునే పనిలో నిమగ్నమైనట్టు మీడియాలో వార్తలు వెలువడ్డాయి. టీఎంసీకి రాష్ట్రంలో 80 ఎమ్మెల్యేలు ఉండగా రుతువ్రత బెనర్జీ నేతృత్వంలో 58 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు మిగతా 2లో

### ఈమెయిల్ ద్వారా

# బాంబు బెదిరింపు

**ఐదు దేవాలయాలకు భద్రత కట్టుదిట్టం**

**అప్రమత్తమైన పోలీసులు**

**అమృత్‌సర్, జూన్ 4 :** పంజాబ్‌లోని ఐదు ప్రఖ్యాత ఆలయాలకు గురువారం బాంబు బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. కొన్ని ప్రభుత్వ సంస్థల్లో కూడా పేలుళ్లు జరుపుతామని ఆ ఈమెయిల్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అప్రమత్తమైన పోలీసులు ఆ ఆలయాల్లో తనిఖీలు నిర్వహించారు. మరో రెండు రోజుల్లో ఆపరేషన్ బ్లూ స్టార్‌కు 42 ఏళ్లు పూర్తికానున్న నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. అమృత్‌సర్‌లోని దుర్గియానా ఆలయం, పఠాన్‌కోట్‌లోని ముక్తేశ్వర్ ధామ్ ఆలయం, జలంధర్‌లోని దేవీ తలాబ్ మందిర్, భటిండాలోని మైసర్ ఖానా ఆలయం, పటియాలాలోని మాతాకాళీ ఆలయానికి ఈ బెదిరింపులు వచ్చాయి. ఆపరేషన్ బ్లూస్టార్ కు 42 ఏళ్ల కావొస్తుండటంతో ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు.. ఈ బెదిరింపు మెయిల్‌తో అప్రమత్తమయ్యారు. ఇప్పటికే దేవీ తలాబ్ ఆలయం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గుర్తించలేదని వెల్లడించారు. ప్రజలను భయపెట్టే ఉద్దేశంతో చేసిన నకిలీ బెదిరింపులుగా కనిపిస్తున్నప్పటికీ ఎలాంటి రిస్క్ తీసుకోబోమన్నారు. 1984 జూన్‌లో ఆపరేషన్ బ్లూ స్టార్ కొనసాగింది. మిగతా 2లో

# అత్యుత్తమ సేవలే లక్ష్యంగా..



మొదటి పేజీ తరువాయి

గత బీ.ఆర్.ఎస్. ప్రభుత్వం 6 శాతం నుంచి 7.5 శాతా నికి పెంచింది. ఒక్క శాతం పెంచిన కూడా వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతుందనే ఆలోచనతో ప్రజాకోణంలో నిర్ణయం తీసుకొని వాస్తవానికి దగ్గరగా శాస్త్రీయ పద్ధతిలో భూముల విలువలను సవరించామని తెలిపారు. ఎలాంటి అక్రమాలకు తావు ఇవ్వ కూడదన్న ఆలోచనతో సబ్ రిజిస్ట్రార్ ల అధికా రాలను కుదించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలల్లో వ్యవసాయ భూముల విలువ ఎకరానికి కనీసం 2.75 లక్షలుగా నిర్ణ యించామని, మున్సిపల్ కార్పొరేషన్ లలో ఎక రానికి 5 లక్షలుగా, హెచ్.యం.డి.ఏ. పరిధిలో 10 లక్షలుగా, ఓ.ఆర్.ఆర్. పరిధిలో 15 లక్షలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. సవ రించిన భూములు విలువలపై ఎక్కువ తక్కువ లుంటే సమీక్షిస్తామని తెలిపారు. సవరించిన భూ ముల విలువలు, సందేహాలు ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 4788, వాట్స్ యాప్ నెంబర్ 8247619983 నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఏ ఫైల్ పై గుడ్డిగా సంతకం పెట్టలేదు. నేను ఏ తప్పు చేయలేదు. మంత్రుల శాఖాల మార్పుపై విలేఖరులు అడిగిన ప్రశ్నకు మంత్రి గారు స్పందిస్తూ "తాను సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిని. దేవుడి దయతో ఇంతవ రకు వచ్చాను. నాకు ఏ శాఖ ఇచ్చినా మనస్ఫూ ర్తిగా పనిచేస్తాను. నేను ఏ తప్పు చేయలేదు. తప్పు చేసే వ్యక్తిని కాను. ఏ ఫైల్ పై గుడ్డిగా సంతకం పెట్టలేదు. చట్ట ప్రకారం పనిచేస్తు న్నాను. రెవెన్యూ శాఖలో అక్రమాలకు పాల్పడ్డ వారిపై, ఎ.సి.బీ. ట్రాప్ అయిన వారిపై గత ప్రభుత్వంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. విచారణ జరగకుండా తప్పు చేసిన వారిని తప్పించే ప్రయత్నం చేశారు. మూడు, నాలుగు సంవత్సరాలపాటు ఫైళ్లను తొక్కిపెట్టారు. నేను రెవెన్యూ శాఖ మంత్రిగా భాద్యతలు స్వీకరించిన ప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 3,500 ఫైళ్లను క్లియర్ చేసాను. తప్పు చేసిన వారికి శిక్ష పడే విధంగా నిర్ణయాలు తీసుకున్నాను. ఎవర్ని క్షమించలేదు, ఉపేక్షించలేదు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు 10 సంవత్సరాలు గడిచిన కూడా ఆ నాటి ప్రభుత్వంలో కనీసం జవాబులు ఇవ్వలేదు. అడిగిన సభ్యుల పదవి కాలం కూడా ముగిసింది. ఇటీవల అన్నీ ఫైళ్లను క్లియర్ చేశాను. గత ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్ జరిగిన అసైన్డ్ భూములను ఇప్పుడు నిషేదిత జాబితాలో పెట్టడం జరిగింది. భూములకు సంబంధించిన ప్రతీ డాక్యుమెంట్ ను డిజిటలైజేషన్ చేస్తాం.

ఫ్యూచర్ సిటీ రద్దుచేయడం సాధ్యంకాదు. ఫ్యూచర్ సిటీ లో లాండ్స్ ఫ్రీ గా ఇవ్వడం లేదు. రద్దు చేస్తే ప్రభుత్వం డబ్బు తిరిగి ఇవ్వవలసి ఉంటుంది. ఇది సాధ్యమయ్యే పనికాదు. ప్రజలకు పారదర్శకమైన, అవినీతి రహిత సేవలు అందించేందుకు స్టాంప్స్ & రిజి స్ట్రేషన్స్ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చాం. స్లాట్ బుకింగ్ విధానం ద్వారా సమయాన్ని ఆదా చేయడమే కాకుండా అత్యా ధునిక సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నాం. మొదటి దశ లో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్లుగా విభజించి ప్రభుత్వంపై ఎలాంటి ఆర్ధిక భారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నాం. నిర్మాణంతో పాటు ఐదు సంవత్సరాల నిర్వహణా బాధ్యతను కూడా ఆ సంస్థలకే అప్పగించాం. మూడు నుంచి ఐదు ఎకరాల స్థలంలో కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాం. వివాహ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజీ హాల్, గర్భిణీలకు, వృద్దులకు ప్రత్యేక వసతులు, విశాలమైన వెయిటింగ్ ఏరియా మహిళల కోసం ఫీడింగ్ రూమ్, చిన్నపిల్లల కోసం క్రెచ్, వృద్దులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యం తదితరాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే నాలుగు ఇంటిగ్రేటెడ్ భవానలకు శంకుస్థాపన చేసుకొని పనులు ప్రారంభించాం. ఈ గచ్చిబౌలి లో నిర్మిస్తున్న భావనాన్ని డిసెంబర్ లోగా అందుబాటులోకి తీసుకోస్తాం. ఒకటి, రెండు రోజుల్లో కోహెడలో శంకుస్థా పన చేయబోతున్నాం. రెండవ విడతలో జిల్లా కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తాం. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం విజ యమంతమైంది. ప్రారంభంలో ఎన్ని వత్తిడిలు వచ్చినా కూడా వెనుకకు తగ్గలేదు. దాని ఫలితమే ఇప్పుడు కనిపిస్తుంది.



## మక్తల్ –నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన సిఎం

మొదటి పేజీ తరువాయి

ఎత్తిపోతల పథకంపై జరుగుతున్న పనులను వివరించే ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. మక్తల్ మండలం కాట్రేవుపల్లి గ్రామ సమీపంలో కొనసా గుతున్న ఎత్తిపోతల ప్రాజెక్టు ప్యాకేజీ –1 సైట్ వద్దకు చేరుకుని అక్కడ పనులను పరిశీలించారు. ప్యాకేజీ –1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత మేరకు పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలు సుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో పాటు కర్నాటక మాజీ మంత్రి ఎన్ఎస్ బోసెరాజు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు.

## బాంబు బెదిరింపు ఈమెయిల్

మొదటి పేజీ తరువాయి

ప్రార్థనాలయంలో దాక్కున్న తీవ్రవాదులను పట్టుకునేందుకు భారత సైన్యం సైనిక చర్య చేపట్టింది. మేజర్ జనరల్ బ్రార్ ఆధ్వర్యంలో కొనసా గిన ఈ 'ఆపరేషన్ బ్లూ స్టార్'.. భారత సైన్యం చేపట్టిన అతిపెద్ద సైనిక చర్యల్లో ఒకటిగా నిలిచింది. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఆదేశాల మేరకు చేపట్టిన ఆ సైనిక చర్యలో 83 మంది భారత సైనికులు అమరులయ్యారు. వేర్పాటువాద నేత భింద్రన్ వాలేతో పాటు ఇతర వేర్పా టువాద నేతలూ హతమయ్యారు.




## ఇరాన్‌తో కాల్పుల విరమణకు బ్రేక్ పడినట్లేనా?

మొదటి పేజీ తరువాయి

ఈ విషయాన్ని ట్రంప్ తన సహాయకులతో చెప్పినట్లు అధికార వర్గాలు చెప్పినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. పశ్చిమాసియాలో ఘర్షణలు, వైమానిక దాడులు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణ అమల్లోనే ఉంటుందని ట్రంప్ స్పష్టం చేశారు. అయితే, ఇరాన్ దాడుల్లో అమెరికా సైనికులు మరణిస్తే.. ఆ కాల్పుల విరమణను ముగించే విషయాన్ని పరిశీలిస్తానని ట్రంప్ తన సలహాదారులతో పేర్కొన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఒప్పంద చర్చల్లో తమ డిమాండ్లు ఆమోదిం చేవరకు చిన్నపాటి ఘర్షణలు నిర్వహించాలని ఆయన యోచిస్తున్నట్లు వెల్లడించాయి. ఇక, ఈ కాల్పుల విరమణపై ఓవల్ ఆఫీసులో విలేకరు లతో మాట్లాడుతూ.. డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీజ్ ఫైర్ అనే పదానికి ఇరాన్‌లో భిన్నమైన అర్థం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. వారు అలా అనుకోవడం కూడా మంచి విషయమేనని వ్యాఖ్యానించారు. ఏప్రిల్‌లో అమెరికా– ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. అయినప్పటికీ.. ఇరుదేశాల మధ్య సైనిక ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి

# డ్రగ్స్ లింక్ బట్టబయలు

మొదటి పేజీ తరువాయి

స్మగ్లింగ్‌లో పాల్గొనగా, 2023 నుంచి మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై దృష్టి సారించినట్లు దర్యాప్తులో తేలింది. ఎయిర్‌పోర్టులో పట్టుబడ్డ డ్రగ్స్.. 2026 ఏప్రిల్ 8న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్ర యంలో కస్టమ్స్ అధికారులు బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుడు సోధా మొహసన్ బహదూర్ భాయ్ వద్ద 13.2 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రాచకొండ పోలీసులు, కస్టమ్స్ అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఆప రేషన్‌లో హరషద్ మన్‌సుఖ్ భాయ్ ప్రజాపతి, సందీప్ వాసాని అలియాస్ రాహుల్ జైన్‌లను అరెస్ట్ చేసి మరో 12.739 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

**ముంబై–హైదరాబాద్–థాయ్‌లాండ్ నెట్‌వర్క్**

దర్యాప్తులో ఈ ముఠా థాయ్‌లాండ్, హైదరాబాద్, ముంబై కేంద్రాలుగా భారీ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తు న్నట్లు బయటపడింది. గుజరాత్‌కు చెందిన దల్ అబ్దుల్లా సదుద్దీన్ నాయ్ అనే వ్యక్తి యువకులను ప్రలో భపెట్టి థాయ్‌లాండ్ నుంచి గంజాయి రవాణా చేయి స్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో ఎన్ డిపిఎస్ చట్టంలోని పలు సెక్షన్లతో పాటు భారతీయ న్యాయ సంహిత కింద కేసులు నమోదు చేశారు.

**40 మంది నిందితుల గుర్తింపు**

ఈ కేసులో మొత్తం 40 మంది నిందితులను గుర్తించారు. వీరిలో పలువురు అరెస్టు కాగా, మరి కొందరు పరారీలో ఉన్నారు. ముంబైకి చెందిన హేమంగ్ ప్రమోద్ కెలుస్కర్ ఈ రాకెట్‌కు ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. అతడు, అతని సోదరుడు సుధాంశు కెలుస్కర్ థాయ్‌లాండ్‌లో క్లబ్ వ్యాపారం నిర్వహిస్తూ గంజాయి స్మగ్లింగ్‌కు కేంద్రంగా ఉపయో గించినట్లు విచారణలో వెల్లడైంది. ముఠా కార్యకలా పాలపై దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సుమారు 300 మంది క్యారియర్లను ఉప యోగించి థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు హైడ్రోపో నిక్ గంజాయిని తరలించినట్లు ఈగిల్ ఫోర్స్ గుర్తించింది. కస్టమ్స్ నిఘా నుంచి తప్పించుకోవడా నికి వివిధ విమానాశ్రయాలను మారుస్తూ అక్రమ రవాణా కొనసాగించినట్లు అధికారులు తెలిపారు. గంజాయి వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని, మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి, భవిష్యత్తుకు హానికరమని ఈగిల్ ఫోర్స్ హెచ్చరించింది. యువత డ్రగ్స్, హానికర ఇంజెక్షన్లు, నియంత్రణలేని సప్లిమెం ట్లకు దూరంగా ఉండాలని సూచించింది. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే 1908 నంబర్ లేదా ఈగిల్ ఫోర్స్ అధికారిక మార్గాల ద్వారా అందిం చాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# విద్యార్థులు, ఉద్యమకారులు, సంఘాలను మళ్లీ కలుస్తాం

మొదటి పేజీ తరువాయి

విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబం ధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నా రు. తెలంగాణ తొలి దశతోపాటు మలి దశ ఉద్యమ కారులందరికీ న్యాయం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు.

**నష్టపోయిన వారందరికీ న్యాయం చేస్తాం: మంత్రి పొన్నం**

ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీ తంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్య మకారులందరితోనూ మాట్లాడతామ న్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించ డానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిల పక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలి చామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ ప్రక్రియ అమరవీరుల దీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించా లని నిర్ణయించామన్నారు. రాజకీయా లకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.

**ఉద్యమ జేఏసీలతో సమావేశమవుతాం : కోదండరాం**

ఉద్యమ సమయంలో తన జీవితంలో యవ్వనం పోయిందని.. మమ్మల్ని ఆదు కోవాలని ఉద్యమకారులు కోరుతున్నా రని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు ఉన్నాయని.. వారిందరినీ కలుస్తామ న్నారు. అలాగే అన్ని యూనివర్సిటీల జేఏసీలు ఉన్నాయని.. వారితో కూడా సమావేశమవుతామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీ, యూనివర్సిటీ జేఏసీలను సంప్ర దిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. స్టేక్ హోల్డర్స్‌ను పిలిచి మాట్లాడతామ న్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని ఉద్యమకారులను గుర్తిస్తా మని పేర్కొన్నారు.



పద్మశ్రీ అవార్డు గ్రహీత కీర్తి శే ధరిపెల్లి వనజీవి రామయ్య ప్రథమ సంవత్సరం డెత్ ఆనివర్సరీ సందర్భంగా లక్మి నగర్ పార్కు అత్తాపూర్ రావి చెట్టు మొక్కను నాటుతున్న తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రచయిత కాలమిస్ట్ నేదునూరి కనకయ్య ఆల్ ఇండియా ఆల్ ఇండియా బిఎస్ ఎన్ ఎల్ ఉద్యోగుల ధ్యక్షులు కొల్లూరి అనిల్ కుమార్ అత్తాపూర్ యోగా సెంటర్ సభ్యులు సుధాకర్ గౌడ్ మహేందర్ ప్రభాకర్ కె మూర్తి కె కృష్ణ గాయత్రి తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణకు వ్యతిరేకంగా పవన్ ఎప్పుడూ మాట్లాడలేదు

మొదటి పేజీ తరువాయి

ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టు కోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడమే ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధా నమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. తెలంగాణ సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లా డాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగా లకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచ లేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు.



## అమీర్‌పేటలో అగ్నిప్రమాదం

మొదటి పేజీ తరువాయి

అగ్ని ప్రమాదం జరిగిన సమ యంలో దుకాణాల్లో సిబ్బంది బయటకు పరుగులు తీయడంతో ప్రాణనష్టం తప్పింది. భారీగా ఆస్తి నష్టం జరిగిం దని అధికారులు అంచనా వేస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో హెల్మెట్ షాపు ఉండటంతో ప్లాస్టిక్ సామగ్రి దగ్ధమై మంటల తీవ్రత ఎక్కువగా ఉందని అగ్నిమాపకశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

## 20 మంది టిఎంసి ఎంపీలు తిరుగుబాటు

మొదటి పేజీ తరువాయి

బావుటా ఎగరేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీలో తామే అసలైన టీఎంసీ అని రుతువ్రత స్పష్టం చేయడంతో ఆయనకు ప్రతిపక్ష నేత హోదా దక్కింది. పశ్చిమబెంగాల్‌లో ఓటమి తరువాత టీఎంసీలో విభేదాలు పెరిగాయి. రాష్ట్రంలో అవినీతి, ఆర్‌జీ కార్ ఆసుపత్రి హత్యాచారం కేసులో ప్రభుత్వ తీరును సొంత పార్టీ నేతలే విమర్శించారని సమాచారం.

## నిలోఫర్ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే, మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఛైర్మన్

### ఆసుప్రతిలో రోగులకు పండ్ల పంపిణీ



**గోషాహహల్, జూన్ 4(వుదయం ప్రతినిధి) :** నిలోఫర్ ఆసుపత్రిని గురువారం తెలంగాణ పిసిసి ఎస్సీసెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జాతీయ అసంఘటిత కార్మికులు, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ నవాజ్ షేక్ ఇబ్రహం, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బండ్రు శోభారాణితో పాటు పలువురు సందర్శించారు. ఆసుప్రతి సూపరింటెండెంట్ విజయ్ కుమార్ ను కలిసి ఆసుపత్రి అభివృద్ధి, మౌలిక అవసరాలు పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, నవాజ్ షేక్ ఇబ్రహం, బండ్రు శోభారాణి, తెలంగాణ కెకెసి ఛైర్మన్ కౌశల్ సమీర్, ఉపాధ్యక్షులు దుగ్యాల వేణఉ, రుద్రాక్ష మల్లేశ్, ఫారూఫ్, అఖిల్, బాలకోటి తదితరులు ఆసుప్రతి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవాబ్ షేక్ ఇబ్రాహీం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన పలువురు జన్మదిన శుభా కాంక్షలు తెలియజేశారు.

## అవయవ మార్పిడిలో

# పారదర్శకత

మొదటి పేజీ తరువాయి



భీమిలి, విశాఖపట్నం, శ్రీకాకుళం, చీరాల బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా ఈ పాలసీ అమలు చేయనున్నారు. గోవా, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల అనుభవాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే బీచ్ షాక్స్‌లు తెరిచి ఉంచడానికి అనుమతి ఇవ్వనున్నారు. పరిమిత రకాల మద్యం విక్రయాలకు మాత్రమే అనుమతి ఉండనుంది. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే తదుపరి విస్తరించే అవకాశం ఉంది. రాజధాని అమరావతి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఏవియేషన్, ఉపాధి, మత్స్యరంగం, పోలవరం, పారిశ్రామిక పార్కులు, పోర్టులు, పర్యాటకం వంటి వివిధ రంగాల్లోని ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి కేటాయిం చిన భూమి రిజిస్ట్రేషన్‌పై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపును ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ రిజర్వాయర్ల కేజ్ కల్చర్ పాలసీ–2025 ముసాయి దాకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మద్దువలస, యేలేరు రిజర్వాయర్లలో ఫిషిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కేజ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ పాలసీ–2026కు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే అగ్రిగోల్డ్ తదితర డిపాజిటర్ల కేసుల పరిష్కారం కోసం 21 పోస్టుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చిత్తూరు జిల్లాలో వ్యవసాయ శాఖ భూమిపై పిఎం కుసుమ్ పథకం కింద సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఎన్ఆర్ డిసిఎపికు 30 ఏళ్ల లీజు ఇవ్వడా నికి అనుమతి ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు హడ్కో నుంచి రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ హామీకి కేబినెట్ ఆమోదం తెలిపింది.

కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు టెండర్లకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. రాజధాని అమరావతిలో పలు నిర్మాణాలు, మౌలిక సదుపా యాల కల్పనకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. పోలవరం సహా వివిధ ప్రాజెక్టుల పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లు, గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సీపీఎస్ అమల్లోకి రాకముందు ఇచ్చిన నోటిఫికేషన్లలో ఎంపికై.. వివిధ కారణాలతో సీపీఎస్ అమలు తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పింఛను వ్యవస్థ అమలు చేయాలనే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీలో సవరణలకు కేబినెట్ ఆమోదించింది. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ ను జులై 1 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేసే ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది.

## రాహుల్ వ్యాఖ్యలు అర్థరహితం

### రాహుల్ గాంధీపై బిజెపి ఫైర్

**న్యూఢిల్లీ, జూన్ 4 (వుదయం బ్యూరో) :** దేశంలో 'ఆర్థిక సునామీ' రాబో తోందని, కీలక వ్యవస్థల్లో అంతర్గ తంగా అసంతృప్తి పెరుగుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ముమ్ముందు వారు ప్రజా వ్యతిరేక తను అణచి వేయ టానికి ఎమర్జెన్సీని విధించినా విధిం



చొచ్చని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బిజెపి నుంచి తీవ్ర స్పందన వచ్చింది. ప్రజలను భయపెట్టి బతకొద్దని రాహుల్‌కు చురకలు వేసింది. ఆర్థిక సునామీ 2013లోనే వచ్చిందని, ఇప్పుడు కాదంటూ కమలం పార్టీ నేత అమిత్ మాలవీయ సుదీర్ఘ పోస్టు పెట్టారు. కాంగ్రెస్ వినాశనాన్ని సృష్టిస్తే.. భాజపా దృఢంగా ముందుకెళ్తోందన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు భిన్నంగా వాస్తవ పరిస్థితి ఉంది. ఆర్థిక వ్యవస్థ బయటి నుంచి షాక్ ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ నిస్సహా యంగా లేదు. ఈ దశాబ్ద కాలంలో ఆ షాక్‌లను తట్టుకొనే వ్యవస్థలను నిర్మించాం. విద్యుత్ వినియోగం, వాహనాల విక్రయాలు పెరుగుతు న్నాయి, ఈవే బిల్ జనరేషన్‌లో పెరుగుదల ఉంది. ద్రవ్యోల్బణం అదుపులో ఉంది. ఆహారం, విదేశీ మారకద్రవ్య నిల్వలు సరిపడా ఉన్నాయి. భారత్ దృఢంగా ముందుకు వెళ్తోందనడానికి ఇవన్నీ సంకేతాలు. 2011 నుంచి 2013 మధ్యలో రూపాయి 36 శాతం కుంగింది. విదేశీ మారక నిల్వలు 294 బిలియన్ డాలర్ల నుంచి 256 బిలియన్ డాలర్లు పడిపోయాయి. ద్రవ్యోల్బణం సంగతి సరేసరి. ఆర్థిక సునామీ అప్పుడే వచ్చింది. కాంగ్రెస్ దేశాన్ని బలహీనపరిచింది. కొవిడ్, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, ముడిచమురు ధరలు, సరఫరా అంతరాయలు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వంటి షాక్‌లు తగిలినా తట్టుకొనేలా దేశాన్ని మోదీ ప్రభుత్వం బలోపేతం చేసింది. ప్రజలను భయపెట్టి బతక్కండి'' అని ఎక్స్ వేదికగా మాలవీయ కౌంటర్ ఇచ్చారు.



# గ్రేటర్ హైదరాబాద్



## నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచన



**2వ వార్డులో అండర్ డ్రైనేజీ పనుల పరిశీలన**

**షాద్‌నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు కీర్తి వెంచర్‌లో జరుగుతున్న అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీవాసులకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే మున్సిపాలిటీ లక్ష్యమని తెలిపారు. కీర్తి వెంచర్‌లో అండర్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తయితే పారిశుధ్య సమస్యలు తగ్గడంతో పాటు స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ బచ్చలి నరేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, చందూలాల్, సాయి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..

## బండ్ల గణేష్ వ్యాఖ్యలపై రాజా వరప్రసాద్ తీవ్ర స్పందన



**షాద్‌నగర్:** సినీ నిర్మాత, కాంగ్రెస్ నాయకుడు బండ్ల గణేష్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్ తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రకాశ్ రాజ్ గురించి మాట్లాడే అర్హత బండ్ల గణేష్‌కు లేదని రాజా వరప్రసాద్ విమర్శించారు. కాంగ్రెస్‌లో ఉంటూ గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ తిరుపతికి పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తు చేశారు. షాద్‌నగర్ తనదేనని చెప్పుకునే బండ్ల గణేష్, నియోజకవర్గ అభివృద్ధికి ఏమి చేశారని ప్రశ్నించారు. ప్రకాశ్ రాజ్ కనీసం రెండు గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేశారని, అయితే కోట్లాది రూపాయలు సంపాదించిన బండ్ల గణేష్ సమాజానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌పై నిజంగా ప్రేమ ఉంటే ఒక మున్సిపల్ వార్డును దత్తత తీసుకుని అభివృద్ధి చేసి చూపించాలని రాజా వరప్రసాద్ సవాల్ విసిరారు. ప్రజాసేవ, అభివృద్ధి విషయంలో ప్రకాశ్ రాజ్‌ను విమర్శించే ముందు తన సేవలను బండ్ల గణేష్ ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ ప్రకటన ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది..

## బూత్ స్థాయిలో బీజేపీని పటిష్టం చేద్దాం!



**బీరంగూడ (వుదయం):** రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని భారతీయ జనతా పార్టీని పోలింగ్ బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్, రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్ పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడంతో పాటు బీఎల్ఏ 2 వ్యవస్థను సమర్థవంతంగా ఏర్పాటు చేసి విజయానికి బలమైన పునాదులు వేయాలని సూచించారు.గురువారం బీరంగూడలో అమీన్‌పూర్ పట్టణ కన్వీనర్ ఆగరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాలని, బీజేపీ పట్ల ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజలు బీజేపీకి మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో పార్టీ బలోపేతం ఏర్పాటుపై చర్చించి తీసుకున్నారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్ పట్టణ కన్వీనర్‌గా ఆగరెడ్డి, కోకన్వీనర్‌గా లక్ష్మణ్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి రమేష్‌ను ఎంపిక చేశారు.ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్, రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్, పట్టణ కన్వీనర్ ఆగరెడ్డి, కోకన్వీనర్ లక్ష్మణ్ గుప్తా, ప్రధాన కార్యదర్శులు కొత్తపల్లి రమేష్, రమేష్ రెడ్డి, శ్రవణ్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి తులసి, గోపి, గోపాల్, మహేష్, వీరేశం, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.పార్టీని గ్రామ, వార్డు, పోలింగ్ బూత్ స్థాయిలో మరింత బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో విజయాన్ని సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## సిమెంట్ పిచ్ ఏర్పాటుకు సాయి భరత్ సహకారం!



**జిన్నారం జూన్ 4(వుదయం ప్రతినిధి )** గడ్డ పోతారం మున్సిపల్ కేంద్రం సమీపంలోని ఛత్రపతి శివాజీ క్రికెట్ గ్రౌండ్ లో సిమెంట్ పిచ్ ఏర్పాటు కు స్థానిక యువత నాయకులు పులిగిల్ల సాయి భరత్ ముందుకు వచ్చారు. ఈ మేరకు క్రీడాకారుల ఇబ్బందులు గమనించి అండగా నిలబడి పిచ్ ఏర్పాటుకు సొంత నిధులు 50వేల ఖర్చు చేసి ఏర్పాటు చేస్తున్నారు. పిచ్ ఏర్పాటు పనులు జోరుగా కొనసాగుతున్నాయి. క్రీడలకు అందిస్తున్న ప్రోత్సాహంపై స్థానిక యువత సంతోషం వ్యక్తం చేశారు. పట్టణం లో నీ క్రీడాకారులు ఆయన సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కర్ణంగూడను జిల్లాకు ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి



**రంగారెడ్డి జిల్లా.** రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక గ్రామసభలో కలెక్టర్ పిలుపుప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఇబ్రహీంపట్నం మండలం కర్ణంగూడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామస్థులతో నేరుగా మమేకమయ్యారు. గ్రామాభివృద్ధి, వ్యవసాయం, పారిశుద్ధ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, ఓటరు జాబితా పునర్విమర్శ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. వర్షాలు ఆలస్యంగా ప్రారంభమయ్యే పరిస్థితులు ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరమున్న వరి సాగుపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు.వర్షాకాలంలో నీటి కాలుష్యం, దోమల వ్యాప్తి, అంటువ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి కుటుంబం ఆరోగ్య రక్షణకు సహకరించాలని కోరారు.వర్షాలు ప్రారంభమైన వెంటనే గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి ఇంటిలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించిన కలెక్టర్, తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ ద్వారా తిరిగి వినియోగించవచ్చని తెలిపారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు చెత్త సేకరణ డబ్బాలను అందజేస్తామని, వాటిని సక్రమంగా వినియోగించి జిల్లాకు ఆదర్శంగా నిలవాలని కోరారు. నెల రోజుల తర్వాత గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ పరిస్థితిని పరిశీలిస్తామని స్పష్టం చేశారు.గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంపోస్ట్ యూనిట్‌ను పూర్తి స్థాయిలో వినియోగించి సేంద్రియ వ్యర్థాలను ఎరువుగా మార్చాలని సంబంధిత అధికారులకు సూచించారు.రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం మునుగోడు నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తోందని అధికారులు వివరించారు. యూరియా, డీఏపీ తదితర ఎరువులను ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా మాత్రమే అందజేయనున్నట్లు తెలిపారు.ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు యాప్‌ను అనుసంధానం చేసినందున రైతులు తప్పనిసరిగా నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, తప్పుడు వివరాలు నమోదు చేస్తే ఎరువుల కేటాయింపులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు.కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ప్రత్యేక ఓటరు జాబితా పునర్విమర్శ కార్యక్రమంలో ప్రతి అర్హుడి పేరు నమోదు అయ్యేలా ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.కర్ణంగూడ ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభానికి గ్రామస్థులు ముందుకు రావాలి గ్రామంలో మూతపడిన ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు గ్రామస్థులు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. చిన్నారులను దూర ప్రాంతాలకు పంపకుండా గ్రామంలోనే విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.డీసీపీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా ప్రజలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తాగి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా కుటుంబ పోషకులు ప్రాణాలు కోల్పోతున్నారని, కుటుంబ సభ్యులు భద్రతా నిబంధనలు పాటించేలా చూసుకోవాలని కోరారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాల వినియోగం గమనిస్తే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమల రెడ్డి, ఉపసర్పంచ్, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



## సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం

**- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**- ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో 7వ వార్డు సభ**

**షాద్‌నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో అభయ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల" కార్యక్రమంలో భాగంగా వార్డు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కాలనీవాసులు తమ ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వార్డులో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ప్రజా పాలన ద్వారా ప్రజల అభిప్రాయాలు, అవసరాలు తెలుసుకొని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సహకారంతో వార్డు అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, 7వ వార్డు కౌన్సిలర్ కొప్పునూరి ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, కౌన్సిలర్లు మురళీమోహన్, అప్పి, దిలీప్, బచ్చలి నరేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, శ్రీశైలం గౌడ్, ముబారక్ అలీ ఖాన్, సాదిక్, చందూలాల్, జయప్రకాశ్, మనీష్, అర్జున్, లక్ష్మణ్, మంచిరేవుల అశోక్, రాజు గౌడ్, మంగ అశోక్, కాలనీవాసులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## భవన నిర్మాణాల్లో అపోహలు నమ్మొద్దు



**షేర్ లింగంపల్లి** కొందరు పనిగట్టుకొని చేస్తున్న ప్రచారాలను నమ్మొద్దని తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక వర్గం తెలియజేసింది. గురువారం శేలింగంపల్లి నియోజకవర్గంలోని మాదాపూర్ డివిజన్ లో గల అయ్యప్ప సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్లో సెంట్రింగ్ కార్మికుల రేట్ల వ్యవహారంలో సెంట్రింగ్ కార్మికులు సైట్ల దగ్గరికి వచ్చి బిల్డర్స్ అసోసియేషన్ వారు రేట్లు పెంచినట్లుగా చెబుతూ వారి యొక్క అగ్రిమెంట్ల పేపర్లు పట్టుకొని అందరూ సంతకం పెట్టాలని కోరుతున్నట్లుగా తమ దృష్టికి వచ్చినట్లుగా తమ సభ్యుల దృష్టికి తీసుకురావడం జరుగుతోందని ఆయన తెలిపారు. హైదరాబాద్ లోని ఏ అసోసియేషన్ అనగా క్రెడాయ్, నేరేడుకో అలాగే టిబిఎఫ్ ప్రతినిధులు ఎవరు కూడా రేట్లు పెంచినట్లుగా ఎక్కడ ఎవరికీ చెప్పి ఉండలేదని ఆయన తెలిపారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సెంట్రింగ్ కాంట్రాక్టర్ల రేట్లు పెంపును వ్యతిరేకిస్తూ సెంట్రింగ్ కాంట్రాక్టర్ల మిగిలిన కోరికలు అయిన హెల్త్ కార్డుల విషయంలో కానీ ఈఎస్ఐ వ్యవహారంలో కానీ అదేవిధంగా కార్మికులకు ఏమైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రభుత్వ నుండి పొందవలసిన ఎక్స్‌గ్రేషియా విషయములో కానీ అన్ని అసోసియేషన్లు కార్మికులకు అండగా ఉండి చేయూతనందిస్తామని ఆయన తెలిపారు. ప్రస్తుత రేట్లు పెంపుదల అనేది ఎవరి వ్యక్తిత్వం వారిది కానీ అసోసియేషన్ ఎవరికి ఎటువంటి బాధ్యత లేదని నచ్చిన వాళ్ళు వాళ్లకు చూచిన రేటు పెంచి వారి యొక్క కాంట్రాక్టర్ తో మాట్లాడుకోవాల్సిందే గానీ ఏ ఒక్క అసోసియేషన్ పెంపుని సమర్థించలేదని ఆయన తెలిపారు. అదేవిధంగా ఎవరైనా సెంట్రింగ్ కాంట్రాక్టర్ల ప్రతినిధులు సైట్ల వద్దకు వచ్చి ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నం చేస్తే వారి మీద క్రిమినల్ కేసులు పెట్టడానికి కూడా అసోసియేషన్ సభ్యులు వెనకాడ రాదని ఆయన అన్నారు. ప్రభుత్వం ట్రాన్స్ఫర్స్ వ్యవహారంలో తీసుకొచ్చిన మార్పుల వల్ల బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తెరిగి అదే విధంగా ప్రస్తుతం ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారు చేసిన మార్పుల వల్ల జరుగుతున్న ఇబ్బందులు గుట్టు ఎరిగి తక్షణము బిల్డర్లకు ట్రాన్స్ఫార్మర్స్ మరియు మీటర్ల పొందుటంలో ఎదురవుతున్న సమస్యలను తదనుగుణంగా కొనుగోలుదారు నుండి ఎదురవుతున్న ఇబ్బందులను తక్షణం పరిష్కరించాలని దానికోసం భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సభ్యులను కోరారు. అంతేకాకుండా అపార్ట్మెంట్ల ఎస్ ఎఫ్ టి రేట్లు విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రగతి నగర్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, రాజారెడ్డి, నారాయణరెడ్డి, గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మిరియాల రాఘవరావు, రాజారెడ్డి, పిబిఎస్ విశ్వనాథ్, సమ్మెట ప్రసాద్, శశిధర్ రెడ్డి, స్వప్న శ్రీనివాస్, ఉప్పల్ అసోసియేషన్ ప్రతినిధులు సత్యనారాయణ రమేష్, వెంకటరెడ్డి, మురళి, పద్మాకర్ రెడ్డి, ఈస్ట్ జోన్ బిల్డర్స్ ప్రతినిధులు నరసింహారావు, కూకట్పల్లి జోన్ బిల్డర్ అసోసియేషన్ ప్రతినిధులు చక్రపాణి, గోపాల్, యోగేంద్ర సింగ్, అదేవిధంగా గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ విద్యాసాగర్, మధు, రమేష్ బాబు, మోహన్ రావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మాయగాళ్ల ఉచ్చులో పడొద్దు

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణకు అవగాహనే ఆయుధం**
**- ఫేక్ లింకులు, ఫిషింగ్ సందేశాలతో భారీ మోసాలు**
**- మ్యూల్ అకౌంట్ల ద్వారా విదేశాలకు మళ్లుతున్న మోసగాళ్ల డబ్బు**
**- సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి**
**- వ్యక్తిగత వివరాలు పంచుకుంటే ఆర్థిక నష్టాలు తప్పవు**



**శంకర్‌పల్లి, జూన్ 04 (వుదయం ):** సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయని, ప్రజలు ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నిరుడు సర్వేశ్ ముదిరాజ్ పేర్కొన్నారు.ఇంటర్నెట్, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లను ఉపయోగించి అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన సూచించారు.నేటి డిజిటల్ యుగంలో బ్యాంకింగ్, షాపింగ్, ఉద్యోగాల అన్వేషణ, పెట్టుబడులు వంటి అనేక సేవలు ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు.ముఖ్యంగా యువత, ఉద్యోగార్థులు, వృద్ధులు వీరి బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.ఆన్‌లైన్ మోసాలు ప్రస్తుతం అత్యంత వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాలలో ఒకటిగా మారాయని చెప్పారు.లాటరీలు వచ్చాయని, తక్కువ ధరలకు విలువైన వస్తువులు అందిస్తామని, ఇంట్లో నుంచే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి అనేక మందిని మోసగాళ్లు బురిడీ కొట్టిస్తున్నారని వివరించారు.ఇటువంటి ఆఫర్లను నమ్మే ముందు పూర్తి వివరాలు పరిశీలించాలని సూచించారు.ఫిషింగ్ మోసాలు కూడా ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయని తెలిపారు.బ్యాంకులు, ప్రముఖ సంస్థల పేర్లతో నకిలీ సందేశాలు, ఈమెయిల్స్ పంపించి ప్రజల వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలను సేకరించి ఖాతాలను ఖాళీ చేస్తున్నారని చెప్పారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు, పిన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. మ్యూల్ అకౌంట్ల పేరుతో నిరుద్యోగులు, అమాయక ప్రజల బ్యాంక్ ఖాతాలను అద్దెకు తీసుకుని మోసం చేసిన డబ్బును ఇతర దేశాలకు మళ్లించే నేరాలు కూడా పెరుగుతున్నాయని సర్వేశ్ ముదిరాజ్ తెలిపారు. కొంత కమీషన్ ఇస్తామని చెప్పి ఖాతాలను ఉపయోగించుకునే వ్యక్తులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.రాన్సమ్‌వేర్ వంటి సైబర్ దాడులు వ్యక్తులతో పాటు సంస్థలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు.కంప్యూటర్లలోని సమాచారాన్ని లాక్ చేసి తిరిగి ఇవ్వాలంటే భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయని, ముఖ్యమైన డేటాను ఎప్పటికప్పుడు బ్యాకప్ చేసుకోవడం అవసరమని సూచించారు.సైబర్ నేరాల నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఆయన తెలిపారు. తెలియని వ్యక్తులు పంపిన లింక్‌లపై క్లిక్ చేయకూడదని, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదని, సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించాలని సూచించారు.అలాగే ఉద్యోగాలు, పెట్టుబడులు, బహుమతుల పేరుతో వచ్చే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని, అలాగే జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని నిరుడు సర్వేశ్ ముదిరాజ్ సూచించారు.ప్రజల్లో అవగాహన పెరిగితేనే సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండి తమ ఆర్థిక, వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## మోకిలాలో '99 రోజుల ప్రణాళిక' గ్రామసభ!

**.గ్రామాభివృద్ధిపై అధికారులకు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ కీలక సూచనలు**
**.సురక్షిత తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పిలుపు**
**.వర్షా కాలం నేపథ్యంలో మొక్కల పెంపకానికి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచన**



**శంకర్‌పల్లి, జూన్ 04 (వుదయం)** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం శంకర్‌పల్లి మండలంలోని మోకిలా గ్రామపంచాయతీలో గ్రామసభను ఘనంగా నిర్వహించారు.గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించారు.ఈ గ్రామసభకు ప్రత్యేక అధికారిగా హాజరైన శంకర్‌పల్లి ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ప్రజలకు, అధికారులకు మార్గనిర్దేశం చేశారు.ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు.అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా కొనసాగేందుకు గ్రామసభలు కీలక వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రత్యేకంగా మాట్లాడిన ఎంపీడీవో, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు చోటు చేసుకోకుండా ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటరు నమోదు అత్యంత కీలకమని ఆయన అన్నారు.గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడం స్థానిక సంస్థల ప్రధాన బాధ్యత అని పేర్కొన్న ప్రవీణ్ కుమార్, తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అలాగే నీటి వనరుల సంరక్షణ, పరిశుభ్రత నిర్వహణపై గ్రామస్థులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణలో తాగునీటి నాణ్యత కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు కాలువల శుభ్రత, పరిశుభ్రమైన వాతావరణం కోసం అధికారులు మరియు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొంటూ ప్రజలందరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై కూడా ఎంపీడీవో అవగాహన కల్పించారు.గ్రామాల్లో విస్తృత స్థాయిలో మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు.అనంతరం సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో అమలవుతున్న కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో మోకిలా గ్రామ సర్పంచ్ చిట్టెంపల్లి శేఖర్, ఉపసర్పంచ్ మాధవి, మండల వ్యవసాయ అధికారి చైతన్య, సీఐ శ్రీనివాస్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి నరసింహ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## పార్వేద గ్రామసభలో ఆర్డీఓ సమీక్ష!

**.ఘన వ్యర్థాల నిర్వహణ నుంచి ఓటరు జాబితా సవరణ వరకు పలు కీలక అంశాలపై అవగాహన**



**శంకర్‌పల్లి జూన్ 04 (వుదయం)** శంకర్‌పల్లి మండలంలోని పార్వేద గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రామసభకు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాభివృద్ధి, వ్యవసాయ పురోగతి, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించే అంశాలపై గ్రామసభలో విస్తృతంగా చర్చించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీఓ సూచించారు.గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచేందుకు ఘన వ్యర్థాల నిర్వహణ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, వ్యర్థాల వర్గీకరణ, పరిశుభ్రమైన గ్రామ వాతావరణం కోసం ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు.స్వచ్ఛమైన గ్రామాల నిర్మాణంలో ప్రతి కుటుంబం భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాల్లో రైతుల నమోదు ప్రక్రియ (ఫార్మర్ రిజిస్ట్రేషన్) ప్రాధాన్యతను వివరించారు.ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హ రైతుకు అందాలంటే రైతులందరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని పంటల మార్పిడి (క్రాప్ డైవర్షన్)పై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా విస్తృత స్థాయిలో మొక్కల పెంపకాన్ని చేపట్టాలని గ్రామస్థులకు సూచించారు. అలాగే ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆర్డీఓ సూచించారు.గ్రామసభలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



* తెలంగాణలో శుక్రవారం నుంచి భూముల మార్కెట్ విలువలు పెంచుతున్నాం. దీంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నుంచి నిధులు రాకపోతే రాష్ట్ర ప్రభుత్వమే చివరి బిల్లు కూడా చెల్లిస్తుంది. భూముల మార్కెట్ విలువలు 50 నుంచి 100 శాతం పెంచుతాం. ప్రభుత్వానికి రూ.1,400 కోట్ల ఆదాయం సమకూరుతుంది. సబ్ రిజిస్ట్రార్ల అధికారాలు చాలా వరకు తగ్గించాం. మార్కెట్ విలువల పెంపుతో భూసేకరణ వేళ ప్రభుత్వంపై భారం పడుతుంది. ప్రజల ఫిర్యాదుల స్వీకరణకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తాం. ఫ్యూచర్ సిటీని రద్దు చేసే అవకాశమే ఉండదు. నాకు ఏ శాఖ ఇచ్చినా పనిచేస్తా. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్లకు రూ.7వేల కోట్లు చెల్లించాం.

* పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ మంత్రి


## వేమన పద్యం

నిండు నదులు పారు నిలిచి గంభీరమై

వెర్రివాగు పారు వేగబొర్రి

అల్పుడాడురీతి నధికుడు నాడునా?

విశ్వదాభిరామ! వినురవేమ



# టిఎంసిలో తిరుగుబాటుకు ఢిల్లీలోనే పథక రచన!

పదిహేను ఏళ్లపాటు కొనసాగిన అధికారం అనూహ్యంగా కూలిపోయిన నెలరోజుల లోపాలే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ వేగంగా చీలికకు, విచ్చిన్నానికి దారితీయడం యాదృచ్ఛికంగా జరిగిన పరిణామం కాదని తెలుస్తోంది. అధికారం కోల్పోయినా 41 శాతం ఓట్లు పొందిన మమతా బెనర్జీని రాజకీయంగా 'సమాధి' చేయడంతో పాటు లోక్ సభలో మెజారిటీ లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్న బిజెపి నాయకత్వం టిఎంసి ఎంపీల మద్దతు కోసమే ఈ మొత్తం 'తిరుగుబాటు పక్రియ'కు సారధ్యం వహిస్తున్నట్లు కనిపిస్తున్నది. ఈ కుట్రకు కేంద్ర బిందువు స్పీకర్ ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించిన ఉలుబేరియా పూర్వా ఎమ్మెల్యే, మాజీ రాజ్యసభ ఎంపీ రీతాబ్రత బెనర్జీ. గత వారం రిటబ్రత ఢిల్లీ పర్యటనకు వెళ్లి, అక్కడ ముఖ్యమంత్రి సువెందు అధికారితో సమావేశమైన తర్వాత ఈ ప్రణాళికకు రచన జరిగిందని తెలుస్తోంది. రితబ్రత ఢిల్లీ నుండి తిరిగి వచ్చిన తర్వాత, ఈ ప్రణాళిక వేగం పుంజుకుంది. రితబ్రత ఎమ్మెల్యేల హాస్టల్‌లోనూ, కోల్‌కతాలోని ఒక ప్రైవేట్ హోటల్‌లోనూ వరుసగా సమావేశాలు నిర్వహించారు. టిఎంసి నాయకత్వం ఈ పరిణామాల పట్ల చాలా వరకు మౌనంగా ఉంటూ, చురుకుగా వ్యవహరించక పోవడంతో, ఆ నాయకత్వానికి వ్యతిరేకంగా ఏకం కావాలంటూ ఎమ్మెల్యేలందరికీ ఫోన్ కాల్స్ రావడం మొదలయ్యాయి. మమతా మేనల్లుడు, ఆమె రాజకీయ వారసుడిగా భావిస్తున్న అభిషేక్ బెనర్జీ అహంకారం ఈ పక్రియను వేగవంతం చేసేందుకు బిజెపికి సహకరించింది.

*అప్పుడే తిరుగుబాటు ఎమ్మెల్యేలు సమన్వయం చేసుకుని, తిరుగుబాటుకు పునాదులు వేయడం ప్రారంభించారని టీఎంసీ వర్గాలు తెలిపాయి. పైగా, తిరుగుబాటు ఎమ్మెల్యేలు తమ నాయకురాలు మమతా బెనర్జీ అంటూ, తమకు అభిషేక్ బెనర్జీ అనుచిత జోక్యంతో పాటు ఆయన తీసుకు వచ్చిన ఐ-ప్యాక్ వేధింపులే ఆగ్రహానికి గురిచేస్తున్నాయని చెబుతున్నారు.*

*" అసెంబ్లీతో అభిషేక్ బెనర్జీకి ఎలాంటి సంబంధం లేదు. ప్రజలకు కూడా ఆయనతో ఎలాంటి సంబంధం లేదు. ఒకవేళ సంబంధం ఉండి ఉంటే, ఆయన 26 రోజుల పాటు అజ్ఞాతంలో ఉండేవారు కాదు. బయటకు వచ్చేవారు. దొంగను కొట్టినట్లు ఆయనను కొట్టారు. దెబ్బలు తిన్న తర్వాత, ప్రజలు తన వైపు ఉన్నారని, కాబట్టి ప్రజలే తన భద్రతను చూసుకుంటారని అన్న అభిషేక్, తన భద్రతను పెంచాలని కోరుతూ ఆయన కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం గమనార్హం" అంటూ ప్రతిపక్ష నేత రీతాబ్రత బెనర్జీ పేర్కొనడం గమనార్హం.*


శాసనసభా పక్ష నేత ఎన్నిక విషయమై రితబ్రత, ఎంటాలీకి చెందిన మరో టిఎంసి ఎమ్మెల్యే సందీపన్ సాహా తమ సంతకాలు ఫోర్జరీ జరిగిందని ఫిర్యాదు చేశారని, అలాగే ఈ విషయాన్ని విచారిస్తున్న సిఐడి ముందు ఎమ్మెల్యేలు అరూప్ రాయ్, బహరుల్ ఇస్లాం కూడా తాము ఆ లేఖపై సంతకం చేయలేదని అంగీకరించారని స్వయంగా వెల్లడించడం ద్వారా ముఖ్యమంత్రి సువెందు అధికారి ఈ 'తిరుగుబాటు' అగ్గికి ఆజ్యం పోశారు. మూడింట రెండు వంతుల మందికి పైగా ఎమ్మెల్యేలను గెల్చుకున్న బిజెపి ప్రభుత్వం సుస్థిరతకు ఎటువంటి ఇబ్బంది లేదు. టిఎంసి ఎమ్మెల్యేలను ఆకట్టుకోవాల్సిన అవసరం లేదు. అయితే లోక్ సభలో మైనారిటీ ప్రభుత్వం నడుపుతూ, కీలకమైన బిల్లుల ఆమోదంకు ఇబ్బంది పడుతున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం టిఎంసి ఎంపీలపై కన్నేసింది. ఎమ్మెల్యేల తిరుగుబాటు తర్వాత ఎంపిలను తమవైపు తిప్పుకొనే ప్రయత్నాలు ప్రారంభం అయ్యాయి. గత డిసెంబర్ లో నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ఆమోదించుకోలేక పోయిన బీజేపీ తిరిగి ఆ బిల్లును మరోసారి పార్లమెంట్ లో ప్రవేశపెట్టేందుకు సిద్ధపడుతున్నది. అదేవిధంగా 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' బిల్లును కూడా తీసుకు రాబోతుంది. ఆ రెండు బిల్లుల ఆమోదంపై టిఎంసి, డీఎంకే ఎంపీల మద్దతు సంపాదిస్తే, మరో కొంతమంది కాంగ్రెస్, ఎస్పీ ఎంపిలను 'లోబరుచుకోవడం' పెద్ద ఇబ్బంది కాబోదని భావిస్తున్నారు. ఇప్పటికే ఇండియా కూటమి నుండి బైటకు వచ్చిన డీఎంకే తమిళనాడులో అధికారం కోల్పోయిన తర్వాత ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వ అందుకోసం ఎదురు చూస్తున్నది. ఆయా బిల్లులకు మద్దతు ఇవ్వకపోయినా వోటింగ్ సమయంలో గైరాజరైనా ప్రభుత్వంకు సహకరించినట్లు కాగలదు. అందుకనే టిఎంసి ఎంపిలను మమతకు దూరం చేయడం ఆ పార్టీకి అవసరం. "పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి మద్దతు అవసరం లేదు. ఎంపీలను గెలుచుకోవడమే మా ప్రాధాన్యత. టీఎంసీ చీలిపోయిన తర్వాత, దాని ఎంపీలు ఒక ప్రత్యేక కూటమిగా ఏర్పడవచ్చు. మా ప్రతిష్ఠాత్మక చట్టాలకు అవసరమైన సంఖ్యాబలం కోసం వారి మద్దతును బీజేపీ ఉపయోగించుకోవచ్చు," అని ఈ పరిణామాలపై అవగాహన ఉన్న ఒక సీనియర్ బీజేపీ నాయకుడు పేర్కొన్నారు.



బెంగాల్‌లోని పరిణామాలను, 2022లో మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బిజెపికి దోహదపడిన శివసేన, ఎన్సీపీ చీలికలతోనూ; అలాగే, రాఘవ్ చద్దా నేతృత్వంలో ఆప్ కు చెందిన 10 మంది రాజ్యసభ సభ్యులలో ఏడుగురు బీజేపీలో చేరడం ద్వారా, 245 మంది సభ్యులు కలిగిన ఎగువ సభలో ఎన్డీయే బలాన్ని 141కి చేర్చిన ఆప్ లోని ఇటీవలి చీలికతోనూ రాజకీయ పరిశీలకులు పోల్చి చూస్తున్నారు. పైగా, తన పార్టీని విచ్చిన్నం చేయడానికి ఢిల్లీలో కుట్ర జరిగిందని మమతా బెనర్జీ బహిరంగంగా ఆరోపించడం గమనార్హం. ఫేస్‌బుక్ లైవ్‌లో టీఆమె మాట్లాడుతూ, "గతంలో సీపీఎంలో ఉన్న వ్యక్తి (రీతాబ్రత బందోపాధ్యాయ్) ఇదంతా చేస్తున్నాడు. ఇతరులకు టికెట్లు దక్కకుండా చేసి మేమే అతనికి టికెట్ ఇచ్చాం. దీనివల్ల నష్టపోయిన వారికి నా క్షమాపణలు" అని చెప్పారు. "మా పార్టీకి చెందిన 2,500 కార్యాలయాలు ధ్వంసమయ్యాయి, వేలాది మంది కార్యకర్తలను అరెస్టు చేశారు. పోలీసులు మా ఎమ్మెల్యేలను బెదిరిస్తూ, ఇళ్లలోంచి బయటకు రావద్దని చెబుతున్నారు. మేమే బహిష్కరించిన వ్యక్తికి (రీతాబ్రత బెనర్జీకి) మద్దతు ఇచ్చి, మా పార్టీని విచ్చిన్నం చేయమని పోలీసులు ఎమ్మెల్యేలను కోరుతున్నారు" అంటూ ఆమె ఆరోపించారు. "మా శాసనసభ పక్షాన్ని చీల్చిన తర్వాత బిజెపి నాయకులు ఊరికే కూర్చోరు. పార్లమెంటులో కూడా అభిషేక్ బెనర్జీని వారు ఉక్కిరిబిక్కిరి చేస్తారు. మా ఎంపీలలో మూడింట రెండు వంతుల మంది అతి త్వరలోనే తిరుగుబాటు చేస్తారని మేము భావిస్తున్నాము. అది టిఎంసి పతనానికి చివరి మేకు అవుతుంది. ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌ల మాదిరిగానే, తిరుగుబాటు చేసిన టిఎంసి సభ్యులకు కూడా పార్టీ గుర్తుపై, పార్టీ పేరుపై హక్కులు లభిస్తాయి," అని ఒక సీనియర్ టిఎంసి ఎంపీ ఒకరు జరుగుతున్న పరిణామాలను వివరించారు. వాస్తవానికి పార్టీ ఓటమి ఖాయమని స్పష్టమైన వెంటనే, మే 4వ తేదీ నుంచే పార్టీలో కొందరు నాయకులు నాయకత్వాన్ని విమర్శించడం ప్రారంభించారు. రెండు రోజుల తర్వాత పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ నివాసంలో జరిగిన ఒక సమావేశంలో అసమ్మతికి వెలువడిన తొలి సంకేతాన్ని మమతా గమనించక పోవడంతోనే ఇప్పుడు ఆమెకు నిస్సహాయ పరిస్థితులు నెలకొన్నాయి. ఆ సమావేశంలో 'మనం ఓడిపోలేదు.. మనమే గెలిచాము..' అంటూ మమతా బెనర్జీ తన మేనల్లుడుకు నిలబడి చప్పట్లు కొట్టమని హాజరైన ఎమ్మెల్యేలందరినీ కోరడంతో చాలామంది తట్టుకోలేకపోయారు. చాలా మంది సీనియర్ ఎమ్మెల్యేలు అలా చేయలేదు, కానీ వారు ఏమీ అనలేదు కూడా. ఎన్నిక వాయిదా పడిన ఫల్తా నియోజకవర్గంలో బలమైన నాయకుడిగా గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ పార్టీతో కనీసం సంప్రదించకుండానే తాను పోటీ నుండి నిష్క్రమిస్తున్నట్లు పోలింగ్ కు రెండు రోజుల ముందు ప్రకటించినా అతనిపై ఎటువంటి చర్య తీసుకోకూడదని తీసుకున్న నిర్ణయం పార్టీ వర్గాలలో విస్మయాన్ని రగిలించింది. అభిషేక్‌కు సన్నిహితుడు కావడంతోనే అతనిపై చర్య తీసుకోవడం లేదంటూ రగిలిపోయారు. "అంతేకాదు, నాయకత్వం, ముఖ్యంగా అభిషేక్ బెనర్జీ చాలా అహంకారంతో ప్రవర్తించారు. అంతటి ఘోర పరాజయం తర్వాత కూడా, జహంగీర్ ఖాన్ విషయంలో పార్టీ ఏం చేస్తోందని అడిగినప్పుడు, ఆయన కేవలం 'పార్టీ ట్వీట్ చూడండి' అని మాత్రమే అన్నారు. మమతా బెనర్జీ కూడా తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనని ప్రకటించారు. ఆ తర్వాతే తిరుగుబాటుకు బీజాలు పడ్డాయి," అని ఒక సీనియర్ టీఎంసీ ఎమ్మెల్యే వెల్లడించారు. అప్పుడే తిరుగుబాటు ఎమ్మెల్యేలు సమన్వయం చేసుకుని, తిరుగుబాటుకు పునాదులు వేయడం ప్రారంభించారని టీఎంసీ వర్గాలు తెలిపాయి. పైగా, తిరుగుబాటు ఎమ్మెల్యేలు తమ నాయకురాలు మమతా బెనర్జీ అంటూ, తమకు అభిషేక్ బెనర్జీ అనుచిత జోక్యంతో పాటు ఆయన తీసుకు వచ్చిన ఐ-ప్యాక్ వేధింపులే ఆగ్రహానికి గురిచేస్తున్నాయని చెబుతున్నారు. "అసెంబ్లీతో అభిషేక్ బెనర్జీకి ఎలాంటి సంబంధం లేదు. ప్రజలకు కూడా ఆయనతో ఎలాంటి సంబంధం లేదు. ఒకవేళ సంబంధం ఉండి ఉంటే, ఆయన 26 రోజుల పాటు అజ్ఞాతంలో ఉండేవారు కాదు. బయటకు వచ్చేవారు. దొంగను కొట్టినట్లు ఆయనను కొట్టారు. దెబ్బలు తిన్న తర్వాత, ప్రజలు తన వైపు ఉన్నారని, కాబట్టి ప్రజలే తన భద్రతను చూసుకుంటారని అన్న అభిషేక్, తన భద్రతను పెంచాలని కోరుతూ ఆయన కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం గమనార్హం" అంటూ ప్రతిపక్ష నేత రీతాబ్రత బెనర్జీ పేర్కొనడం గమనార్హం."అయితే, మా ప్రధాన లక్ష్యం అభిషేక్ బెనర్జీనే. మేము మమతా బెనర్జీకి వ్యతిరేకం కాదు. కానీ అభిషేక్ నాయకత్వాన్ని మాత్రం ఇకపై అంగీకరించలేము," అని ఒక తిరుగుబాటు ఎమ్మెల్యేలు చెప్పారు.

పైగా, తాము బిజెపితో చేతులు కలపలేమని, బిజెపికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో తమకు మమతా బెనర్జీ అవసరం ఎంతైనా ఉందని ముఖ్యంగా మైనారిటీ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు స్పష్టం చేస్తున్నారు. అయితే శాసన సభ్యుల తిరుగుబాటుతో టిఎంసిలో వ్యవహారాలు పరిమితం కాబోవని, టిఎంసి పార్లమెంటరీ పార్టీలో వారం రోజుల్లోపే చీలిక ఏర్పడవచ్చని అందరికి తెలిసిందే. టిఎంసిలో ఏర్పడే చీలిక, లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించాలనే లక్ష్యంతో రూపొందించిన 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' బిల్లు ఆమోదాన్ని సాధించే దిశగా బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను కూడా సులభతరం చేయవచ్చు. ప్రస్తుతం, బీజేపీ నాయకుడు పి.పి. చౌదరి అధ్యక్షతన ఉన్న 39 మంది సభ్యుల సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఈ బిల్లును పరిశీలిస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే ఈ బిల్లు దశలవారీ అమలును ప్రారంభించేందుకు వీలుగా, దీనిని వీలైనంత త్వరగా ఆమోదించుకోవాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. డీఎంకే వంటి ప్రాంతీయ పార్టీలు లేవనెత్తిన కీలక ఆందోళనలను దృష్టిలో ఉంచుకొని హోం మంత్రిత్వ శాఖ సవరించిన సవరించిన నియోజకవర్గాల పునర్విభజన ముసాయిదా బిల్లును సిద్ధం చేస్తోందని తెలుస్తున్నది. ఏప్రిల్‌లో లోక్‌సభలో ఈ బిల్లు వచ్చినప్పుడు, కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీలకు చెందిన ఎంపీలతో సహా 230 మంది ఎంపీలు దీనిని వ్యతిరేకించడంతో, ఇండియా కూటమి ఏకతాటిపై ఓటు వేసింది. ఎన్డీఏ బలం 298గా ఉంది.

ప్రస్తుత లోక్‌సభలో డీఎంకేకు 22 మంది ఎంపీలు ఉండగా, టీఎంసీకి 28 మంది ఉన్నారు. లోక్‌సభ విస్తరణను మహిళా రిజర్వేషన్ చట్టం అమలుతో ముడిపెట్టడాన్ని ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించాయి. డీలిమిటేషన్ వల్ల దక్షిణ రాష్ట్రాల రాజకీయ ప్రాబల్యం తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి. "ఏకకాల ఎన్నికల బిల్లుకు గానీ, లేదా మరే ఇతర రాజ్యాంగ సవరణకు గానీ డీఎంకే మద్దతు ఇవ్వడానికి అంగీకరిస్తే, 543 మంది సభ్యులున్న పూర్తి సభలో మూడింట రెండు వంతుల మెజారిటీకి ఎన్డీఏకు కేవలం 42 ఓట్లు మాత్రమే అవసరం అవుతాయి. 15, 20 లేదా 25 మంది ఎంపీలతో కూడిన ప్రత్యేక టీఎంసీ కూటమి, బీజేపీని ఆ మెజారిటీకి మరింత చేరువ చేస్తుంది," అని సభా నిర్వహణలో పాలుపంచుకుంటున్న ఒక సీనియర్ బిజెపి ఎంపీ తెలిపారు. టిఎంసిలో చీలిక ఈ మొత్తం ఎత్తుగడలో ఓ కీలకమైన అడుగు అని చెప్పవచ్చు.



చలసాని నరేంద్ర

9849569050

# ప్రకృతి హెచ్చరికలను వినాల్సిన సమయం

ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటాం. కానీ ఈ రోజు కేవలం మొక్కలు నాటడం, సందేశాలు పంచుకోవడం లేదా కార్యక్రమాలు నిర్వహించడం కోసం మాత్రమే కాదు. భూమి ఎదుర్కొంటున్న అతిపెద్ద సంక్షోభాలలో ఒకటైన వాతావరణ మార్పుల (Climate Change) గురించి ఆలోచించి, చర్యలు ప్రారంభించాల్సిన రోజు కూడా. ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సముద్ర మట్టాలు ఎగబాకుతున్నాయి. ఒకప్పుడు క్రమబద్ధంగా ఉండే ఋతువులు ఇప్పుడు అనిశ్చితంగా మారుతున్నాయి. ఎండలు, వరదలు, తుఫానులు, కరవులు గతంతో పోలిస్తే మరింత తీవ్రంగా, తరచుగా సంభవిస్తున్నాయి. ఇది భవిష్యత్తు గురించి చెప్పే హెచ్చరిక కాదు; ప్రస్తుతం మనం అనుభవిస్తున్న వాస్తవం.



**భారతదేశానికి పెరుగుతున్న ముప్పు**

భారతదేశం వాతావరణ మార్పుల ప్రభావానికి అత్యంత సున్నితమైన దేశాలలో ఒకటి. గత కొన్నేళ్లుగా దేశంలో అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో 45 నుండి 50 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు చేరుతున్నాయి. మరోవైపు, కొన్ని ప్రాంతాల్లో తక్కువ రోజులే వర్షం కురిసినా, ఒకేసారి కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీని వల్ల మూడు ప్రధాన సమస్యలు ఏర్పడుతున్నాయి. భూగర్భ జలాలు పునరుద్ధరించుకునే అవకాశం తగ్గిపోతోంది. నేల కోత పెరిగి సారవంతమైన మట్టి నష్టపోతోంది. వ్యవసాయ ఉత్పాదకత దెబ్బతింటోంది.రైతులు విత్తిన పంటలు కోతకు వచ్చే సమయానికి అకాల వర్షాలు కురవడం, పంటలు నేలకూలిపోవడం, వరదల్లో మునిగిపోవడం వంటి సంఘటనలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా వరి సాగు ప్రాంతాల్లో నీటి వినియోగం అధికంగా ఉండటంతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోంది.

**పర్యావరణ సమస్య కాదు... అభివృద్ధి సమస్య**

వాతావరణ మార్పులను చాలామంది ఇప్పటికీ కేవలం పర్యావరణ సమస్యగా మాత్రమే చూస్తున్నారు. కానీ ఇది ఆర్థిక, సామాజిక, ఆరోగ్య, ఆహార భద్రత సమస్య కూడా. ఒక రైతు పంట కోల్పోతే అది కేవలం వ్యవసాయ నష్టం కాదు. అతని కుటుంబ ఆదాయం తగ్గుతుంది. అప్పులు పెరుగుతాయి. పిల్లల చదువు ప్రభావితం అవుతుంది. చివరకు ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ "క్లైమేట్ మైగ్రేషన్" ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతోంది. గ్రామాల్లో జీవనాధారాలు క్షీణిస్తే ప్రజలు నగరాలపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో నగరాలపై కూడా అదనపు భారం పడుతోంది.

**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక సవాళ్లు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వాతావరణ మార్పుల ప్రభావం ఇప్పటికే కనిపిస్తోంది. వేసవి కాలం మరింత పొడవుగా మారుతోంది. భూగర్భ జలాల మట్టాలు అనేక ప్రాంతాల్లో తగ్గుతున్నాయి. అకాల వర్షాలు వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్నాయి. తీరప్రాంతాల్లో సముద్ర మట్టం పెరుగుదల, తుఫానుల తీవ్రత పెరుగుతోంది. గ్రామీణ ఉపాధిపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ప్రత్యేకించి గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాల్లో ఉప్పునీటి చొరబాటు, తీరప్రాంత కోత వంటి సమస్యలు భవిష్యత్తులో మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది.

**పరిష్కారం ఏమిటి?** : వాతావరణ మార్పులను పూర్తిగా ఆపడం ఒక్క దేశం లేదా ఒక్క ప్రభుత్వం వల్ల సాధ్యం కాదు. కానీ దాని ప్రభావాలను తగ్గించడం మాత్రం మన చేతుల్లో ఉంది.

**ప్రకృతి ఆధారిత పరిష్కారాలు :** అటవీ సంపదను పెంచడం, చెరువులు పునరుద్ధరించడం, మంగ్రూవ్ అడవులను సంరక్షించడం వంటి చర్యలు కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో కీలకం.

**నీటి నిర్వహణ :** వర్షపు నీటి సంరక్షణ, సూక్ష్మ సాగు పద్ధతులు, వాటర్ షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు అత్యవసరం.

**వ్యవసాయంలో మార్పులు:** అధిక నీటి అవసరమున్న పంటల నుంచి తక్కువ నీటి అవసరమున్న పంటలు, కూరగాయలు, పండ్ల తోటల వైపు రైతులను ప్రోత్సహించాలి. పంటల వైవిధ్యీకరణ (Crop Diversification) భవిష్యత్తుకు రక్షణ కవచంగా మారవచ్చు.

**పునరుత్పాదక శక్తి :** సౌర, పవన శక్తి వినియోగాన్ని మరింత విస్తరించాలి. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించాలి.

*నేల కోత పెరిగి సారవంతమైన మట్టి నష్టపోతోంది. వ్యవసాయ ఉత్పాదకత దెబ్బతింటోంది.రైతులు విత్తిన పంటలు కోతకు వచ్చే సమయానికి అకాల వర్షాలు కురవడం, పంటలు నేలకూలిపోవడం, వరదల్లో మునిగిపోవడం వంటి సంఘటనలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా వరి సాగు ప్రాంతాల్లో నీటి వినియోగం అధికంగా ఉండటంతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోంది.*

**ప్రజల భాగస్వామ్యం :** ప్రభుత్వాలు మాత్రమే కాదు, ప్రతి పౌరుడు కూడా తన జీవనశైలిలో మార్పులు తీసుకురావాలి. విద్యుత్ పొదుపు, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, చెట్ల సంరక్షణ వంటి చిన్న చర్యలు కూడా పెద్ద మార్పుకు దోహదం చేస్తాయి.

**మాటల నుంచి చేతల వైపు** : ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రతి ఏడాది వస్తుంది. ప్రసంగాలు, కార్యక్రమాలు కూడా జరుగుతాయి. కానీ ప్రకృతి మాత్రం ప్రతి ఏడాది మరింత గట్టిగా హెచ్చరిస్తోంది. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, అనూహ్య వరదలు, కరవులు, తుఫానులు ఆ హెచ్చరికలే. వాతావరణ మార్పులు రాబోయే తరాల సమస్య కాదు. ఇది నేటి సమస్య. మన గ్రామం, మన రైతు, మన నీరు, మన ఆహారం, మన ఆరోగ్యం అన్నింటినీ తాకుతున్న సంక్షోభం. ఈ జూన్ 5న మనం పర్యావరణాన్ని కేవలం సంరక్షించాల్సిన వనరుగా కాకుండా, మన మనుగడకు ఆధారమైన జీవన వ్యవస్థగా గుర్తించాలి. ప్రకృతితో యుద్ధం చేసే సమయం ముగిసింది. ప్రకృతితో సహజీవనం నేర్చుకునే సమయం వచ్చింది. పర్యావరణాన్ని కాపాడటం ఒక ఎంపిక కాదు... భవిష్యత్తును కాపాడుకోవడానికి తప్పనిసరి బాధ్యత.



శ్యాంమోహన్

9440595858

# ప్రకృతిని ప్రేమిద్దాం.. జీవాన్ని రక్షిద్దాం

విశ్వంలో జీవరాశుల మనుగడకు మూలాధారం అయినభూమి' గాలి నీరు ' నింగి 'నిప్పు'నేల అనే పంచభూతాలను ప్రకృతే ఈ విశ్వానికి అందించింది. పంచ భూతాల నిష్పత్తిలో సమతౌల్యత లోపించి మానవ జీవనం అస్తవ్యస్తమౌతుంది. మానవాళి పలు విపత్తులకు గురౌతుంది . ప్రకృతి వాతావరణ పర్యావరణ సమతుల్యత మానవ మనుగడకు అత్యంత అవసరం. ఆధునికీకరణ 'పారిశ్రామికీకరణ పట్టణీకరణ' శీఘ్రంగా విస్తరిస్తున్న కార్పోటీకరణ' శాస్త్ర 'సాంకేతిక రంగాల్లో సంభవిస్తున్న పరిణామాలు ప్రకృతి విధ్వంసం దిశగా కొనసాగి పర్యావరణం పలు సవాళ్ళను ఎదుర్కొంటుంది. మానవుడు తన భౌతిక అవసరాల కోసం తరతరాల ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాడు. ప్రకృతి మీద ఆధిపత్యం సాదిస్తున్ననానే మాయలో పడి మానవ మనుగడకు ఆధారమైన ప్రకృతి రక్షిస్తే అది మనలను రక్షిస్తుంది అన్న వాస్తవాన్ని మరిచిపోవడం గమనార్హం. "ప్రకృతి రక్షితే మానవ రక్షిత "అన్న సత్యాన్ని మరువ కూడదు.

మానవుడు చేసే చర్యలు భవిష్యత్ తరాలకు శాపంగా పరిణమించే ప్రమాదాన్ని గుర్తించక పోవడం శోచనీయం.

**తప్పిదాలు పర్యావరణం**

19వశతాబ్దం నుండి మానవ తప్పిదాల వల్ల ప్రకృతి విధ్వంసానికి గురౌతుంది. ప్రకృతిలో మానవుడు తప్ప మిగతా జీవరాశి (జీవులు) ప్రకృతి చెప్పినట్లు ప్రవర్తిస్తున్నాయి. ప్రకృతికి భిన్నంగా నడిచే మానవుడు చేసే ప్రతికూల చర్యల వలన ఏపాపం ఎరుగని మూగజీవాలు భారీమూల్యం చెల్లించ వలసి వస్తుంది. మానవుడు సాధించిన శాస్త్ర సాంకేతిక ప్రగతి మరియు జీవావరణ రంగాల్లో సాధించిన ప్రగతి దాని వల్ల కలిగిన మార్పులు మాత్రం ప్రకృతి స్వచ్ఛతకు ఉనికికి ముప్పుగా పరిమించాయి. ఒక పక్క వ్యవసాయరంగంలో హరితవిప్లవం తర్వాత అధిక దిగుబడులు పెంచేందుకు అధిక ఉత్పాదకత పేరున విచ్చలవిడిగా వినియోగించిన రసాయనిక ఎరువులు' క్రిమిసంహారక మందుల వాడకం ఎక్కువైంది. దీనివల్ల పంట దిగుబడి పెరిగింది కాని గాలి 'నీరు' . నేల 'కలుషితమైనాయని పలు అధ్యయనాలు వెల్లడించాయి. .వ్యవసాయ రంగములో ఉపయోగిస్తున్న క్రిమిసంహారకమంధులు(అనేక వ్యాధులకు) రోగకారకాలు అవుతూ ప్రజారోగ్యనికి ప్రమాదకరంగా పరిణమించింది. మరోపక్క అతినీలలోహిత కిరణాల నుండి మానవులను కాపాడే "ఓజోన్ పొరలో" మానవాళి స్వార్థం వల్ల ఏర్పడిన రంధ్రాలు రాను రాను విస్తరిస్తున్నాయి.వీటికి తోడు పట్టణీకరణ 'పారిశ్రామిక విప్లవం జనాభా పెరుగుదల'– రియల్ ఎస్టేట్ వ్యాపారం 'అడవుల నరికివేత సహజవనరుల విధ్వంసం మితి మీరిన ప్లాస్టిక్ వాడకం ప్రకృతిని పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయి. కేంద్ర' రాష్ట్ర 'స్థానిక ప్రభుత్వాలు అభివృద్ధి పేరున భారీ ప్రాజెక్టులను కాలుష్యకారక పరిశ్రమలను స్థాపిస్తు పర్యావరణం జీవావరణం ప్రకృతి విధ్వంసానికి పాల్పడడం గమనార్హం. దీనివల్ల అనేక సంఖ్యలో వృక్ష జాతులు జంతు జాతులు అంతరించాయి. మరికొన్ని అంతరించి పోతున్న జాబితాలోకి చేరాయి.

**ప్రకృతి రక్షణ తో సుస్తిరాభివృద్ధి**

మానవుడు ఉన్నన్ని రోజులు ప్రకృతి వనరులను ఉపయోగించుకోవాలి. తర్వాత తరానికి అందించాలి. ప్రకృతి వనరులు తరతరాల వారసత్వ సంపద వాటిని రక్షించాలి. భావి తరాల కోసం వీటిని భద్రపరచాలి. విధ్వంసం చేయకూడదు.వనరులను అనుభవించె హక్కుమాత్రమే వుంది. సమస్త జీవకోటితో నిండిన ప్రకృతిని సమిష్టిగా పంచుకోవాలి. గడచిన తరాలు ప్రకృతి వనరులను పొదుపుగా వాడుకున్నారు.ప్రకృతి పర్యావరణాన్ని సంతులిన పద్దతిలో ఉపయోగించారు.

**ప్రకృతి భూమిని మాతగా ఆరాధన**

భారతదేశములో ప్రకృతిని దేవతగా ఆరాధించే సంస్కృతి వుందన్న చారిత్రిక సత్యాన్ని మరిచిపోకూడదు .ఆధునికీకరణ పేరుమీద ప్రకృతి సహజ వనరులను విచక్షణ రహితంగా అపరిమితంగా వినియోగిస్తూ పరిమితవనరులను కాలుష్యం చేస్తూ భావి తరాల వారికి ఆర్థిక 'ఆరోగ్య సమస్యలను కానుకగా ఇస్తున్నాం.వారసులకు సంపద ఇవ్వాలని పోటీ పడుతున్న సమాజంలో స్వచ్ఛత గల ప్రకృతి పర్యావరణాన్ని ఇవ్వాలన్న స్పృహ లోపించింది.సుస్థిరాభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగించే దోరిణిని సమాజం విడనాడాలి. విచక్షణా రహితంగా అటవీ సందను ద్వంసం చేయడం కొల్లగొట్టడంవల్ల 33శాతం వుండాల్సిన అడవులు నేడు దేశములో21శాతానికిమించి లేవు.సగటున రోజుకు 333 ఎకరాల అటవీభూమి అదృశ్యమై పోతున్నట్లుసర్వేలు చెబుతున్నాయి.విచక్షణ రహితంగా అటవీ సంపదను విధ్వంసం చేయటం వల్ల ప్రకృతి విపత్తులు 'అకాల వర్షాలు వరదలు వచ్చి అపారమైన' ఆస్తినష్టం ప్రాణ నష్టం సంభవిస్తుంది. మానవ చర్యల వల్ల గాలి కాలుష్యం అవుతుంది.గాలి కాలుష్యం వల్ల ప్రతి యేటా 70లక్షల మంది మృత్యు వాత పడుతున్నారని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్(WHO) తన నివేదికలో వెల్లడించింది. వరదలు'వానలవల్ల కలుషితమైన నీరుతాగి రోగాల బారిన పడి యేటా2లక్షల మంది చనిపోతున్నరాని నీతిఆయోగ్ గణాంకాలు తెలియచేస్తున్నాయి. వ్యవసాయ' పారిశ్రామిక రంగాల విస్తరన వల్ల 85 శాతం చిత్తడి నేలలను ప్రపంచం కోల్పోయింది.75 శాతం భూఉపరితలం మార్పుకు లోనయ్యింది. .66 శాతం సముద్ర విస్తీర్ణం ప్రభావితమైందన్న అధ్యయనాంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆధునిక సౌకర్యాల పేరు మీద మానవుడు విలాస జీవితానికి అలవాటుపడి కాలుష్య కారకమైన వస్తువులను ఉపయోగిస్తూ పర్యావరణానికి హాని చేస్తున్నాడు.పారిశ్రామికీకరణ పట్టణీకరణ విస్తరణ ఫలితంగా వాతావరణములోకి అపరిమిత కర్భన ఉద్గారాలువిడిచి పెట్టడంవల్ల భూగోళం అగ్నిగోలంగ మారి"సిగ్లో భల్ వార్మింగ్ "కారణమై ఓజోన్ పొర క్షీణతకు మానవ చర్యలే ప్రత్యక్షంగా కారణం కావడం అంతే గాకుండా మనకు ఊపిరిని ఇచ్చేవాయువును కూడ కాలుష్య భరితం చేశాం. పెరుగుతున్న వాయు నీరు కాలుష్యం★ మనం పీల్చుకునే వాయువు కాలుష్య భరితమైయింది . నదీ జలాలు కలుషితమై తాగునీటి కోరత ఏర్పడింది. పంటల దిగుబడి లోకీలక పాత్ర పోషించే తేనెటీగలు..ఊరపిచ్చుకలు అంతరించిపోతున్నాయి .పంటల దిగుబడి తగ్గి ఆహారోత్పత్తి కోరతఏర్పడి ఆహార విపత్తు ఏర్పడే ప్రమాదంఉందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్★ అనే అంతర్జాతీయ సంస్థ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యతులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ప్రకృతి పర్యావరణం పట్ల జరుగుతున్న నిర్లక్ష్యం విధ్వంసం ' ఇలాగే కొనసాగితే ప్రపంచములోని ప్రతి నాలుగు జీవజాతుల్లో ఒకటి అంతరించిపోయే దశలో ఉన్నట్లు అభిప్రాయపడింది . మానవుడు తన మేధస్సు ద్వారా అనేక పరిశోధనలుచేశాడు. ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానం ద్వారా అనేక ఆవిష్కరణలు చేశాడు.ఆధునిక టెక్నాలజీ వల్లఎంతోప్రగతి' పురోగతి అభివృద్ధి సాధించాడు.సాధించిన ప్రగతి ప్రకృతి పర్యావరణ వినాశన కరంగా పరిణమించింది. ప్రకృతిని రక్షించుకునే స్థితి రోజురోజుకు క్షీణిస్తుంది.దీనివల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించి ఋతువులు గతి మారుతున్నాయి.ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగి పోతున్నాయి.వరదలు తుఫానులు' భూకంపాలు 'అగ్నిపర్వతాలు '"సునామీ" లు మానవ జాతిని భయపెడుతున్నాయి ."కరోనా "లాంటి ప్రాణాంతక వైరస్‌లు సులువుగా విజృంభించి మానవ జాతిని మృత్యు కుహరంలోకి నెట్టినప్పటికి ప్రకృతి విధ్వంసాన్ని అదుపు చేయక పోవడం శోచనీయం. ప్రకృతి ఉపద్రవాలు'మానవ దోషాలు ఒకదానికి ఒకటి తోడై ప్రపంచ మానవాళి నేడు భయం గుప్పెట్లో బతుకుతున్నారు.ప్రకృతి పర్యావరణ విధ్వంసాన్నిఆపాలి. సహజవనరుల సంరక్షణ ఉపయోగం గురించి అవగాహన కలిగించడానికి ప్రకృతి పరిరక్షణ పర్యావరణ పరిరక్షణ పద్ధతుల పట్ల ప్రజలకు అవగాహన చైతన్యము'శిక్షణా కార్యక్రమాలను సదస్సులను ఏర్పాటు చేస్తారు. ప్రకృతి పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్నిప్రతి యేటా జూన్ 5 నాడు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు.భూమికి కలుగుతున్న రకరకాల కాలుష్యాలను ఎలా తగ్గించాలో చర్చిస్తారు.

పర్యావరణ దినోత్సవాన్ని ఐ'రా'స ప్రకటించింది. .మానవ పర్యావరణం అనే అంశంపై స్వీడన్ రాజధాని స్టాక్ హోం వద్ద సదస్సు నిర్వహించింది 1974 లో తొలి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరిపింది. ఈ రోజు మాత్రమే ప్రపంచ దేశాలు భూమి పై ఎంతో ప్రేమను చూపిస్తాయి. భూమికి అత్యంత హాని చేస్తుంది మానవుడే. ప్రపంచం లోని అనేక దేశాల ప్రభుత్వాలు రకరకాల కాలుష్యాలను సముద్రాల్లో కి పంపిస్తునాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు 'అధిక జనాభా. 'వీటికి తోడు బూతాపం. ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో పెరుగుతున్న ఎండలు దీనికి కారణం భూతాపమే

తెలంగాణలో 9 యేళ్ళుగా హరిత హారములో కోట్ల మొక్కలు నాటిన చల్లదనం రావటం లేదు దానికి కారణము వాయుకాలుస్యం పెరగడమే భూమి పై ఉన్న అనేక రకాల జంతువులు ప్రాణులు అంతరిస్తున్నాయి. పక్షులు తేనె తీగలు పిచ్చుకలు తగ్గిపోవడం వల్ల ఆహార పంటల దిగుబడి తగ్గి కొరత ఏర్పడుతుంది. ఎరువులు పురుగు మందుల వినియోగం పెరగడం వల్ల భూమి సారవంతాన్ని కోల్పోయి బూమి నాశన మౌతుంది. సముద్ర జీవులను బతకనివ్వడం లేదు. ప్రకృతి పర్యావరణ వేత్తలు ఆందోళన★ ప్రభుత్వాలు మాటలే తప్ప చేతల్లో పర్యావరణ రక్షణ కనిపించడం లేదని ప్రకృతి పర్యావరణ శాస్త్ర వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం థీమ్ ప్రకృతి ప్రేరణతో వాతావరణం కోసం మన భవిష్యత్తు కోసం అంటే మనం ప్రకృతిని నాశనం చేయడం ఆపి దాని నుండి పాఠాలు నేర్చుకుని మన భూమిని కాపాడుకోవాలని ఐక్యరాజ్యసమితి మనల్ని హెచ్చరిస్తుంది . పర్యావరణాన్ని రక్షించడం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు మనందరి బాధ్యత. దీనికోసం మనం పెద్ద పెద్ద పనులు చేయనక్కర్లేదు చిన్న మార్పులు చేస్తే చాలు.





నేదునూరి కనకయ్య

అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం

కరీంనగర్,

9440245771



# జాతీయం-అంతర్జాతీయం



## పంజాబ్‌లో తీవ్ర ఉద్రిక్తత

● ఐదు ప్రముఖ గుడులకు బాంబు బెదిరింపు.. రంగంలోకి దిగిన బలగాలు



పంజాబ్‌లోని ఐదు ప్రముఖ దేవాలయాలకు గురువారం బాంబు బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. కొన్ని ప్రభుత్వ సంస్థల్లో కూడా పేలుళ్లు జరుపుతామని ఆ ఈమెయిల్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దాంతో అప్రమత్తమైన వారు ఆ ఆలయాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మరో రెండు రోజుల్లో ఆపరేషన్ బ్లూ స్టార్‌కు 42 ఏళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.అమృత్‌సర్‌లోని దుర్గియానా ఆలయం, పఠాన్‌కోట్‌లోని ముక్తేశ్వర్ ధామ్ ఆలయం, జలంధర్‌లోని దేవీ తలాబ్ మందిర్, భటిండాలోని మైసర్ ఖానా ఆలయం, పటియాలాలోని మాతాకాళీ ఆలయానికి ఈ బెదిరింపులు వచ్చాయి. ఆపరేషన్ బ్లూస్టార్ )కు 42 ఏళ్ల కావొస్తుండటంతో ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు.. ఈ బెదిరింపు మెయిల్‌తో మరింత అప్రమత్తమయ్యారు. ఇప్పటికే దేవీ తలాబ్ ఆలయం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గుర్తించలేదని వెల్లడించారు. ప్రజలను భయపెట్టే ఉద్దేశంతో చేసిన నకిలీ బెదిరింపులుగా కనిపిస్తున్నప్పటికీ.. ఎలాంటి రిస్క్ తీసుకోబోమన్నారు. 1984 జూన్‌లో ఆపరేషన్ బ్లూ స్టార్ కొనసాగింది. ప్రార్థనాలయంలో దాక్కున్న తీవ్రవాదులను పట్టుకునేందుకు భారత సైన్యం సైనిక చర్య చేపట్టింది. మేజర్ జనరల్ బ్రార్ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ 'ఆపరేషన్ బ్లూ స్టార్'.. భారత సైన్యం చేపట్టిన అతి పెద్ద సైనిక చర్యల్లో ఒకటిగా నిలిచింది. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఆదేశాల మేరకు చేపట్టిన ఆ సైనిక చర్యలో 83 మంది భారత సైనికులు అమరులయ్యారు. వేర్పాటువాద నేత భింద్రన్ వాలేతో పాటు ఇతర వేర్పాటువాద నేతలూ హతమయ్యారు

## ఇరాన్ సరిహద్దుల్లో
# మొదలైన అలజడి
## అంతర్జాతీయ సమాజంలో ఆందోళన



ఇరాన్‌తో యుద్ధం విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్ జరిపే దాడుల్లో అమెరికా సైనికులు చనిపోనంతవరకు.. యుద్ధం తిరిగి ప్రారంభించకూడదని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ట్రంప్ తన సహాయకులతో చెప్పినట్లు అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

పశ్చిమాసియాలో ఘర్షణలు, వైమానిక దాడులు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణ అమల్లోనే ఉంటుందని ట్రంప్ స్పష్టం చేశారు. అయితే, ఇరాన్ దాడుల్లో అమెరికా సైనికులు మరణిస్తే.. ఆ కాల్పుల విరమణను ముగించే విషయాన్ని పరిశీలిస్తానని ట్రంప్ తన సలహాదారులతో పేర్కొన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఒప్పంద చర్చల్లో తమ డిమాండ్లు ఆమోదించేవరకు చిన్నపాటి ఘర్షణలు నిర్వహించాలని ఆయన యోచిస్తున్నట్లు వెల్లడించాయి. ఇక, ఈ కాల్పుల విరమణపై ఓవల్ ఆఫీసులో విలేకరులతో మాట్లాడుతూ.. ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీజ్ ఫైర్ అనే పదానికి ఇరాన్‌లో భిన్నమైన అర్థం ఉందని ట్రంప్ అన్నారు. టెహ్రాన్ దృష్టిలో తాత్కాలిక సంధి అంటే పరిమితంగా కాల్పులు జరపడమేనని వారు భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. అయితే, వారు అలా అనుకోవడం కూడా మంచి విషయమేనని వ్యాఖ్యానించారు. ఏప్రిల్‌లో అమెరికా ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. అయినప్పటికీ.. ఇరుదేశాల మధ్య సైనిక ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి.

## సమయస్ఫూర్తితో సాహసం

రూ.2 లక్షల పరుపులు పరిచి ప్రాణాలు నిలిపారు!



దిల్లీలోని ఓ హోటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో విదేశీయులు సహా 21 మంది మృతి చెందారు. ఆ సమయంలో సమీపంలోనే ఉన్న పరుపుల దుకాణం యజమాని రియాజుద్దీన్ మన్సూరి, అతని కుమారుడు అర్మాన్ సకాలంలో స్పందించకపోయి ఉంటే పరిస్థితి మరింత దిగజారేదే! క్లిష్ట సమయంలో వారు మానవత్వం చాటుకున్నారు. తమ దుకాణంలోని రూ.2 లక్షలకుపైగా విలువైన కొత్త పరుపులను, దుప్పట్లను.. ఘటనాస్థలం వద్ద నేలపై పర్చారు. అక్కడున్నవారూ తలో చేయి వేశారు. దీంతో భవనంలో చిక్కుకున్న అనేక మంది సురక్షితంగా బయటకు దూకగలిగారు.''ప్రమాదం గురించి తెలిసిన వెంటనే.. ఘటనాస్థలానికి చేరుకున్నాను. అప్పటికే కింది అంతస్తు మొత్తం మంటల్లో చిక్కుకుంది. పైఅంతస్తుల్లో చిక్కుకున్నవారు.. తాము కిందకు దూకాలా? అని అరుస్తూ ఉన్నారు. దీంతో వెంటనే దుకాణం నుంచి 2022 పరుపులు, దుప్పట్లు తీసుకొచ్చి భవనం బయట నేలపై పర్చాం'' అని 'పీటీఐ'కి అర్మాన్ తెలిపారు. ''మృతదేహాలు, క్షతగాత్రుల తరలింపు కోసం బెడ్‌షీట్లు సహా రూ.2 లక్షల సామగ్రి ఇచ్చాం. మానవత్వం కోణంలో అందరూ సమానమే. తోటివారికి సాయం చేయడం నా కర్తవ్యం'' అని రియాజుద్దీన్ చెప్పారు. ఈ కుటుంబం దాదాపు నాలుగు దశాబ్దాలుగా హోటల్‌కు ఎదురుగా పరుపుల దుకాణం నడుపుతోంది.పలువురు స్థానికులూ తమవంతు రెస్క్యూ చర్యల్లో పాల్గొన్నారు. వసీమ్ రాజా అనే వ్యక్తి.. క్షతగాత్రులకు సీపీఆర్ చేశారు. తాను ఓ ఆస్పత్రిలో పనిచేస్తున్నానని, ఆ అనుభవంతో సాయం అందించినట్లు ఆయన తెలిపారు. అగ్నిమాపక సిబ్బందితో కలిసి కొంతమంది.. ఘటనాస్థలం నుంచి మృతదేహాలు, క్షతగాత్రులను తరలించారు. ఇదిలా ఉండగా.. విపత్కర పరిస్థితుల్లో మానవత్వం చాటుకున్న రియాజుద్దీన్, అర్మాన్‌లపై సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తాయి. ఇటువంటి గొప్ప పనులను అభినందించాలని, వారి సేవలను ప్రభుత్వం గుర్తించాలని నెటిజన్లు కోరారు. అదేవిధంగా వారికి జరిగిన నష్టానికి తగిన పరిహారం చెల్లించాలన్నారు.

## కాంగోను వణికిస్తున్న ఎబోలా మహమ్మారి



ఆఫ్రికా ఖండంలోని కాంగో దేశంలో ఎబోలా వైరస్‌విజృంభిస్తున్నది. ఈ క్రమంలో ఎబోలా సోకిన 11 మంది పేషెంట్లు ఐసోలేషన్ కేంద్రాల నుంచి పరారవడం ఆందోళనలు రేకెత్తించింది. ఇదిలావుంటే ఎబోలా వ్యాధితో మృతిచెందిన వారిని ఖననం చేసే బృందంపై కటానా పట్టణంలో మూక దాడి జరిగింది. దక్షిణ కివులోని కటానా పట్టణంలో ఎబోలాతో చనిపోయిన వ్యక్తికి అంత్యక్రియలు చేస్తున్న బృందంపై కొందరు మూక దాడి చేశారు. దీంతో ఆ మృతదేహాన్ని అక్కడే వదిలేసి ఆ బృందం పారిపోయింది.దీంతో స్థానికులే అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది. దీనివల్ల వైరస్ మరింత వేగంగా వ్యాప్తిచెందే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇక ఇటూరిలో ఉన్న ఐసోలేషన్ కేంద్రాల నుంచి 11 మంది ఎబోలా రోగులు పారిపోయారు. అదే సమయంలో కొన్ని ప్రావిన్స్‌లలో సాయుధ మూకలు మానవతా సాయానికి ఆటంకం కలిగిస్తున్నాయి. దాంతో అక్కడి భద్రతా పరిస్థితులపై ఆందోళనలు నెలకొన్నాయి. కాంగో జాతీయ ప్రజారోగ్య సంస్థ నివేదిక ప్రకారం.. దేశంలో ఇప్పటివరకు 363 ఎబోలా కేసులు నమోదయ్యాయి. బుండిబుగ్యో వైరస్ కారణంగా 62 మంది మరణించారు. వ్యాధి సోకిన వారిని కనుగొనడంలో కొంత మెరుగుదల కన్పించినట్లు అధికారులు తెలిపారు. ఉగాండాలో కూడా 15 కేసులు నిర్ధరణ కాగా.. ఒక మరణం సంభవించింది. ఆఫ్రికా దేశాల్లో ఎబోలా కేసులు పెరుగుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు అప్రమత్తమయ్యాయి. ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను స్క్రీనింగ్ చేస్తూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి.

## చైనా నిషేధాజ్ఞలపై స్పందించిన న్యూజిలాండ్



**బీజింగ్:** న్యూజిలాండ్‌కు చెందిన నలుగురు చట్టసభ ప్రతినిధుల(New Zealand Lawmakers)పై చైనా నిషేధం విధించింది. ఓ ఏడాదిపై చైనాలో పర్యటించకుండా ఆంక్షలు విధించింది. తైవాన్‌కు పార్లమెంటరీ ట్రిప్ వేసిన కివీస్ ప్రతినిధులు క్షమాపణలు చెప్పాలని చైనా డిమాండ్ చేసింది. తొలిసారి కివీస్ చట్టసభ ప్రతినిధులతపై చైనా నిషేధం విధించిందని వెల్లింగ్టన్‌లోని ప్రభుత్వ అధికారి తెలిపారు. తైవాన్ అంశంలో ఇటీవల చైనా ఆంక్షలను బలోపేతం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే బీజింగ్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలను న్యూజిలాండ్ విస్మరించినట్లు చైనా పేర్కొన్నది.

ముందస్తు వార్నింగ్‌లు ఇచ్చినా కివీస్ ప్రతినిధులు తైవాన్ వెళ్లినట్లు చైనా వెల్లడించింది. వెల్లింగ్టన్‌లో ఉన్న చైనా ఎంబసీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. కివీస్ ప్రతినిధులు తైవాన్‌లోని ఉన్నత స్థాయి రాజకీయవేత్తలతో భేటీ అయ్యారని, ఇది రాజకీయంగా తీవ్ర కలకలం రేపుతున్నదని, ఇది తప్పుడు సంకేతాలు ఇస్తుందని చైనా ఎంబసీ పేర్కొన్నది. ఏ దేశ పార్లమెంట్ సభ్యులు ఎవరైనా తైవాన్‌కు వెళ్లడాన్ని తాము వ్యతిరేకిస్తామని చైనా తెలిపింది. తైవాన్ అంశంలో రెడ్‌లైన్ దాటిన వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని చైనా ఎంబసీ తన స్టేట్మెంట్‌లో తెలిపింది.



### నియామకాల్లో నిబంధనల ఉల్లంఘనపై
## సుప్రీం కోర్టు ఆగ్రహం

**దిల్లీ మే 28(ఏ.ఎం.ఎస్):** ఉద్యోగాలకు నిర్దేశించిన విద్యార్హతల కన్నా ఎక్కువ క్వాలిఫికేషన్ ఉన్నవారిని అనుమతించడం.. అర్హులైన అభ్యర్థులకు నష్టం కలిగిస్తుందని సుప్రీం కోర్టు పేర్కొంది. ఓ బ్యాంకు అటెండెంట్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశిస్తూ మద్రాస్ హైకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వును రద్దు చేస్తూ.. జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.ఆ ఉద్యోగి తాను గ్రాడ్యుయేట్ అనే విషయాన్ని దాచిపెట్టి.. ప్రత్యేకించి 10వ తరగతి వరకు అర్హత ఉన్న అభ్యర్థులకు కేటాయించిన ఉద్యోగంలో చేరారనే విషయాన్ని హైకోర్టు విస్మరించిందని సుప్రీం ధర్మాసనం (Supreme Court) పేర్కొంది. ఆ ఉద్యోగిని తొలగిస్తూ బ్యాంకు తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది. నిర్దేశించిన విద్యార్హతలకు అనుగుణంగానే అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు దక్కాలని తెలిపింది.

''ఉద్యోగ అవకాశాలకు సంబంధించి విద్యార్హతలకు నిర్దిష్ట పరిమితి పెట్టడం వెనుక సహేతుక, న్యాయమైన కారణాలు ఉన్నాయి. ఆయా పరిస్థితుల కారణంగా ఉన్నత విద్య చదవలేని వ్యక్తులకు ఉపాధి కల్పించడం కోసం ఇలా చేశారు. అటువంటి వ్యక్తుల కోసం ప్రభుత్వం కొన్ని కేటగిరీల పోస్టులను రిజర్వ్ చేయడం సమర్థనీయమే. తద్వారా వారు.. ఎక్కువ విద్యార్హత ఉన్నవారితో పోటీ పడాల్సిన అవసరం ఉండదు. ఇటువంటి విధానాన్ని న్యాయస్థానాలు గతంలోనూ సమర్థించాయి'' అని పేర్కొంది.

## రక్తసిక్తంగా మారిన సముద్ర తీరం



నార్త్ అట్లాంటిక్ సముద్రంలోని ఫారో దీవుల్లోఘోరం జరిగింది. అక్కడి సంప్రదాయమైన 'గ్రైండాడ్రాప్' ఉత్సవంలో భాగంగా ఏకంగా ఒక్క రోజులో 700కు పైగా తిమింగలాలు డాల్ఫిన్లను ఊచకోత కోశారు. దాంతో సముద్ర తీరం ఎర్రగా మారిపోయింది. మే 27న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రపంచ సముద్ర పర్యావరణ సంస్థ 'సీ షెఫర్డ్ (Sea Shepherd)' ప్రకారం.. టోర్షావన్‌లో సాండెగెర్డి బే వద్ద వేటగాళ్లు 402 పైలట్ తిమింగలాలను, నాలుగు బాటిల్‌నోస్ డాల్ఫిన్‌లను ఒడ్డుకు తీసుకొచ్చి.. వాటి శరీరాలని చీల్చారు.అదేవిధంగా స్కాలబోట్నూర్‌లో 168 వైట్ సైడెడ్ డాల్ఫిన్‌లు, హోల్విక్‌లో 132 వైట్ సైడెడ్ డాల్ఫిన్‌లను చంపేశారు. వాటిని చంపేందుకు ఉపయోగించే ఆయుధాల కొరత ఏర్పడటంతో.. కొక్కేలు, కత్తులు ఉపయోగించి వాటి శరీరాలను చీల్చేశారు. దాంతో అవి ఒడ్డున విలవిలా కొట్టుకుంటూ ప్రాణాలు వదిలాయి. ఈ వధను చిన్నారులు సహా అనేకమంది సముద్రపు ఒడ్డున ఉండి చూడటం గమనార్హం. సీ షెఫర్డ్‌లోని ఫారో దీవుల డైరెక్టర్ వాలెంటీనా క్రాస్ట్.. దీన్ని తీవ్రంగా ఖండించారు. అమాయక జంతువులను ఇంత క్రూరంగా బాధించి చంపడాన్ని సమర్థించలేమన్నారు.ఈ సందర్భంగా ఈ సంప్రదాయాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. కాగా ఈ సామూహిక వధ అనేది 1000 ఏళ్ల నాటి సంప్రదాయంగా అక్కడి వారు చెబుతున్నారు. అయితే జంతు ప్రేమికులు దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆధునిక కాలంలో ఇది అనాగరికమైన చర్య అని, కాలం చెల్లిన పద్ధతిగా దీన్ని అభివర్ణిస్తున్నారు. వెంటనే దీన్ని ఆపేయాలంటూ ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. ఈ సామూహిక వధకి ముందురోజు ఫారోస్ పార్లమెంటులో వేటాడే డాల్ఫిన్‌ల కోసం ఉన్న సంక్షేమ చట్టాన్ని సవరించడం గమనార్హం.

## కాంగ్రెస్ గూటికి కెప్టెన్ అమరీందర్ సింగ్



బీజేపీ నేత, పంజాబ్ మాజీ సీఎం కెప్టెన్ అమరిందర్ సింగ్ మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరబోతున్నారా..? తాజా పరిణామాలు చూస్తే అవుననే అనిపిస్తోంది. కెప్టెన్ అమరిందర్ సింగ్‌ను తిరిగి కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చేందుకు చర్చలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నేత, హరియాణా మాజీ సీఎం భూపిందర్ హుడా తెలిపారు. దీంతో అమరిందర్ సింగ్ కాంగ్రెస్‌లో చేరడానికి మార్గం సుగమం అవుతుంది. ఇదే జరిగితే.. పంజాబ్‌లో అటు కాంగ్రెస్‌కు లాభం కలిగితే, బీజేపీకి భారీ ఎదురుదెబ్బ తప్పదు.కొంతకాలంగా బీజేపీ కార్యక్రమాలకు అమరిందర్ సింగ్ దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇటీవల పంజాబ్‌లో బీజేపీ నిర్వహించిన ఒక కార్యక్రమానికి కూడా ఆయన హాజరుకాలేదు. అలాగే, పంజాబ్‌లో బీజేపీ నూతన చీఫ్‌గా కేవల్ సింగ్ ధిల్లాన్‌ను పార్టీ నియమించింది. ఈ సమయంలో పార్టీ తనను సంప్రదించలేదని కెప్టెన్ తెలిపారు. కేవల్ సింగ్ ప్రమాణ స్వీకారానికి బీజేపీకి చెందిన కీలక నేతలు హాజరైనప్పటికీ కెప్టెన్ మాత్రం హాజరుకాలేదు. ఇదే సమయంలో ఒక సందర్భంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అమరిందర్ సింగ్ పొగిడారు.


అటు బీజేపీకి దూరంగా ఉండటం, కాంగ్రెస్ నేతను పొగడటం కారణంగా ఆయన బీజేపీకి వీడనున్నారా అనే ప్రచారం ఊపందుకుంది. తాజాగా భూపిందర్ హుడా ప్రకటనతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరుతోంది. ఈ విషయంపై అమరిందర్ సింగ్‌తో చర్చలు జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. త్వరలోనే ఆయన నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. అమరిందర్ సింగ్.. కాంగ్రెస్ పార్టీలో అత్యధిక కాలం కొనసాగారు. కాంగ్రెస్ తరపున పంజాబ్ సీఎంగా కూడా కొనసాగారు. కానీ, అనూహ్య పరిణామాల మధ్య 2021లో కాంగ్రెస్ పార్టీ ఆయనను సీఎం పదవి నుంచి తొలగించింది. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు.

పంజాబ్ లోక్ కాంగ్రెస్ అనే పార్టీని స్థాపించారు. కానీ, 2022లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి డిపాజిట్లు కోల్పోయింది. ఆ తర్వాత తన పార్టీని బీజేపీలో 2022లో విలీనం చేశారు. ఇంతకాలం బీజేపీలో కొనసాగిన ఆయన ఆ పార్టీ అధినాయకత్వంపై అసంతృప్తితో ఉన్నారు. దీంతో ఆయన ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. తిరిగి సొంత గూటికి చేరుతారా లేక బీజేపీలోనే కొనసాగుతారా అనేది త్వరలోనే తేలనుంది.

### కువైట్ ఎయిర్‌పోర్టుపై
## ఇరాన్ డ్రోన్ దాడి

కువైట్ ఎయిర్‌పోర్టుపై ఇరాన్ బుధవారం డ్రోన్ దాడిచేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 67 మంది గాయపడగా, ఒక భారతీయుడు మరణించాడు. కువైట్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 1పై ఇరాన్ డ్రోన్‌తో దాడి చేసింది. ఈ ఘటనతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. మరోవైపు ఎయిర్‌పోర్టుకు కూడా భారీ నష్టం సంభవించింది. రూఫ్‌టాప్ కూలిపోయింది. గాయపడిన వారిలో విమాన ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. ఎయిర్‌పోర్టుపై దాడి జరగడంతో విమాన సర్వీసుల్ని నిలిపివేస్తూ ఎయిర్‌పోర్ట్ అథారిటీ నిర్ణయం తీసుకుంది. పలు అంతర్జాతీయ విమానాల్ని ఇతర విమానాశ్రయాలకు ళ్లించారు. ఇరాన్ డ్రోన్ దాడి ఘటనతో భారీ పేలుడు సంభవించింది. మంటలు భారీగా ఎగసిపడ్డాయి. పొగ చాలా దూరం వరకు అల్లుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను కువైట్ జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తన ఎక్స్ ఖాతాలో విడుదల చేసింది. కువైట్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 1పై ఇరాన్ డ్రోన్‌తో దాడి చేసింది ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది. మరోవైపు ఈ దాడి తాము ఉద్దేశపూర్వకంగా చేయలేదని ఇరాన్ వెల్లడించింది. ఇది ఇరాన్ డ్రోన్‌ను అమెరికా మిస్సైల్స్ అడ్డుకునే క్రమంలో అది ఎయిర్‌పోర్టుపై పడి దాడి జరిగిందని తెలిపింది. ఈ దాడి ఘటనను కువైట్ ఖండించింది. దీన్ని ఒక క్రిమినల్ చర్యగా అభివర్ణించింది.

## 17 ఏళ్ల తర్వాత భారత్‌కు స్కాండినేవియన్ విమానం..



ముంబై: సుమారు 17 ఏళ్ల విరామం తర్వాత స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన తొలి విమానం భారత్‌కు ప్రయాణమైంది. ముంబైలో వెల్‌కమ్ ల్యాండింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే ఆ విమానం మధ్యలోనే యూ టర్న్ తీసుకుని వెనక్కి వెళ్లిపోయింది.) జూన్ 2న స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్ (ఎస్ఏఎస్)కు చెందిన ఎస్‌కే 969 ఫ్లైట్ డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగన్ ఎయిర్‌పోర్ట్ నుంచి టేకాఫ్ అయ్యింది.

సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌లో తన కార్యకలాపాల విస్తరణ ఆశతో ఉన్న ఆ సంస్థ తొలి విమానం ముంబైకు ప్రయాణమైంది. ఆ విమానం తొలి ల్యాండింగ్ సందర్భంగా స్వాగతం పలికేందుకు ముంబై ఎయిర్‌పోర్ట్‌లోని గ్రౌండ్ సిబ్బంది వాటర్ కెనాన్ సెల్యూట్ కోసం సిద్ధమై వేచి ఉన్నారు.కాగా, విమానం బయలుదేరడానికి ముందు భారత్ నుంచి తుది అనుమతులు స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్‌కు అందలేదు. ఫ్లైట్ టేకాఫ్ తర్వాత అనుమతుల ప్రక్రియ పూర్తవుతుందని ఆ సంస్థ భావించింది.

అయితే ల్యాండింగ్ అనుమతుల అంశంలో స్పష్టత లేకపోవంతో ఆ విమానం మధ్యలోనే యూటర్న్ తీసుకున్నది. ఈ నేపథ్యంలో సుమారు 12 గంటల పాటు అందులో ప్రయాణించిన ప్రయాణికులు తిరిగి బయలుదేరిన కోపెన్‌హాగన్‌లోనే దిగారు.మరోవైపు ప్రయాణికులకు కలిగిన ఇబ్బందికి స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్ క్షమాపణలు చెప్పింది. వారికి ప్రత్యామ్నాయ విమాన ప్రయాణ ఏర్పాట్లు చేసినట్లు తెలిపింది. భారత్ నుంచి మిగిలిన అనుమతులు పొందేందుకు సంబంధిత ప్రభుత్వ అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు పేర్కొంది. వారానికి ఐదుసార్లు నడిచే కోపెన్‌హాగన్ ముంబై సర్వీసును కొన్ని రోజుల్లోనే పునః ప్రారంభిస్తామని వెల్లడించింది.అయితే భారత్‌కు తొలి విమాన సర్వీసులో అంతరాయం కారణంగా స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్ సంస్థ భారీ ఆర్థిక నష్టాన్ని చవిచూసింది. ఇంధనం, నిర్వహణ ఖర్చులు, ప్రయాణికులకు నష్టపరిహారం కోసం అర మిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లవచ్చని నిపుణులు అంచనా వేశారు. భారత్‌కు తొలి సర్వీసులోనే ఆ సంస్థకు నిరాశ, భంగపాటు ఎదురైనట్లు పేర్కొన్నారు.




# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజలపై పెరుగుతున్న భారాలు



- పెద్దారపు రమేష్ ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి

**వరంగల్ జిల్లా జూన్ 04 (వుదయం జిల్లా ప్రతినిధి) :** నర్సంపేట పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎంసిపిఐ(యూ) పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. నర్సంపేటలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎంసిపిఐ(యూ) కేంద్ర కమిటీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళన నిర్వహించి ఆర్డీవో ఉమారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంసిపిఐ(యూ) వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం పడిందన్నారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరిచి నిరుద్యోగాన్ని పెంచిందని విమర్శించారు. రైతులకు ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్నప్పటికీ కనీస మద్దతు ధరలకు చట్టబద్ధ హామీ ఇవ్వకుండా నామమాత్రపు పెంపులతో ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని విధానాలను మార్చాలని, లేకపోతే ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కన్నం వెంకన్న, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యులు కేశెట్టి సదానందం, పార్టీ నాయకులు దామ సాంబయ్య,
మార్త నాగరాజు, మార్త సుధ, గణిపాక బిందు, కల్లేపల్లి రాకేష్, సాగరిక తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకుందాం




- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- గ్రామాలలో చెత్త నిర్వహణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ప్రత్యామ్నాయ పంటల సాగు, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్.ఐ.ఆర్. లక్ష్యం
- ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామ సభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**ఖమ్మంవుదయంబ్యూరో రూరల్, జూన్ 04:** భవిష్యత్తు తరాల కోసం మనమందరం పర్యావరణాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలోనీ రైతు వేదికలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సభలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే ముఖ్య వేదికలని అన్నారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమగ్ర వివరాలు తెలియజేసి, ప్రజలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువల అభివృద్ధి, సాగునీటి పనుల పురోగతిపై గ్రామస్తులతో చర్చించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.పంటల మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ, వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్‌పామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు తక్కువగా ఉన్న నేపథ్యంలో బోర్‌వెల్ సౌకర్యం కలిగిన రైతులు షార్ట్ డ్యూరేషన్ వరి సాగు చేపట్టవచ్చని తెలిపారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.
గ్రామాలలో చెత్తను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని, ప్రస్తుతం స్వచ్ఛమైన తాగునీటి కోసం డబ్బులు చెల్లిస్తున్నామని, భవిష్యత్తులో స్వచ్ఛమైన గాలి కోసం కూడా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని సూచించారు...భవిష్యత్ తరాలు మెరుగైన జీవనం సాగించాలంటే పర్యావరణ పరిరక్షణ అత్యంత ముఖ్యమని అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఒకేరోజు కుంభవృష్టి తరహా వర్షాలు కురిసి వరదలు సంభవిస్తున్నాయని, అడవుల నరికివేత కారణంగా కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయని తెలిపారు. కోతుల సమస్యకు తక్షణ పరిష్కారం లేదని, గ్రామస్థులు తమ జీవన విధానంలో మార్పులు చేసుకుంటేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లాకు సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరాన్ని వివరించిన కలెక్టర్, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మురుగు కాల్వల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నీటి సంరక్షణ చర్యలు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వరదల సమయంలో ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించి లోతట్టు ప్రాంతాల నుంచి వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా ఇండ్లు కూలి పోవడం, విద్యుత్ స్తంభాలు, పెద్ద చెట్లు కూలిపోవడం వంటి ఘటనలతో ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందన్నారు. రహదారులు, కల్వర్టులపై వరద నీరు ప్రవహిస్తున్న సమయంలో అధికారుల హెచ్చరికలను పట్టించుకోకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగు తున్నాయని తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో సెల్ఫీలు తీసుకోవడం కూడా ప్రాణాపాయానికి దారితీస్తుందని హెచ్చరించారు. పాతబడిన ఇళ్లలో నివసించే వారు భారీ వర్షాల సమయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు లేదా ఇతర సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వరదల సమయంలో అనవసరంగా బయటకు వెళ్లవద్దని, విపత్కర పరిస్థితుల్లో అవ్వాలని ప్రయత్నించవద్దని హితవు పలికారు.ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం ద్వారా ఓట్లు తొలగిపోతాయనే ప్రచారం పూర్తిగా అపోహ మాత్రమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం అనంతరం పలుమార్లు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించారని, ఓటరు జాబితా శుద్ధీకరణే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, డూప్లికేట్ ఓట్లు మాత్రమే తొలగిస్తామని చెప్పారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోరని భరోసా కల్పించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి మిగిలిన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని తెలిపారు. ప్రజలు తమ వివరాలను నమోదు చేసి ప్రభుత్వం గుర్తించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒక దానిని జతచేసి సమర్పించాలని సూచించారు.
జూలై 31, 2026న డ్రాఫ్ట్ ఎస్.ఐ.ఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని, అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు ఉంటే ఆగస్టు 30లోగా సమర్పించాలని సూచించారు.జూలై 1, 1987కు ముందు భారతదేశంలో జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తండ్రి లేదా తల్లి ఎవరి అయినా ఒకరి పత్రం సమర్పించాలని తెలిపారు.
డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తండ్రి, తల్లి ఇద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.సెప్టెంబర్ 28, 2026 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి, అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ను విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బి జ్యోతి, ఆత్మ పిడి బి.సరిత, ఏవో ఉమా నగేష్, పశువైద్యులు జగ్గులాల్ సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన

## ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 4 (వుదయం ప్రతినిధి)** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6వ తేదీ నుండి అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయబడుతోందని తెలిపారు. గ్రామ సభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదికలని అన్నారు. .
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను జాబితా నుండి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, రైతులు, గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, గ్రామంలోని విద్యుత్ అదనపు లైన్లు , అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి కి ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామారావు,
డి ఆర్ డి ఓ విద్యా చందన, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 6న కామ్రేడ్ వంగరి సత్తయ్య సంతాప సభ

**నల్గొండ జూన్ 04 (వుదయం ప్రతినిధి) :** మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ, సీపీఎం సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ వంగరి సత్తయ్య సంతాప సభను జూన్ 6న ఎన్ఆర్ఐ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య తెలిపారు. గురువారం చర్లపల్లి వార్డు కార్యాలయం వద్ద సంతాప సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దండెంపల్లి సత్తయ్య మాట్లాడుతూ కామ్రేడ్ వంగరి సత్తయ్య కమ్యూనిస్టు విలువలకు కట్టుబడి చివరి వరకు ఎర్రజెండా నీడలోనే కొనసాగారని అన్నారు. పేదలు, కార్మికులు, అణగారిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేసిన గొప్ప నాయకుడిగా ఆయనను అభివర్ణించారు.చర్లపల్లి సర్పంచ్‌గా రెండుసార్లు, మండల పరిషత్ వైస్ ఎంపీపీగా పనిచేసిన సమయంలో ఎస్సీ, బీసీ కాలనీల కోసం ప్రభుత్వంపై పోరాడి భూసేకరణ చేయించి ఇంటి స్థలాలు, గృహాలు ఇప్పించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు బోర్లు వేయించి ఇంటింటికీ నల్లా కనెక్షన్లు అందించారని గుర్తుచేశారు. విస్తరిస్తున్న చర్లపల్లి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్మశానవాటిక, గ్రామపంచాయతీ కార్యాలయం ఏర్పాటుకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. తన కుటుంబానికి చెందిన 18 ఎకరాల ఇనాం భూమిని దళితులకు పంచిన గొప్ప నాయకుడు వంగరి సత్తయ్య అని కొనియాడారు.నల్లగొండలో ఎర్రచొక్కా ధరించిన వారిపై దాడులు జరిగే కాలంలోనూ వెనుకడుగు వేయకుండా కమ్యూనిస్టు ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని, పార్టీ మారాలని ఒత్తిళ్లు వచ్చినా తలొగ్గకుండా చివరి శ్వాస వరకు సీపీఎంతోనే కొనసాగారని తెలిపారు.అనారోగ్యంతో మే 27న ఆయన మరణించారని, ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ దోపిడీ లేని సమసమాజ నిర్మాణం కోసం కృషి చేయడమే నిజమైన నివాళి అవుతుందని అన్నారు.సంతాప సభకు సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. చర్లపల్లి ప్రాంత ప్రజలు, అభిమానులు, పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో చర్లపల్లి సీపీఎం శాఖ కార్యదర్శి పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, శాఖ సభ్యులు రాపోలు చంద్రయ్య, కాసర్ల గౌతమ్ రెడ్డి, ఎండీ సలీం, గంజి రాజేష్, శ్రీరంగం శేఖర్ రెడ్డి, వెంకటయ్య, రాములు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



## పంట వ్యర్థాలు తగులబెట్టడంపై నిషేధం

-జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**హనుమకొండ, జూన్ 04 (వుదయం జిల్లా ప్రతినిధి) :** హన్మకొండ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, వ్యవసాయ భూములలో పంట కోతల తర్వాత మిగిలిన వ్యర్థాలను/పొట్టును (మొండికాల్పులు) తగులబెట్టడాన్ని పూర్తిగా నిషేధిస్తూ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిషేధాజ్ఞలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆమె స్పష్టం చేశారు. వ్యవసాయ వ్యర్థాలను తగులబెట్టడం వల్ల తీవ్రమైన వాయు కాలుష్యం ఏర్పడుతుందని, పర్యావరణం దెబ్బతినడంతో పాటు ప్రజారోగ్యానికి, మానవ ప్రాణాలకు, రహదారి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను ధిక్కరించి పంట వ్యర్థాలను తగులబెట్టే వారిపై భారతీయ న్యాయ సంహిత (BNS), 2023 లోని సెక్షన్ 223 కింద క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే, సాధారణ ఇబ్బందులు కలిగిస్తే 6 నెలల వరకు జైలు శిక్ష లేదా జరిమానా, మానవ ప్రాణాలకు, భద్రతకు ముప్పు కలిగిస్తే సంవత్సరం వరకు జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారని హెచ్చరించారు.
ఈ నిబంధనలను కఠినంగా అమలు చేయడానికి మరియు నిరంతరం నిఘా ఉంచడానికి తహశీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయ, పంచాయతీ రాజ్ మరియు పోలీస్ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని, రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

## ధాన్యం దిగుమతిలో ఎలాంటి ఆలస్యం వహించొద్దు

అదనపు కలెక్టర్ అశోక్ కుమార్





**కాటారం/ జయశంకర్ భూపాలపల్లి, జూన్ 04(వుదయం ప్రతినిధి)** ధాన్యం దిగుమతిలో ఎలాంటి ఆలస్యం వహించొద్దు అని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు గురువారం కాటారం మండలంలోని ఏఎంసి గోదాం, రుద్ర కాటన్ మిల్లుతోపాటు మీనాక్షి జిన్నింగ్ మిల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు.ధాన్యం దిగుమతి సమయంలో ఎలాంటి ఆలస్యం జరుగకుండా సక్రమంగా నిర్వహించేందుకు సంబంధిత ఇన్‌చార్జ్‌లకు దిశానిర్దేశం చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గోదాంలలో సరైన వసతులు కల్పించడం, తగిన భద్రతా చర్యలు తీసుకోవడం, ధాన్యం నాణ్యతను కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎం రాములు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు, తరలింపు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ నర్మెట్ట, బచ్చన్నపేట మండలాల్లోని ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల ఆకస్మిక తనిఖీ
- ట్రక్ షీట్లు, ఓపీఎంఎస్ మోదులపై ప్రత్యేక నిఘా
- రవాణా వేగవంతానికి అదనపు ట్రాక్టర్ల వినియోగం





**జనగామ, జూన్ 04 (వుదయం ప్రతినిధి) :** జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, బస్తాల లోడింగ్ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేసి, రాబోయే నాలుగు రోజుల్లోగా రవాణా ప్రక్రియను ముగించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అధికారులను ఆదేశించారు. గురువారం రోజున జిల్లా కలెక్టర్ జిల్లాలోని నర్మెట్ట మండలం వెల్దండ గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని, అలాగే బచ్చన్నపేట మండలం అలింపూర్, కొడవటూరు, తమ్మడపల్లి గ్రామాల్లోని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్రాల్లోని రిజిస్టర్లు, ట్రక్ షీట్లు, కాంటా వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని లారీలు వచ్చాయి? మిల్లులకు ఎంత ధాన్యం చేరింది? ఇంకా కల్లాల్లో ఎంత నిల్వ ఉందనే వివరాలపై ఆరా తీశారు. అలింపూర్, కొడవటూరు కేంద్రాల్లో ఇప్పటివరకు 992 క్వింటాళ్ల ధాన్యం కాంటా పూర్తయిందని తెలుసుకున్న కలెక్టర్, మిగిలిన పనిని 23 రోజుల్లో ముగించాలన్నారు. కలెక్టర్ జారీ చేసిన ముఖ్య సూచనలు అమలు చేయాలి. హమాలీల విభజనతో లోడింగ్ పనులను వేగవంతం చేసేందుకు హమాలీలను మూడు బ్యాచ్‌లుగా విభజించి పని చేయించాలి.
అదనపు రవాణాతో పాటు ధాన్యాన్ని మిల్లులకు త్వరగా తరలించేందుకు వీలుగా అదనంగా 10 ట్రాక్టర్లను వినియోగించుకోవాలి. రవాణాలో ఎలాంటి ఆలస్యం జరగకూడదు.ఆన్‌లైన్ నమోదు: రైతుల వివరాలను, ఓపీఎంఎస్ (OPMS) నమోదును ఎప్పటికప్పుడు పూర్తి చేయాకేంద్రాల పరిశీలన సందర్భంగా కలెక్టర్ అక్కడి రైతులతో నేరుగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం తరలింపు ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ తనిఖీల్లో సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# హక్కుల రక్షణకై 'పోరు కేక

# పాలకుల తీరుపై తుడుం దెబ్బ సమరశంఖం!

- * మా పోరాటం లంబాడీలపై కాదు, పాలకులపైనే
- * లంబాడీలను ఎస్టీ జాబిల నుండి తొలగించాలి
- * తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్






**కొత్తగూడ, జూన్ 04(వుదయం ప్రతినిధి):** లంబాడీలను ఎస్టీ జాబితా నుండి వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో కొత్తగూడ మండల కేంద్రంలోని స్థానిక స్పోర్ట్స్ స్కూల్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుగా మండల కేంద్రంలోని స్థానిక డా. బి. ఆర్ అంబేద్కర్, ప్రొఫెసర్ బియ్యాలా జనార్దన్ రావు, కొమరం భీం ల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆదివాసి కళా నృత్యాలతో, డోలు వాయిద్యాలతో ఆదివాసి సాంప్రదాయ పద్ధతులలో ర్యాలీ తో సభా ప్రాంగణం కు చేరుకున్నారు. అనంతరం తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్, తొమ్మిది తెగల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు చుంచు రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తమ పోరాటం లంబాడీలపై కాదని, కేవలం పాలకుల విధానాలపైనేనని ఆయన స్పష్టం చేశారు. చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించే వరకు తమ పోరాటం ఆగేది లేదని, ప్రభుత్వం తక్షణమే తుడుం దెబ్బ నాయకులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వాలు మారుతున్న పాలకులు మారుతున్న ఆదివాసుల బతుకులు మారడం లేదని, విద్య రాజకీయ ఆర్థిక పరంగా ఆదివాసీలు వెనుకబడి పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆదివాసి సమాజం గ్రహించి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఆదివాసి అమరులు కొమరం భీమ్ బీర్సాముండా లాంటి అనేకమంది యోధులు ఆదివాసీల హక్కుల కోసం రక్షణ కోసం రక్తం చిందించారని వారి ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన అన్నారు.ఏజెన్సీ ఉద్యోగాలు ఏజెన్సీ సర్టిఫికెట్ లు లేక ఐటీడీఏల ద్వారా రావాల్సిన ఉద్యోగాలు రాక వేలాదిమంది నిరుద్యోగులు ఏజెన్సీ ప్రాంతాలలో మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ కాదు, ఏజెన్సీ డిఎస్సి కావలని డిమాండ్ చేశారు. మిగిలిన ఉద్యోగ ఖాళీలను ఆదివాసి యువతతోనే భర్తీ చేయాలనీ వారు అన్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ గిరిజన రైతులు సుదీర్ఘకాలంగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు ప్రభుత్వం వెంటనే రీసర్వే జరిపించి, వారికి పట్టాలు కల్పించి పూర్తి న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా నేడు పాలించుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగం కల్పించబడిన ఆదివాసీల హక్కులను కాలరాస్తూ ఆదివాసీల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేసి, ఆదివాసీల భూములను, వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జులై 30 లోపు ఆదివాసిల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వాలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో బలమైన పోరాటాలు నిర్వహిస్తామని, తక్షణమే స్పందించకుంటే మానుకోట ను ముట్టడిస్తామని తెలిపారు. ప్రతి ఆదివాసి తమ హక్కుల రక్షణ కోసం, హక్కుల సాధనకై ఐక్య పోరాటాలు నిర్వహించాల్సి ఉందని భవిష్యత్ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.
ఈ భారీ బహిరంగ సభకు వివిధ గ్రామాలనుండి తుడుం దెబ్బ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ



- జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు
- రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలి

**ములుగు, జూన్ 4 (వుదయం ప్రతినిధి) :** గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. '99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా వెంకటాపూర్ మండలం కేశవాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసమే జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలను సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. డీఆర్‌డీఏ, ఎంపీడీవోలు,
ఎంపీఓల సమన్వయంతో జిల్లా స్థాయిలో జాబ్ క్యాలెండర్ రూపొందిస్తాం.ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి: ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందాలంటే రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు పూర్తి చేసుకోవాలి. దీనికోసం వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు వేదికల సహకారం తీసుకోవాలి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రజలు అధికంగా భాగస్వాములు కావాలి. కూలీల సంఖ్య పెరిగితే గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీఓ భవనాల నిర్మాణానికి మరిన్ని నిధులు లభిస్తాయి.అధికారులకు ఆదేశాలు: కేశవాపూర్ గ్రామంలో తాగునీటి ట్యాంకు నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ గ్రామసభలో డీపీఓ వెంకయ్య, పంచాయతీ రాజ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి...

**ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక...ప్రత్యేక గ్రామసభలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్**



**కోరుట్ల జూన్ 04 (వుదయం ప్రతినిధి)**

99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభలో ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సభలో వర్షాకాల ముందస్తు చర్యలు ఘన వ్యర్థాల నిర్వహణ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం జల సంరక్షణ వన మహోత్సవం సురక్షిత తాగునీరు వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మహిళా సంరక్షణ అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన తదితర అంశాలపై చర్చించారు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. మహిళల భద్రత రోడ్డు భద్రత అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో సురక్షితమైన తాగునీటి సరఫరా కోసం అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు రానున్న వ్యవసాయ సీజన్ ను దృష్టిలో ఉంచుకుని రైతులు నాణ్యమైన విత్తనాలు ఎరువులు వినియోగిస్తూ వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని తెలిపారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని నీటి వనరులను సంరక్షిస్తూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామంలో ఐదు అంగన్వాడి భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉండగా ఇప్పటికే ఒక భవనానికి మంజూరు లభించిందని మిగిలిన భవనాలకు అవసరమైన భూమి అందుబాటులో ఉంటే మంజూరు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే మూడు వీఓ భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉండగా ఒక భవనానికి ఇప్పటికే మంజూరు లభించిందని మిగిలిన రెండు భవనాలకు భూమి అందుబాటులో ఉంటే మంజూరు కల్పిస్తామని పేర్కొన్నారు. మంజూరైన భవనాల నిర్మాణపనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ ఎంపీడీవో తహసీల్దార్ సంబంధిత శాఖల అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతోనే వార్డుల సమగ్ర అభివృద్ధి: జిల్లా కలెక్టర్



**జూన్ 4, 2026_ఆదిలాబాద్:**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" ద్వారానే పట్టణాల్లోని ప్రతీ వార్డు సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా గురువారం పట్టణంలోని 45వ వార్డు భుక్తాపూర్ కాలనీలో నిర్వహించిన వార్డు సభకు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వార్డుల్లో నెలకొన్న డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, పారిశుధ్య సమస్యలను త్వరితగతిన గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన ప్రణాళికలతో నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వార్డు ప్రజల అవసరాలకు అనుగుణంగా అధికారులు ప్రగతి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు.మునిసిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో స్థానిక ప్రజలు భాగస్వాములు కావాలని, అప్పుడే వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందన్నారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరం స్విమ్మింగ్ పోటీలలో రెండవ బహుమతి పొందిన మునిసిపల్ చైర్ పర్సన్ దంపతుల కుమార్తె బండారి అమితకు కలెక్టర్ ప్రశంస పత్రాన్ని అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఈఓ మాధవి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వార్డ్ ప్రత్యేక అధికారి నిహారిక, వివిధ శాఖల జిల్లా అధికారులు, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## అడవుల ప్రాధాన్యాన్ని విద్యార్థులు గుర్తించాలి : పెద్దపల్లి అటవీ రేంజ్ అధికారి టి. సతీష్ కుమార్



**పెద్దపల్లి (మంథని) జూన్-04 (వుదయం ప్రతినిధి)**

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇంచార్జ్ జిల్లా అటవీ అధికారి ఎం. నవీన్ రెడ్డి, ఐఎఫ్ఎస్ ఆదేశాల మేరకు మంథని రేంజ్ పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణలో అడవుల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు పెద్దపల్లి అటవీ రేంజ్ అధికారి టి. సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అడవులు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని, జీవవైవిధ్య పరిరక్షణకు అటవీ సంపద ఎంతో అవసరమని అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో, భూగర్భ జలాల సంరక్షణలో, స్వచ్ఛమైన గాలి అందించడంలో అడవుల ప్రాధాన్యతను వివరించారు. "పర్యావరణ పరిరక్షణలో అడవుల ప్రాధాన్యం" అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ప్రకృతి పరిరక్షణ పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి జి. కొమురయ్య, స్ట్రైక్ ఫోర్స్ ఎఫ్ఎస్వో ఎస్.డి. రహీమతుల్లా, ఫారెస్ట్ బీట్ అధికారులు డి. శ్రావంతి, ప్రదీప్, సహాయ శాస్త్రవేత్త పి. కనకజ్యోతి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డి. కల్పన, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ కె. రమేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి. శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలి

**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలి : అదనపు కలెక్టర్ డా. అశ్విని తానాజీ వాకడే, ఐఏఎస్**



**కరీంనగర్ జూన్ 04 (వుదయం ప్రతినిధి):**

కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాధికారి ప్రశాంత్ రెడ్డి సమక్షంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. బడిబయట ఉన్న పిల్లలు, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు, వినూత్న కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాలు, కాలనీలు, తండాలు, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఐదేళ్లు నిండిన ప్రతి బాలబాలికను ప్రథమ తరగతిలో చేర్పించడంతో పాటు, ట్రాన్సిషన్ తరగతులైన 5వ నుంచి 6వ తరగతి, 7వ నుంచి 8వ తరగతి, 10వ తరగతి అనంతర ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, పచ్చదనం, ఆకర్షణీయమైన వాతావరణంతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారులకు సూచించారు. విద్యార్థులకు మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందేలా చూడాలని, పాఠశాల ఆవరణలను రంగురంగులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. బడిబాట కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రత్యేక బడిబాట గీతం రూపొందించాలని కూడా ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి గీత మాట్లాడుతూ బడిబాట కార్యక్రమ విజయవంతానికి గ్రామీణాభివృద్ధి శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. గ్రామ స్థాయిలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని, విద్యాశాఖతో సమన్వయంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**అపరెల్ పార్క్, గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలి: జిల్లా కలెక్టర్**



**రాజన్న సిరిసిల్ల, జూన్ - 04**

జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్, వాహనాలు, ఇతర అంశాలపై పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సహకార శాఖ, మెప్మా, రవాణా శాఖ, వ్యవసాయ శాఖ, తదితర శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, హమాలీల సంఖ్య, గన్ని సంచులు, ఇప్పటివరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు మూసి వేశారు.. తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అపరెల్ పార్క్, గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. కొనుగోళ్ల తుది దశకు చేరిన కేంద్రాల నుంచి హమాలీలు, వాహనాలను ఇతర కేంద్రాలకు తరలించాలని సూచించారు. ధాన్యానికి అనుగుణంగా ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు, తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

## పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి.. జిల్లా కలెక్టర్



**కాగజ్ నగర్ వుదయం ప్రతినిధి**

జిల్లాలోని కాగజ్ నగర్ పురపాలికను పరిశుభ్రంగా ఉంచేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌక్ తీరం రాజ్ టాకీస్ చౌరస్తా వరకు గల రహదారిని మున్సిపల్ అధికారులు, స్థానిక వార్డు కౌన్సిలర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని తెలిపారు. మున్సిపల్ అధికారులు ప్రతిరోజు మురుగు కాలువలు శుభ్రపరచాలని, ప్రతి రోజు తడి, పొడి చెత్తను సేకరించాలని తెలిపారు. పట్టణంలోని గురుకృప టిఫిన్ సెంటర్ నిర్వాహకులు నీటిని, వినియోగించిన ప్లేట్లను రోడ్డుపై పడవేసినందుకు టిఫిన్ సెంటర్ యజమానికి జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతిని ఆదేశించారు.

దుకాణాల యజమానులు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిల్లను రోడ్డుపై పడవేయకుండా చెత్త కుండీలో వేయాలని, పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్



**మంచిర్యాల/జూన్ 4, 2026 (వుదయం ప్రతినిధి)**

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును మండల తహసిల్దార్ సంతోష్ కుమార్ తో కలిసి సందర్శించి ధాన్యం, మొక్కజొన్నల దిగుమతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి కేటాయించిన ప్రకారం తరలించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యంతో పాటు గోదాములకు వచ్చిన మొక్కజొన్నలను దిగుమతి చేసి నిల్వ చేయాలని నిర్వాహకులకు సూచించారు. హమాలీల పులి వేతనం చెల్లింపులపై పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ తో మాట్లాడి సకాలంలో కూలి డబ్బులు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ తరగతుల బోధనకు దరఖాస్తుల స్వీకరణ..ఎం ఈ ఓ డా. సునీత

**బెజ్జూర్, (వుదయం ప్రతినిధి)**

2026–27 సంవత్సరానికి గాను పూర్వ ప్రాథమిక తరగతులు నిర్వహించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. దీంతో జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు బెజ్జూరు మండలంలోని బుజాదివాడ పాపన్నపేట, కాటేపల్లి, బారెగూడ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు బోధించేందుకు ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుండి ఇన్స్ట్రక్టర్స్ మరియు ఆయాల నియామకం కోసం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని మండల విద్యాధికారి డాక్టర్. సునీత తెలిపారు. ఆయా పాఠశాలలో బోధించుటకు ఇన్స్ట్రక్టర్స్ (మహిళలు) ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి, డిఏడ్ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు, ఆయాలు (మహిళలు)ఏడవ తరగతి లో ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు. వయోపరిమితి 18 నుండి 44 సంవత్సరాలు బీసీ ,ఎస్సీ ,ఎస్టీ , ఈ డబ్ల్యూ ఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాల వయోపరిమితి సడలింపు ఉందని అన్నారు.దరఖాస్తుదారులు సంబంధిత పాఠశాల పరిధిలోని హాబిటేషన్ గ్రామ పంచాయతీకి చెందిన వారై ఉండాలని, వారికే మొదటి ప్రాధాన్యత ఇస్తామని, దరఖాస్తుతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు, నివాస ధ్రువపత్రం, ఆధార్ కార్డు జతపరచాలని,దరఖాస్తు సమర్పించే సమయంలోఒరిజినల్సర్టిఫికెట్లు చూపించాలని,పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 9వతేదీ సాయంత్రం 4 గంట ల లోగా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని కోరారు.

## భావి తరాలకు నష్టం వాటిల్లకుండా బాధ్యతగా వ్యవహరించాలి

**గ్రామ సభలో కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పాల్గొన్న పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**



**నిజామాబాద్, జూన్ 04 :**

మన భావి తరాలకు నష్టం జరుగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. సమాజం కోసం మనం ఏం చేస్తున్నాం అన్నది ప్రతి ఒక్కరు గుర్తెరిగి బాధ్యతతో మెలగాలని సూచించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో గురువారం గ్రామ, వార్డు సభలకు శ్రీకారం చుట్టారు. మోపాల్ మండలం న్యాల్ కల్ లో గ్రామ సచివాలయం ప్రాంగణంలో సర్పంచ్ చంద్రకళ అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సంబంధిత శాఖల అధికారులు గ్రామస్థులకు వివరించడంతో పాటు, ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియకు సహకరించడం, పంటల మార్పిడి, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించాల్సిన ఆవశ్యకత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాల పెంపుదల, తడి–పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, ఘన వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సూచనలు చేసినందున, తదనుగుణంగా అనుకూలమైన పంటలను ఎంచుకోవాలని రైతులకు హితవు పలికారు. పంట మార్పిడి విధానాలను అవలంభించాలని, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను పాటిస్తూ నాణ్యమైన ఎరువులు, విత్తనాలను వినియోగించాలని సూచించారు. ఎక్కడైనా నాసిరకం, నకిలీ ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. తనిఖీల కోసం పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. కాగా, మోతాదుకు మించి ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడవద్దని, పర్యావరణానికి హాని చేకూర్చే విధంగా వరి కొయ్యలకు నిప్పు పెట్టవద్దని రైతులకు సూచించారు. దీనివల్ల కాలుష్యం వ్యాపిస్తూ భావి తరాలకు కూడా నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరమని, బాధ్యులకు రూ. 5వేలు మొదలుకుని రూ. 25వేల వరకు జరిమానా విధించే అవకాశాలు ఉంటాయని సూచించారు. పర్యావరణ సమతుల్యత, పచ్చదనాన్ని పెంపొందించేందుకు గాను విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పారదర్శకమైన ఓటరు జాబితా కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఇంటికి వచ్చే బీ.ఎల్.ఓలకు తగిన వివరాలు అందించాలని సూచించారు. చెరువుల శిఖం భూములు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని, కబ్జాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. పన్నులను సకాలంలో చెల్లిస్తూ, గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని హితవు పలికారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణ ప్రతిపౌరుడి బాధ్యతఅని గుర్తు చేశారు. శాంతియుత వాతావరణం నెలకొని ఉన్న ప్రాంతాలు సత్వర అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. నేరాల నియంత్రణకు ఉపకరిస్తూ, నేరాలు జరిగిన సందర్భాలలో నిందితుల ఆచూకి తెలుసుకునేందుకు ఉపకరించే సీ.సీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## పోలీస్ అధికారులు, సిబ్బంది డయల్ 100 కాల్స్ కు త్వరితగతిన స్పందించాలి

**శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి బెట్టింగ్, జూదం, మట్కా, గంజాయి లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.**

**నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ నితికా పంత్**



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం లో గురువారం జిల్లా ఎస్పీ నితికా పంత్ , జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ... ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేయరాదని, పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది నిరంతరం గస్తీ కాస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్ 100 కాల్స్ కి త్వరతగతిన స్పందించాలని అన్నారు. అనంతరం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్లో ఉన్న పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకొని, వారి పురోగతి కి కృషి చేయాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం, బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో మరియు వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చేయాలని తెలిపారు. ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నాకాబంది, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని అన్నారు.

మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్ , ఆసిఫాబాద్ డిఎస్పీ అశోక్ , జిల్లాలోని ఇన్స్పెక్టర్స్ , సబ్ ఇన్స్పెక్టర్స్ పాల్గొన్నారు.

## ఉచిత రక్త పరీక్షల కార్యక్రమం ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి, జూన్ 4 (వుదయం ప్రతినిధి):**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా భిక్కనూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా సంఘాల సభ్యుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత రక్త పరీక్షల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి రక్త పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించి, మహిళలకు నిర్వహిస్తున్న రక్త పరీక్షల తీరును పరిశీలించారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించేందుకు ఇటువంటి పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రక్తహీనత వంటి సమస్యలను గుర్తించి తగిన చికిత్స పొందాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ కోరారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత చేరువవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవీందర్, సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్, చైర్మెన్, తహసీల్దార్, డిఆర్డీవో దామోదర్ రెడ్డి, అడిషనల్ డిఆర్డీవో విజయలక్ష్మి , మండల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రాత్మక అడుగు... మోదీ ప్రభుత్వ భారీ కానుక!



**జూన్ 04 మల్యాల మండలం ( వుదయం ప్రతినిధి )**

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర కిషన్ మోర్చా ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రూ.7,597 కోట్ల వ్యయంతో రెండు ప్రధాన జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.ఈ అభివృద్ధి కార్యక్రమం కోసం గౌరవ కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ నిరంతరం చేసిన కృషి ఫలించింది.కరీంనగర్ – జగిత్యాల జాతీయ రహదారిఆర్మూర్ – జగిత్యాల – మంచిర్యాల జాతీయ రహదారి మొత్తం 190 కిలోమీటర్ల మేర ఈ రహదారులను నాలుగు లేన్లుగా విస్తరించనున్నారు. దీంతో ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గనున్నాయి. వ్యాపారం, పరిశ్రమలు, పెట్టుబడులు మరియు ఉపాధి అవకాశాలకు కొత్త ఊతం లభించనుంది.కేంద్ర కేబినెట్ సమావేశ నిర్ణయాలను గౌరవ కేంద్ర మంత్రి శ్రీఅశ్విని వైష్ణవ్ వెల్లడించారు.ప్రజల అవసరాలను గుర్తించి, అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్న మోదీ ప్రభుత్వం తెలంగాణ పురోగతికి అంకితభావంతో ముందుకు సాగుతోంది.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తాం



**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**నారాయణపేట జూన్04 (వుదయం ప్రతినిధి)**

మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. బీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి కర్ణాటక మంత్రి బోసు రాజు నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి దామోదర రాజనర్సింహ జూపల్లి కృష్ణారావు వాకిటి శ్రీహరి లకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించిన ఇరిగేషన్ అధికారులు. అనంతరం నారాయణ పేట జిల్లా మక్తల్ మండలం కాట్రేవు పల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ 1 పనులను గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్యాకేజ్ 1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి పంప్ హౌస్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శశ్రీధర్, చీఫ్ ఇంజనీరు. ఏ సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలి!

*ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఘనంగా అవగాహన సదస్సు.. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల ప్రతిజ్ఞ*

**- ఘనంగా వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు.. విజేతలకు బహుమతుల ప్రదానం**



**సిద్దిపేట, (వుదయం బ్యూరో):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన '99 డేస్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'ను పురస్కరించుకొని, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల మానవాళికి, పర్యావరణానికి జరుగుతున్న నష్టాలను వివరిస్తూ.. ప్రత్యామ్నాయ వస్తువుల వాడకంపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించారు. విద్యార్థుల్లో బాధ్యతను పెంపొందించేందుకు పర్యావరణ పరిరక్షణపై వ్యాసరచన పోటీలు, గ్రీన్ పర్యావరణంపై డ్రాయింగ్/పెయింటింగ్, మరియు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై వక్తృత్వ (స్పీచ్) పోటీలు** నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు పర్యావరణ అనుకూలమైన స్టీల్ వాటర్ బాటిళ్లను బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ శాస్త్రవేత్త టి. రవీందర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల మానవాళికి, పర్యావరణానికి పెను ముప్పు పొంచి ఉంది. ప్రతి ఒక్కరూ పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబించాలి. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, నేలను అందించాల్సిన గురుతర బాధ్యత మనందరిపై ఉంది కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీ మధుసూదన్ రెడ్డి, కాలేజీ అధ్యాపక బృందం, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదర్శ పట్టణంగా తీర్చిద్దడమే లక్ష్యం ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్ రెడ్డి

**- 8వ వార్డులో రూ. 40 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం**

**నాగర్ కర్నూల్ జూన్ 04 (వుదయం బ్యూరో)**



ప్రజల కష్టాలను తగ్గించి, రోజువారీ జీవితాన్ని సులభం చేసే దిశగా గురువారం నాగర్‌కర్నూల్ పట్టణం 8వ వార్డులో రూ. 40 లక్షల వ్యయంతో ఓపెన్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నగర అభివృద్ధి నిధుల నుంచి మంజూరైన ఈ నిధులు ఇకపై వర్షాకాలంలో నీటి నిల్వల బాధను తగ్గించనున్నాయి.ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ చేతుల మీదుగా జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో, వర్షంలో నిలిచే నీటి సమస్యకు చెక్ పెట్టేలా ఓపెన్ డ్రైనేజీ నిర్మిస్తున్నామని, పిల్లలు, వృద్ధులు సురక్షితంగా నడిచేలా మెరుగైన సీసీ రోడ్డు వేస్తున్నామని చైర్మన్ తెలిపారు. "ప్రతి వార్డులో మౌలిక సదుపాయాలు మెరుగుపడితేనే ప్రజల జీవితాల్లో మార్పు వస్తుంది. నాగర్‌కర్నూల్‌ను ఆదర్శ పట్టణంగా తీర్చిద్దడమే మా లక్ష్యం" అని ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజలతో కలిసి సంతోషాన్ని పంచుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతాయని నేతలు హామీ ఇచ్చారు.

## చల్మేడ లో ఉచిత మెగా ఆరోగ్య వైద్య శిబిరం..

**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండల పరిధిలోని చల్మేడ గ్రామంలో గురువారం సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ భైరవరెడ్డి, గ్రామ సర్పంచ్ పాలకవర్గ ఆధ్వర్యంలో ఆర్విఎం హాస్పటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి, రామాయంపేటసిఐ సైదా, ఎస్ఐ రాజేష్,లు హాజరయ్యారు.ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితాలలో ప్రతి మనిషి ఆరోగ్యవంతులుగా ఉండాలంటే ప్రతిరోజు వ్యాయామం,రన్నింగ్ ముఖ్యమన్నారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఆరోగ్య సమస్యలపై వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామాలలో ఇలాంటి ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని ఈ ఉచిత వైద్య శిబిరానికి కృషి చేసిన సీనియర్ జర్నలిస్ట్ భైరవరెడ్డి, పాలకవర్గానికి అభినందించారు గేమ్ లకు పాల్పడుతున్నారని ప్రతి ఒక్క తండ్రి తమ పిల్లలపై దృష్టి సారించాలని వారి మంచి భవిష్యత్తుకు బాటగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొమ్మన మల్లేశం, ఉపసర్పంచ్ ఆకుల మహేందర్, ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రాంరెడ్డి, డైరెక్టర్ బాజా రమేష్, అబ్బా రెడ్డి, సంగిపు నారాయణ, కార్యదర్శి శ్యామల, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ పోలీసుల సమర్థత

**వికారాబాద్, జూన్ 04; (వుదయం జిల్లా ప్రతినిధి):**



కరుడు గట్టిన అంతరాష్ట్ర దొంగ వికాస్ సింగ్ అరెస్ట్ .నిందితుడు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రవాసి సినిమా స్టైల్ లో 16 ఏళ్ల వయస్సు నుండే రాత్రి వేళ దొంగతనాలు .ప్రోత్సహించిన బంగారం వ్యాపారులు 27 రాత్రి పూట దొంగతనాలు చేసి 157 తులాల బంగారం, 256 తులాల వెండి,822,500 నగదు దొంగిలించిన దుండగుడు దొంగిలించిన సొమ్ముతో సేవా కార్యక్రమాలు విలాసవంతమైన జీవితం.ఇప్పటి వరకు నిందితుడిపై 61 కేసులు నమోదు.జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా.ఎస్పీ కార్యాలయంలో గురువారం జిల్లా ఎస్పీ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మణికంఠ నగర్ కాలనీలో గత నెల 01 వ తేదీ రాత్రి సమయం లో పట్టణం లో జరిగిన దొంగతనానికి సంభందించిన పూర్తి వివరాలను ఎస్పీ మీడియా కు వెల్లడించారు.పట్టణానికి చెందిన ఒకరి ఇంట్లో గత నెల 1వ తేదీ రాత్రి ఒకటిన్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 2,10,000 నగదు చోరీ జరుగగా పోలీసులు కేసు నమోదు చేసి అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఈ కేసును అత్యంత ప్రాధాన్యతతో తీసుకున్న వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య ఆధ్వర్యంలో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ ఇన్స్పెక్టర్ రఘుకుమార్ ల నేతృత్వంలోని ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారం, మరియు నేరస్థుల కదలికలను సిసి కెమెరాల ఆదారాలను విశ్లేషిస్తూ లోతైన దర్యాప్తు చేపట్టిన పోలీసులు, చివరకు నేర స్థలంలో సేకరించిన సాంకేతిక సాక్ష్యాల ఆధారంగా ఈ చోరీకి పాల్పడిన ప్రధాన నిందితుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వికాస్ సింగ్ అలియాస్ తేజా సింగ్ గా గుర్తించారు. చేసుకుని దొంగతనాలకు పాల్పడేవాడు. గతంలో ఇతను దొంగతనం చేసిన ఏరియాలు అయిన నర్సాపూర్, మేడ్చల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని నేరాల్లో ఇతనే దొంగతనం పాల్పడినట్లు సాంకేతిక ఆదారాలు లభించాయి. దీనితో నిందితుడిపై గట్టి నిఘా పెట్టిన జిల్లా పోలీస్ అధికారులు, అర్థరాత్రి సమయంలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు నమ్మలేని నిజాలు వెల్లడించాడు. 16 ఏళ్ల మైనర్ వయసులోనే నిజాలు పోలీసులకు వెల్లడించాడు. నిందితునిపై పాత 34 కేసులు, ఇప్పటి 27 కేసులు కలిపి మొత్తం 61 కేసులు నమోదు అయ్యినట్టు ఎస్పీ తెలిపారు.తేదీ 26.06.2024 నుండి ఇప్పటి వరకు చేసిన నేరాలు ఒప్పుకున్న 27 కేసులలో నేరస్థున్ని అరెస్టు చేయనున్నట్టు ఎస్పీ తెలిపారు.నిందితుని నుండి తులంన్నర బంగారం ఆభరణాలు, మరియు ఒక తుపాకీ (5ఎంఎం పిస్తోల్) ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.రిసీవర్లపై కఠిన చర్యలు - ఎస్పి హెచ్చరిక: బంగారం దుకాణాల యజమానులందరూ ఒక సిండికేట్ (ఆర్గనైజర్లు) గా ఏర్పడి, నిందితుడితో చేయికలిపి దొంగతనాలు చేయిస్తున్నట్లు మరియు అక్రమంగా అయూదాలు కొనడానికి ప్రోత్సహించినట్టు దర్యాప్తులో తేలడంతో, సదరు యజమానులపై కూడా ఆర్గనైజేడ్ క్రైమ్ , ఆర్మ్స్ యాక్ట్ ,అలవాటు పడ్డ నేరస్తులు, సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు ఎస్పీ తెలిపారు. అవసరమైతే వీరిపై పీడీ యాక్ట్ (PD Act) సైతం నమోదు చేయనున్నట్టు ఎస్పి హెచ్చరించారు. ఈ దొంగసొమ్ము రిసీవర్లను ఖచ్చితంగా అరెస్ట్ చేయడానికి ఒక సీనియర్ పోలీస్ అధికారితో ప్రత్యేక దర్యాప్తు టీమ్‌ను ఏర్పాటు చెయ్యనున్నట్టు ఎస్పీ తెలిపారు.దొంగసొత్తు స్వాదీనం చేసుకొని వారిని ఖచ్చితంగా అరెస్ట్ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకో నున్నట్టు ఎస్పీ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, కాలనీలు, గ్రామాల్లో ఎవరైనా గుర్తుతెలియని లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పి కోరారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలని, ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని సూచించారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని భరోసా ఇస్తూ, ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీస్ అధికారులను సంప్రదించాలని ఎస్పి ప్రజలకు విజ్ఞప్తి చేశారు."అత్యంత ప్రతిభావంతంగా, చాకచక్యంగా వ్యవహరించి అంతరాష్ట్ర దొంగను పట్టుకున్న, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ మరియు వారి సిబ్బందిని ఎస్పి ప్రత్యేకంగా అభినందించి, రివార్డులను ప్రకటించారు

## గీతంలో ముగిసిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ

**పటాన్చెరు (వుదయం):**



'అధునాతన భావనలు, బోధనా పద్ధతులు, విద్యా సాధనాలు' అనే అంశంపై భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన మూడు రోజుల రెసిడెన్షియల్ వృత్తి వికాస కార్యక్రమం (ఆర్పీడీపీ) హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ ఫిజిక్స్ అసోసియేషన్ సహకారంతో, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని భౌతికశాస్త్ర విభాగం నిర్వహించింది. భావనాత్మక అవగాహనను ప్రయోగాత్మక అభ్యాసం, వినూత్న బోధనా పద్ధతులతో అనుసంధానించడం ద్వారా పాఠశాల, యూజీ స్థాయిలలో భౌతిక శాస్త్ర విద్యను బలోపేతం చేయడానికి దీనిని రూపొందించారు. తరగతి గది బోధనలో శాస్త్రీయ జిజ్ఞాస, క్రియాశీల అభ్యాసం, భావనాత్మక స్పష్టత, ప్రత్యక్ష ప్రయోగాలను ప్రోత్సహించడంపై దృష్టి సారించింది.ఈ ఆర్పీడీపీ దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సంస్థల నుంచి విశిష్ట విద్యావేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులను ఒక చోట చేర్చింది. నిపుణుల ఉపన్యాసాలు, ప్రదర్శనలు, ముఖాముఖి ద్వారా, ఇందులో పాల్గొన్నవారు అధునాతన భౌతికశాస్త్ర భావనలు, ఆధునిక విద్యా సాంకేతికతలు, ఐసీటీ ఆధారిత బోధనా పద్ధతులు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రయోగాత్మక పద్ధతులు, సిమ్యులేషన్లు, సమర్థవంతమైన విద్యార్థి మూల్యాంకన వ్యూహాలపై విలువైన అవగాహన పొందారు.ఈ కార్యక్రమంలో విద్యుదయస్కాంత సిద్ధాంతం, ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్, సూపర్ కండక్టివిటీ, అయస్కాంతత్వం, అణు వికిరణం, స్వయంగా తయారు చేసుకునే (డీఐవై) ఫిజిక్స్ కిట్లు, వినూత్న తరగతి గది బోధనా పద్ధతులు, అభ్యసన మదింపు పద్ధతులు వంటి అనేక సమకాలీన అంశాలను చర్చించారు.తొలిరోజు, గీతం సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎస్. అనంత రామకృష్ణ, విశిష్ట ఆచార్యులు ప్రొఫెసర్ బి.వి.ఆర్. టాటా, ప్రొఫెసర్ జి. రవికుమార్, ఐఐటీ మద్రాసు పూర్వ ఆచార్యుడు ప్రొఫెసర్ టి.ఎస్. నటరాజన్, ఐఐఎస్సీ బెంగళూరు ప్రొఫెసర్ విబోర్ సింగ్, బార్క్ పూర్వ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జి.ఎ. రామారావు వంటి ప్రఖ్యాత భౌతికశాస్త్ర విద్యావేత్తలు, పరిశోధకులు ఉపన్యాసాలు, ముఖాముఖి నిర్వహించారు. అధునాతన భౌతిక శాస్త్ర భావనలు, వాటి వాస్తవ ప్రపంచ అనువర్తనాలు, సమర్థవంతమైన తరగతి గది, ప్రయోగశాల బోధనా పద్ధతులపై వారు చర్చించారు. విద్యార్థుల భాగస్వామ్యాన్ని, భావనాత్మక అవగాహనను మెరుగుపరచడానికి ప్రత్యక్ష ప్రయోగాలు, ప్రదర్శనలు, అనుకరణలు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రయోగాత్మక పద్ధతులను ఇందులో పొందుపరిచారు.చివరి రోజున, భౌతిక శాస్త్ర విద్య, బోధనా పద్ధతులు, అభ్యసన మదింపుపై ఒక ప్రత్యేక సదస్సును హైదరాబాదులోని మానుకు చెందిన ప్రొఫెసర్ వనజ, హోమీ భాభా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ దీపా చారి, గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రిచా శర్మ సంయుక్తంగా నిర్వహించారు. పాఠశాల, యూజీ స్థాయిలలో భౌతికశాస్త్ర విద్యను బలోపేతం చేసే లక్ష్యంతో, ఈ సదస్సు అభ్యాసకుడికేంద్రీకృత బోధనా పద్ధతులు, తరగతి గదిలో భాగస్వామ్యం, అనుభవపూర్వక అభ్యసనం, ఫలితాధారిత మదింపు వ్యూహాలపై దృష్టిసారించారు. ఇందులో పాల్గొన్న భౌతికశాస్త్ర అధ్యాపకులు, తమ ప్రతిస్పందనలో, ఈ కార్యక్రమాన్ని ఎంతగానో ప్రశంసించారు. ప్రస్తుత విద్యా వాతావరణంలో భౌతికశాస్త్ర విద్యను మెరుగుపరచడానికి ఉన్నత భావనల పరిచయం, ప్రత్యక్ష ప్రయోగాలు, వినూత్న బోధనా పద్ధతులు అత్యవసరం అని వారు పేర్కొన్నారు. ప్రముఖ నిపుణులతో సంభాషించడానికి, వారి వృత్తిపరమైన సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి ఒక ప్రత్యేక వేదికను అదించినందుకు వారు గీతం యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని భౌతికశాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ జి.సాయిప్రీతి, డాక్టర్ టి.విశ్వం సమన్వయం చేశారు.

## యువత ఉపాధి అవకాశాల తో ఆర్థికంగా ఎదగాలి



**మాజీ హోమ్ మంత్రి సబితా రెడ్డి**

**వెల్దండ జూన్ 4**

గ్రామీణ ప్రాంత యువత స్వయం ఉపాధి కల్పించుకొని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర మాజీ హోం మంత్రి సబితా రెడ్డి పేర్కొన్నారు మండల కేంద్రంలో యువ నాయకులు పోలే అశోక్ నూతన టీ స్టాల్ ను మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, వెల్దండ సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు లతో కలిసి ప్రారంభించింది బిఆర్ఎస్ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు పుట్టరామ్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం రెడ్డి, నిరంజన్, యాదగిరి, తోపాటు తదితరులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా ముఖ్య అతిథులను టీ స్టాల్ యజమాని పోలే అశోక్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు

## మొక్కలు నాటాలి.. ఇంకుడు గుంతలు తీయాలి!



**వనపర్తి జూన్ 4 (వుదయం ప్రతినిధి)**

మొక్కలు నాటడం, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. గురువారం ఖిల్లా ఘనపూర్ మండలం పర్వతపురం రైతువేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు. అమ్మాయిలకు బాల్యవివాహాలు చేయకుండా ఉన్నత చదువులు చదివించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మంచి ఫలితాలు వచ్చాయని కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచినీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు. ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 60 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ. 20 వేల లబ్ధి పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి చేతుల మీదుగా ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ రఘునాథ్, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ స్థాయి సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రతకు ఫస్ట్ ప్రిఫరెన్స్!

**డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్**

**మహబూబ్ నగర్ జూన్04 (వుదయం ప్రతినిధి)**

విద్యార్థుల సురక్షిత రవాణా ప్రతి పాఠశాల యాజమాన్యం, వాహన యజమాని, డ్రైవర్ యొక్క సామాజిక బాధ్యత అని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ తెలిపారు. పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాల అమలు,డ్రైవర్లకు తగిన శిక్షణ కల్పించడం ద్వారా మాత్రమే విద్యార్థుల ప్రాణ భద్రతను సమర్థవంతంగా కాపాడగలమని పేర్కొన్నారు.మోటారు వాహనాల చట్టం, 1988 లోని సెక్షన్ 56 ప్రకారం ప్రతి రవాణా వాహనం చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌ను కలిగి ఉండటం తప్పనిసరి అన్నారు. ఫిట్‌నెస్ లేని వాహనాలను రహదారులపై నడపడం చట్టవిరుద్ధం అన్నారు. కేంద్ర మోటారు వాహనాల నియమాలు, 1989, పాఠశాల బస్సుల భద్రతకు సంబంధించిన నిబంధనలు ప్రకారం పాఠశాల బస్సులు నిర్దేశిత భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి అన్నారు. పాఠశాల బస్సులలో అత్యవసర ద్వారం, అగ్నిమాపక పరికరం, ప్రథమ చికిత్స పెట్టె, స్పీడ్ గవర్నర్, జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ, సీసీ కెమెరాలు (ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు), తగిన సీటింగ్ సదుపాయం స్పష్టమైన గుర్తింపు బోర్డులు ఉండాలి అన్నారు. వాహనాల బ్రేకులు, టైర్లు, స్టీరింగ్ వ్యవస్థ ,ఇతర యాంత్రిక భాగాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయించాలన్నారు.అదేవిధంగా, పాఠశాల బస్సులను నడిపే డ్రైవర్లు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు తగిన అనుభవం కలిగి ఉండాలన్నారు. రహదారి భద్రత, రక్షణాత్మక డ్రైవింగ్, అత్యవసర పరిస్థితుల నిర్వహణ, విద్యార్థులతో సౌమ్యంగా వ్యవహరించడం, ట్రాఫిక్ నిబంధనల పాటింపు తదితర అంశాలపై వారికి నిరంతర శిక్షణ,అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.పాఠశాల యాజమాన్యాలు తమ వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు, బీమా పత్రాలు, డ్రైవర్ల లైసెన్సులు, ఇతర చట్టబద్ధమైన పత్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలి అన్నారు. విద్యార్థుల రవాణాలో భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబడదని స్పష్టం చేశారు.రవాణా శాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలను ఉల్లంఘించే వాహన యజమానులు, నిర్వాహకులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.పిల్లల భద్రతే ప్రథమ ప్రాధాన్యం - సురక్షిత పాఠశాల రవాణా అందరి బాధ్యత అని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ ఎన్ వాణి అన్నారు.


## కోదాడ పెద్ద చెరువు మత్స్య సొసైటీ ఎన్నికల్లో నాగేంద్రబాబు ప్యానల్ హవా



**కోదాడ, జూన్ 4(వుదయం)**

కోదాడ పెద్ద చెరువు మత్స్య సహకార సంఘం ఎన్నికలు గురువారం పోలీసుల కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య హోరాహోరీగా జరిగాయి. మొత్తం 550 మంది సభ్యులు ఉన్న ఈ సొసైటీలో 9 డైరెక్టర్ పదవులు ఉండగా, ఒక పదవి ఏకగ్రీవం కావడంతో మిగిలిన 8 స్థానాలకు పోలింగ్ నిర్వహించారు.మహేష్ ప్యానల్, నాగేంద్రబాబు ప్యానల్ మధ్య జరిగిన పోటీలో నాగేంద్రబాబు ప్యానల్ స్పష్టమైన ఆధిక్యం సాధించింది. నాగేంద్రబాబుతో పాటు ఆయన ప్యానల్‌కు చెందిన మరో ఆరుగురు డైరెక్టర్లు విజయం సాధించగా, ప్రత్యర్థి ప్యానల్ నుంచి గాదె మహేష్ ఒక్కరే గెలుపొందారు. ఓట్ల లెక్కింపులో జాప్యం కారణంగా తుది ఫలితాల ప్రకటన సాయంత్రం ఆలస్యంగా జరిగింది. అనంతరం ఎన్నికల అధికారి వి. ఇందిరా గెలుపొందిన డైరెక్టర్లకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.విజేత డైరెక్టర్లు: శీలం నాగేంద్రబాబు, గాదె మహేష్, ఐతన బోయిన వెంకన్న, వేముల గోపి, శీలం లక్ష్మయ్య, గుండ్లపల్లి రామారావు, పిట్టల రామయ్య, రెడ్డిబోయిన ఉపేందర్.డైరెక్టర్ స్థానాల్లో మెజార్టీ సాధించిన నేపథ్యంలో నాగేంద్రబాబు చైర్మన్ పదవిని కైవసం చేసుకునే అవకాశాలు ఉన్నాయని ఆయన అనుచరులు భావిస్తున్నారు. చైర్మన్ ఎన్నిక శుక్రవారం జరగనుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా టౌన్ ఎస్ఐ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

## రైతులు నానో యూరియా పై దృష్టి సారించాలి



**అదనపు కలెక్టర్ నర్సింగరావు**

**గద్వాల జూన్ 04 (వుదయం కరస్పాండెంట్)**

నేల సారవంతతను కాపాడడానికి రైతులు నానో యూరియా పై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. గురువారం ఇటిక్యాల మండలం చాగాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు, మండల స్పెషల్ ఆఫీసర్ సునంద ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సీ రివిజన్), ఫార్మర్ రిజిస్ట్రేషన్, తదితర అంశాల గురించి రైతులకు వివరించడం జరిగింది. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మరియు అంగన్వాడి సెంటర్ ని సందర్శించి గ్రామస్థులకు వెజిటేబుల్స్ సీడ్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రమ్మ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## తారకళాశాలలో దోస్తు ద్వారా డిగ్రీలో ప్రవేశాలకు చివరి అవకాశం

**సంగారెడ్డి వుదయం.**



తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో దోస్త్ ద్వారా డిగ్రీ లోని వివిధ కోర్సులలో అడ్మిషన్లు పొందుటకు దోస్తు మూడవ దశ అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఇది చివరి అవకాశం అని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపినారు.తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో డిగ్రీలో అడ్మిషన్లకై దోస్త్ ద్వారా రెండవ దశలో సీట్లు వచ్చినవారు తమ సీటును రిజర్వేషన్ చేసుకొనుటకు ఆన్లైన్ సెంటర్ల ద్వారా గాని, మీసేవ ద్వారా గాని రేపటి లోపు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని, లేనిచో వారి సీటు రద్దవుతుందని తెలిపినారు. తారా కళాశాల తెలంగాణలోని ఉన్నతమైన పది కళాశాలలో ఒకటని, ఈ కళాశాలలో బి.ఏ; బి.ఎస్సి. లైఫ్ సైన్సెస్; బి.ఎస్సి. ఫిజికల్ సైన్సెస్; బి.సి.ఏ.; బి.బి.ఏ.; బీ.కాం, కంప్యూటర్స్ వంటి కోర్సులతోపాటు ఉపాధిని కల్పించే బీకాం (బి.ఎఫ్.ఎస్.ఐ); బీ.కాం. (హెచ్.ఆర్); బి.బి.ఏ. (రిటైలింగ్) మరియు బి.ఫార్మసీ. కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఈ కోర్సులను బోధించడానికి అత్యధిక అనుభవము కలిగిన అధ్యాపక బృందం అందుబాటులో ఉందని తెలిపినారు. ఈ కళాశాలలో అడ్మిషన్ పొందిన వారికి ఎన్సిసి, ఎన్.ఎస్.ఎస్., క్రీడల వంటి సదుపాయాలతో పాటు విద్యార్థులు రాష్ట్ర ,జాతీయ స్థాయి శిబిరాలలో పాల్గొనుటకు అవకాశం ఉందని తెలిపినారు. కళాశాలలో సైన్స్ విద్యార్థులకు ఆధునిక సదుపాయాలు కలిగిన లాబరేటరీ సదుపాయాలు ఉన్నాయని, కంప్యూటర్ విద్యార్థులకు పూర్తి సదుపాయాలతో కంప్యూటర్ ల్యాబ్లు ఉన్నాయని, విద్యార్థులకు జిమ్ సదుపాయం కూడా అందుబాటులో ఉందని తెలిపారు. వీటన్నింటితో పాటు అన్ని కోర్సులకు సంబంధించిన పుస్తకాలు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో అతిపెద్ద లైబ్రరీ సదుపాయం బాటులో ఉందని, వీటన్నింటితో పాటు ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్షిప్ సదుపాయం ఉందని, మరియు పదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రభుత్వ పాఠశాల, మరియు కళాశాలలో చదివిన అమ్మాయిలకు అజిత్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సంవత్సరానికి 30 వేల స్కాలర్షిప్ సదుపాయాన్ని అందిస్తున్నదని, అదే విధంగా అమ్మాయిలకు సంవత్సరానికి ₹ 10,000 వరకు మలబార్ గోల్డ్ స్కాలర్షిప్ సదుపాయం అందుబాటులో ఉందని తెలిపినారు.కావున దోస్తు ద్వారా మూడవ దశ అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 15వ తారీకు వరకు ఉందని, డిగ్రీ చదివే విద్యార్థులు తారా కళాశాలకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చి అడ్మిషన్ పొందాలని తెలిపినారు. దోస్తు ద్వారా డిగ్రీలో అడ్మిషన్ పొందడానికి ఇదే చివరి అవకాశం అని, విద్యార్థులు దీనిని గమనించి తారా కళాశాలలో మూడవ దశ అడ్మిషన్లలో మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని తెలిపినారు. తారా కళాశాల సంగారెడ్డి జిల్లాలోని ఐడి కళాశాలని, ఈ కళాశాలకు జాతీయస్థాయి న్యాప్ ఏ ప్లస్ గ్రేడ్ లభించిందని, అత్యున్నతమైన విలువలు కలిగిన, అనుభవము కలిగిన అధ్యాపక బృందం కలిగినటువంటి ఈ కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్ పొందాలని తెలిపినారు. దోస్తు ద్వారా మూడవ దశ అడ్మిషన్లు ఈనెల 15వ తేదీ చివరి అవకాశం అని పేర్కొన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే అభ్యర్థులు నేరుగా కళాశాలను సందర్శించి వారి సందేహాలను నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు.

## ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు!

**కంది వుదయం.**



కంది మండలంలోని జుల్కల్, కాశీపూర్ గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి ఆసియా బేగం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ వివరాలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువుల సరఫరా సక్రమంగా ఉండాలని ఆమె సూచించారు. ఎవరైనా ఎరువులను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ కూతురి చదువుకు ఆర్థిక చేయూత



నాగర్ కర్నూల్ జూన్ 04
(వుదయం ప్రతినిధి)

జిల్లా లోని పదరా మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ రామస్వామి కుమార్తె హైదరాబాదులో ఏజీబీఎస్సీ చదువు తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఫీజు, మెస్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి తెలియడంతో జర్నలిస్ట్ సంఘాలు స్పందించాయి.ఐజేయు నాగర్‌కర్నూల్ జిల్లా నేషనల్ కౌన్సిల్ సభ్యులు గోలి సుదర్శన్ రెడ్డి రూ. 10,000, మరో ఐజేయు సభ్యుడు రూ. 5,000 చొప్పున మొత్తం రూ. 15,000 ఆర్థిక సహాయాన్ని గురువారం నాగర్‌కర్నూల్‌లో రామస్వామికి అందజేశారు.ఇంతకుముందు క్లాస్‌మేట్ క్లబ్ తరపున కూడా ఆయనకు కొంత సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జె ఐజేయు నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు పి. విజయకుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రమణ కుమార్, జయప్రసాద్, పాలాది యాదయ్య సీనియర్ నాయకులు కొండకింది మాధవరెడ్డి, తాలూకా ఉపాధ్యక్షులు జంగిటి రాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# హత్నూర పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




హత్నూర వుదయం ప్రతినిధి జూన్ 4:

హత్నూర పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణ, సిబ్బంది బ్యారెక్స్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించి పలు సూచనలు చేశారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్న ఎస్పీ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.తరచూ వాహనాల తనిఖీలు, నాకాబందీ నిర్వహించి అనుమానిత వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచాలని చెప్పారు. రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ రికార్డుల్లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఎస్‌హెచ్‌వోకు సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి, వారి సమస్యలను ఓపికగా విని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ తనిఖీలో హత్నూర ఎస్‌హెచ్‌వో శ్రీధర్ రెడ్డి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# లాసెట్-2026 ఫలితాల్లో సెయింట్ ఆంథోనీస్ విద్యార్థినుల ప్రతిభ

సంగారెడ్డి: వుదయం



టీజీలాసెట్ 2026 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో సెయింట్ ఆంథోనీస్ కళాశాల విద్యార్థినులు విశిష్ట ప్రతిభ కనబరిచారు.ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన లాసెట్ 2026 ప్రవేశ పరీక్షలో కళాశాలకు చెందిన పబ్బతి చరణ్య తేజ రాష్ట్ర స్థాయిలో 305వ ర్యాంకు సాధించి కళాశాల ఖ్యాతిని మరింత పెంచింది. అలాగే మాదారం మానస 3768వ ర్యాంకు సాధించి ప్రతిభను చాటింది.ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను కళాశాల ఛైర్మన్ డా. సాల్మన్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఈ.జ్యోతి రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ జయబాల రెడ్డి అభినందించి సన్మానించారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించింది.

# నిజాంపేటలో ఇంటిపై పిడుగు

మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి



నిజాంపేట మండల కేంద్రంలో గురువారం కురిసిన భారీ వర్షానికి గ్రామానికి చెందిన పంజా శ్రీనివాస్ 4వ అంతస్తు బిల్డింగ్ పై పిడుగు పడడం జరిగింది. ఈ పిడుగుపాటు వల్ల బంగ్లా పై ఉన్నటువంటి పీలేరు వాటర్ ట్యాంక్ పూర్తిగా దెబ్బతిన్నాయి. ఒకేసారి పెద్ద ధ్వనితో పిడుగు సౌండ్ తో ఇంట్లో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఒకేసారి ఉలికి పడడం జరిగిందని ఈ ప్రమాదంలో ఎవరికి హాని జరగలేదు. గ్రామంలో పిడుగు పడడం ఇది రెండవసారి కావడం విశేషం

# గాలివానకు కూలిన హోర్డింగ్

నారాయణపేట జూన్02
(వుదయం ప్రతినిధి)



నారాయణపేట జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు లో గల ఓ భవనం పైన ఉన్న హోర్డింగ్ గాలి వానకు కుప్ప కూలింది. సత్యసాయి కాలనీలోని జి రఘు(1641/7/ఏ) అనే యజమాని ఇంటి పైన ఉన్న హోర్డింగ్ ఒక్కసారి గా మంగళవారం తెల్లవారుజామున వీచిన గాలులకు, అధిక మొత్తంలో వర్షం రావడంతో కుప్పకూలింది. ఈ హోర్డింగ్ పక్కనే ఉన్న బిల్డింగ్ పైన పడటంతో పెను ప్రమాదం తప్పింది. కుప్ప కూలిన హోర్డింగ్ మున్సిపల్ అధికారులు వివిధ శాఖల అధికారులు పరిశీలించి ఇంటి యజమానితో మాట్లాడి హోర్డింగ్ నిర్మించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# బాల కేంద్రంలో ఘనంగా ఎస్పీ బాలు జన్మదిన వేడుకలు




నారాయణపేట టౌన్ జూన్04
(వుదయం ప్రతినిధి)

నారాయణపేట బాల కేంద్రంలో ఎస్పీ బాలు జన్మదిన వేడుకలను రంగ రంగ వైభవంగా నిర్వహించారు.సంగీత ప్రపంచానికే స్వర నిఘంటు బాలుఅని నేటి కళాకారులకు స్ఫూర్తి దాయకమని 50వేలకుపైగా దేశభక్తి అన్నమయ్య కీర్తనలతోపాటు భక్తి, సినీ పాటలను ఆలపించి పాడుత తీయాగ కార్యక్రమం ద్వారా ఎందరో కళాకారుల్లో దాగి ఉన్న కళను వెలిక్కి తీసి ప్రోత్సహించిన మహోన్నత గాయకుడు ఎస్పి బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం బాలకేంద్రంలో ఎస్పి బాలు 80 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించి చిన్నారులకు పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలొ గాయకులు బాలాజీ గౌడ్, సంగనర్సింహులు, రామ కృష్ణకళ్యాణి, వసంత్, జ్ఞానమృత తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనతో కదిలిన యంత్రాంగం.. జూరాల రహదారికి తాత్కాలిక మేకప్!

ధరూర్ జూన్ 04 (వుదయం బ్యూరో)



ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని అధికారులు, ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పర్యటనలో భాగంగా ధరూర్ మండలం లోని జూరాల గుడ్డెందొడ్డి రిజర్వాయర్‌ను సందర్శించనున్న నేపథ్యం లో, చాలా కాలంగా గుంతలతో అధ్వాన్నం గా మారిన రహదారిపై హడావుడిగా మర మ్మతు పనులు చేపట్టారు. జూరాల ప్రాజె క్టుకు వెళ్లే ప్రధాన రహదారి నెలల తరబడి గుంతలమయంగా మారి వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టిం చుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. అయితే సీఎం, మంత్రుల రాక ఖరారైన వెంటనే యంత్రాంగం రంగంలోకి దిగి కొన్ని ప్రాంతా ల్లో ప్యాచ్‌వర్క్ చేపట్టడం తో పాటు డస్ట్, కంకర వేసి రహదారిని చదును చేసింది.అయితే ఈ పనులు కేవలం అతిథుల రాక కోసం చేసిన తాత్కాలిక ఏర్పాట్లేనని స్థాని కులు ఆరోపిస్తున్నారు. రహదారి పూర్తిస్థా యిలో దెబ్బతిన్నప్పటికీ శాశ్వత మరమ్మ తులపై దృష్టి సారించకుండా, పైపైన పనుల తో సరిపెట్టారని విమర్శిస్తున్నారు. ప్రజల రాకపోకలకు ఉపయోగపడే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, వీఐపీల పర్యటనల సందర్భంగా మాత్రమే స్పందించడం పట్ల అసంతృప్తి వ్యక్తమవు తోంది. ప్రజల కోసం కాదు... పెద్దల కోసం రోడ్డు!" అన్నట్లుగా సీఎం పర్యటనతోనే గుంతల రహదారికి మేకప్ చేయడం అధి కార యంత్రాంగం పనితీరుపై మరోసారి ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూరేలా నాణ్యమైన రహదారి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# అధికారుల నిర్లక్ష్యంతో చెత్త కుప్పలా మారిన మూడవ వార్డు



నారాయణపేట జూన్04
(వుదయం ప్రతినిధి)

ప్రభుత్వంఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో అధికారుల నిర్లక్ష్యంతో వాటిలో సమస్యలు ఎక్కడికక్కడే తిష్ట వేశాయని వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ ఆరోపించారు. గురువారం నారాయణపేట పట్టణం లోని మూడో వార్డులో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడవ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించిన వినతి పత్రాలు అందజేసిన సమస్యలు మాత్రం పరిష్కరించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వార్డులో విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలను వేశారు కానీ వాటికి వైర్లు బిగించడం మరిచిపోయారని అన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో స్మశాన వాటికకు విద్యుత్తును ఏర్పాటు చేశారు.గత వారం రోజుల క్రితం గాలి వాన విపరీతంగా రావడంతో స్మశాన వాటికలో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో అధికారులకు సమాచారాన్ని అందించిన కూడా వ్యక్తి వైర్లను ఇప్పటి వరకు సరి చేయలేదని ఆరోపించారు. మూడో వార్డులో చెత్త వేసుకునేందుకు మున్సిపాలిటీ వాహనాలు రాకపోవడం తో వార్డులో ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తుందని ఆరోపించారు. మిషన్ భగీరథ పైప్లైన్లు వాటిలో వేయాలని ఎన్నోసార్లు అధికారులకు విన్నవించిన వినతి పత్రాలు ఇచ్చిన ఇంతవరకు పైపులను బిగించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమంలోనైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వార్డులో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మూడో వార్డుకు చెత్త వాహనాలను వచ్చే విధంగా చూడాలని ఆమె కోరారు.వాహనాలు రాకపోవడం తో పాటు ప్రజలు చెత్తను ఇంట్లో నిల్వ ఉంచడంతో రోగాల బారిన పడుతున్నారని దీంతోపాటు వార్డులో తమ ఇంటి చుట్టుపక్కల చెత్తను వేస్తూ దుర్వాసన తో ప్రజల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.అధికారులు వెంటనే స్పందించి మూడో వార్డుకు చెత్త వాహనాలను వచ్చే విధంగా చూడాల్సిందిగా కోరారు.ఈ ప్రజా పాలన కార్యక్రమంలో వాటిలోని సమస్యలను ఆమె స్వయంగా అధికారుల తో ఆమె వార్డు లో పర్యటించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామనివార్డు కౌన్సిలర్ కాకర్లనారాయణమ్మకు అధికారులు తెలిపారు.

# 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' పూర్తి

**1 నుండి 5 వార్డులలో ప్రజల నుండి వినతుల స్వీకరణ.. త్వరలోనే పరిష్కరిస్తామన్న మున్సిపల్ కమీషనర్ గణేష్ రెడ్డి**

గజ్వేల్, జూన్ 04 (వుదయం ప్రతినిధి)



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం)"** లో భాగంగా గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన వార్డు సభలు విజయవంతంగా ముగిశాయి. మున్సిపాలిటీలోని 1 నుండి 5 వార్డులలో గురువారం నిర్వహించిన ఈ సభలలో ప్రజల నుండి పెద్ద ఎత్తున వినతులు, ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. మార్గదర్శకత్వంలో వార్డు కౌన్సిలర్లు, అధికారులు, మున్సిపల్ యంత్రాంగం అంతా ఈ సభల్లో పాల్గొని ప్రజలతో నేరుగా మాట్లాడారు. * మున్సిపల్ మేనేజర్ బాలకృష్ణ, వార్డు ఇన్‌చార్జ్‌లు, సూపర్‌వైజర్లు, మెప్మా RPలు మరియు ఇతర సిబ్బంది ఉదయం నుంచే క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సభల నిర్వహణను పర్యవేక్షించారు. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీల వంటి మౌలిక వసతులు మరియు ఇతర పౌర సేవలకు సంబంధించి ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను అధికారులు క్షుణ్ణంగా నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ గణేష్ రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసమే ఈ 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు.ఈరోజు వార్డు సభల ద్వారా ప్రజల నుండి అందిన ప్రతి వినతిని త్వరితగతిన పరిశీలించి, వాటిని వీలైనంత వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే మా ప్రథమ ప్రాధాన్యత ఎప్పుడూ ఉంటుందని కొనియాడారు.

# మంత్రి సీతక్కకు సర్పంచ్‌ల వినతి!

వుదయం న్యూస్ కొండపాక ప్రతినిధి



గ్రామపంచాయితీల అభివృద్ధిలో భాగంగా తమతమ గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చవలసిందిగా కోరుతూ కొండపాక మండల పరిధిలోని సర్పంచులు సిద్దిపేట డిసిసి అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వాసరి లింగారావు ఆధ్వర్యంలో గురువారం రోజు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి తగు విధంగా ఫండ్స్ విడుదల చేసేందుకు సానుకూలంగా స్పందించినట్టు సర్పంచులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెలకట్ట గ్రామ సర్పంచ్ మానస సురేందర్ రావు,జప్తి నాచారం సర్పంచ్ పావని శశిధర్ రెడ్డి, తిమ్మారెడ్డి పల్లి సర్పంచ్ కొయ్యడ వెంకటేశం,బంధారం గ్రామ సర్పంచ్ కొలుపుల గంగాదర్ తో పాటు పాక్స్ డైరెక్టర్ బూర్గుల సురేందర్ రావు పాల్గొన్నారు.

# కేంద్రం నిధులతోనే అభివృద్ధి

**తెలంగాణలో బిజెపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి**
**ఎమ్మెల్సీ అంజిరెడ్డి**

నారాయణపేట టౌన్ జూన్04
(వుదయం ప్రతినిధి)




రాబోయే ఎన్నికల్లో తెలంగాణ లో బిజెపి అధికారమే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి పిలుపు నిచ్చారు.గురువారం నారాయణపేటలో రెండు రోజులపాటు జరిగే దీన దయాళ్ కార్యకర్తల ప్రశిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.జాతీయ నాయకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ,దీన దయాళ్ ,అటల్ బిహారీ వాజ్ పేయి,ఎల్ కే అద్వానీ నేటి ప్రధాని నరేంద్ర మోడీ ,అమిత్ షా స్ఫూర్తితో కార్యకర్తలు పార్టీ కోసం ఓడినా గెలిచినా పని చేయాలన్నారు.ఒకప్పుడు బిజెపి ఎక్కడ అన్నవారు వారు ఇప్పుడు ఎక్కడో వారికి అర్థం అయిందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందేలా కృషి చేయాలని కోరారు. నరేంద్రమోడీ ప్రధాని అయ్యాక దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ విశ్వగురు గా ఎదుగుతున్నదని అన్నారు.దీనికంతటికీ కార్యకర్తల పట్టుదల కృషి కారణమన్నారు.నేడు దేశవ్యాప్తంగా ప్రజలు డబుల్ ఇంజన్ సర్కార్ ను కోరుకుంటూ వివిధ రాష్ట్రాల్లో బిజెపి నీ గెలిపిస్తున్నారని అన్నారు. అందుకు తాజా ఉదాహరణ పక్షిమ బెంగాల్,అస్సోం,పుదుచ్చేరి ప్రజలు ఇచ్చిన తీర్పే నిద ర్శనం అన్నారు.రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కేంద్రం నిధులతోనే నని అన్నారు. కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేసి కేంద్రం చేస్తున్న అభివృద్ధిని వివరించి తెలంగాణలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటుకు కట్టుబడి కృషి చేయాలని కోరారు.ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ ,కే.రతంగ్ పాండు రెడ్డి,బి.కొండయ్య,ప్రదీప్ ,బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్,మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్, వైఎస్ చైర్ పర్సన్ మంజుల జి ఆర్ రెడ్డి ,కాన్సిలర్లు,మండల నాయకులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# వరి కొయ్యల మంటల్లో అన్నదాత సజీవ దహనం

- మిరుదొడ్డిలో ఘోరం
- వరి కొయ్యలు తగలబెడుతూ మంటల్లో చిక్కుకుని వ్యక్తి మృతి
- మృతుడు మద్దెల మల్లయ్యగా గుర్తింపు
- గ్రామంలో విషాదఛాయలు

దుబ్బాక,వుదయం (జూన్ 04) :



సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పొలంలో వరి కొయ్యలు తగలబెడుతుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని ఓ వ్యక్తి సజీవ దహనమయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. మిరుదొడ్డి గ్రామానికి చెందిన మద్దెల మల్లయ్య (61) వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఉదయం తనకు చెందిన పొలంలో కోసిన వరి పంట కొయ్యలను తగలబెడుతున్నారు. ఈ క్రమంలో గాలికి మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. మంటలను ఆర్పే ప్రయత్నంలో మల్లయ్య ప్రమాదవశాత్తు అందులో చిక్కుకుపోయాడు. స్థానికులు గమనించి మంటలను ఆర్పి, ఆయనను బయటకు తీసేలోపే తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రైతులు వరి కొయ్యలు తగలబెట్టి అన్నదాతలు ప్రాణాలు తీసుకోవద్దని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

# పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

నారాయణపేట జూన్04
(వుదయం ప్రతినిధి)



నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని 14 వ వార్డులో రేష్మాబేగం మహమ్మద్ జాఫర్ తాజ్ యొక్క నిర్మాణం పూర్తిచేసుకున్న ఇందిరమ్మ ఇంటిని గురువారం పేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి,వార్డు కౌన్సిలర్ యల్. అరుణ మనోహర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శంకర్ లు ప్రారంభించారు.ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ శివారెడ్డి,కౌన్సిలర్ అరుణ మనోహర్ గౌడ్ లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందని పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి, కుంభం.శివకుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో 14వ వార్డుకు మొత్తం 20 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, అందులో ఇప్పటికే 16 ఇండ్ల నిర్మాణం పూర్తై లబ్ధిదారులకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. మిగిలిన ఇండ్లు కూడా వేగంగా నిర్మాణం జరుగుతున్నాయని చెప్పారు.ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి నారాయణపేట పట్టణ అభివృద్ధి,మౌలిక సదుపాయాల కల్పన, పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు.అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మనోహర్ గౌడ్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి.సలీం ,కాంగ్రెస్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహిమూద్ ఖురేషి, సీనియర్ నాయకులు భీంచందర్ గౌడ్,మాజీ కౌన్సిలర్ రమేష్,పళ్ళ అనిల్,యూసుఫ్ తాజ్,వెంకటేష్ గౌడ్, ఎరుకలి వెంకటయ్య, జబ్బార్,స్థానిక కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టు స్థలం కోసం మరో పోరాటం అవసరం

**గద్వాల హక్కులు ఉద్యమాలతోనే సాధించాం: డీకే అరుణ**

గద్వాల, జూన్ 04 (వుదయం బ్యూరో)



జిల్లా కోర్టు సముదాయానికి ప్రజలకు అందుబాటులో ఉండే, భద్రతా ప్రమాణా లకు అనుగుణమైన స్థలాన్ని ఎంపిక చేయాలన్న డిమాండ్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని మాజీ మంత్రి, డీకే అరుణ స్పష్టం చేశారు. జిల్లా కోర్టు స్థల ఎంపిక అంశంపై గద్వాల బార్ అసోసియే షన్ ప్రతినిధులు గురువారం ఆమెను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ, గద్వాల ప్రాంత చరిత్రలో ఎన్నో కీలక విజయాలు ప్రజల ఐక్య పోరాటాల ఫలితంగానే సాధ్యమయ్యాయని గుర్తు చేశారు. ఒకప్పుడు గద్వాలకు జిల్లా హోదా కల్పించడం అసాధ్యమని చెప్పిన వారిణే ప్రజా ఉద్యమాల ద్వారా ఒప్పించగలిగామని, అదే స్ఫూర్తితో జిల్లా కోర్టుకు అనువైన స్థలం కోసం న్యాయవాదులు, ప్రజలు కలిసికట్టు గా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జిల్లా కోర్టు వంటి కీలక సంస్థ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండటం ప్రజల సౌలభ్యం దృష్ట్యా అత్యంత అవసరమని ఆమె పేర్కొన్నారు. అయితే జిల్లా కేంద్రానికి దాదాపు పది కిలోమీటర్ల దూరంలో, తగిన భద్రతా సౌకర్యాలు లేని ప్రాంతాన్ని ఎంపిక చేయడం ఆశ్చర్యకరమని, ఇది ప్రజల అవసరాలను విస్మరించిన నిర్ణయంగా కనిపిస్తోందని విమర్శించారు. గద్వాల అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల అనాలోచిత నిర్ణ యాలు ప్రతికూల ప్రభావం చూపుతున్నా యని డీకే అరుణ ఆరోపించారు. పేదల కోసం కేటాయించిన భూమిలో మెడికల్ కాలేజీ నిర్మాణం, రైతుల ప్రయోజనాల కోసం ఉన్న మార్కెట్ యార్డు స్థలంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు, కేంద్రీయ విద్యాలయానికి కూడా అనువుకాని స్థలాన్ని ప్రతిపాదించడం వంటి చర్యలు ప్రజాప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. జిల్లా కోర్టు స్థల ఎంపిక విషయంలో ప్రభుత్వం పునరాలోచించేలా తన వంతు ప్రయత్నం చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ముఖ్యంగా యువ న్యాయవాదులు తమ వృత్తి భవిష్యత్తు, ప్రజల న్యాయసేవల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చట్టబద్ధమైన పోరాటాన్ని కొనసాగించాలని సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కావలి నరసింహులు, ఇస్మాయిల్, మదన్ మోహన్ రెడ్డి, శ్రీకాంత్, జయసింహారెడ్డి, రాజేశ్వర్, ఆనంద్ గౌడ్, ఆనంద్ రావు, రమేష్, మన్సూర్, మురళీధర్ రెడ్డిలతో పాటు పలువురు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# నూతన డీఈఓ వరగంటి శాస్త్రికి టీపీటీఎఫ్ ఘన స్వాగతం

**పెండింగ్ స్కావెంజర్ వేతనాలు, ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరణపై వినతి**

సిద్దిపేట, జూన్ 04 (వుదయం బ్యూరో)



సిద్దిపేట జిల్లా నూతన జిల్లా విద్యాశాఖాధికారి (డి ఈ ఓ) గా బాధ్యతలు స్వీకరించిన వరగంటి శాస్త్రి ని గురువారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టి పి టి ఎఫ్) జిల్లా శాఖ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పాఠశాలల ఎదుర్కొంటున్న పలు సమస్యలపై డీఈఓకు వినతిపత్రం సమర్పించారు. పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లకు 202425 విద్యా సంవత్సరానికి సంబంధించి 4నెలల వేతనాలు, అలాగే 202526సంవత్సరానికి సంబంధించి 3 నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. జిల్లాలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరణ ఉత్తర్వులను త్వరితగతిన విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డీఈఓ,టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గాడిపల్లి తిరుపతి రెడ్డి, జిల్లా అధ్యక్షులు చిట్యాల విజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ వినతిపత్రం అందజేస్తూ సమస్యల తీవ్రతను డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై డీఈఓ వరగంటి శాస్త్రి గారు సానుకూలంగా స్పందిస్తూ.. పెండింగ్ వేతనాల విడుదల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. భావితరాలను తీర్చిదిద్దే గురువుల సమస్యలను నూతన డీఈఓ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి, జిల్లా విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఉపాధ్యాయ లోకం ఆకాంక్షిస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంపాదక వర్గ సభ్యులు ఎస్. కనకయ్య, రాష్ట్ర కౌన్సిలర్ రామస్వామి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మహమూద్, జిల్లా ఉపాధ్యక్షులు అజీజ్, రాములు, జిల్లా కార్యదర్శి రాంరెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, నర్సింలు, సత్తయ్య, ఎల్లం, రాములు, రాజేందర్, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, యాదగిరి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# జగదేవ్‌పూర్‌లో కురిసిన మోస్తరు వర్షం.. చల్లబడ్డ వాతావరణం

**ఉక్కపోత నుండి ఉపశమనం.. హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం**

జగదేవ్‌పూర్, జూన్ 04
(వుదయం ప్రతినిధి)



సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి మోస్తరు వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత, భానుడి భగభగలకు తోడు విపరీతమైన ఉక్కపోతతో అల్లాడిపోతున్న మండల ప్రజలకు ఈ వర్షం ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది. తొలి విడతగా కురిసిన ఈ మోస్తరు వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఒక్కసారిగా వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. రైతుల్లో చిగురించిన ఆశలు.... ప్రస్తుతం రోహిణి కార్తె ముగిసి, మృగశిర కార్తె ప్రవేశించనున్న తరుణంలో కురిసిన ఈ వర్షం వానాకాలం సాగుకు ఎంతో అనుకూలమని రైతులు భావిస్తున్నారు. ఈ వర్షంతో భూములు పదునవుతాయని, త్వరలోనే దుక్కులు దున్నుకుని వానాకాలం పంటల సాగుకు సమాయత్తం అవుతామని రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది. మరోవైపు అకస్మాత్తుగా కురిసిన ఈ వర్షం వల్ల రోడ్లపై వెళ్లే వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు కాసేపు ఇబ్బంది పడ్డప్పటికీ..ఎండల నుండి లభించిన చల్లటి ఉపశమనంతో అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్



భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ల మార్కెట్లలో ఒకటిగా హైదరాబాద్ అవతరించింది. ఐటీ రంగానికే పరిమితం కాకుండా మౌలిక సదుపాయాల కేంద్రంగానూ హైదరాబాద్ రూపాంతరం చెందుతోంది. 2022లో 60.9 మెగావాట్ల (ఎండబ్ల్యూ) వద్ద ఉన్న డేటా సెంటర్ల సామర్థ్యం 2025 నాటికి 151.4 మెగావాట్లకు చేరుకుంది. మరో 1.9 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, ఈ విషయంలో ముంబయి తర్వాత స్థానం హైదరాబాద్‌దేనని స్థిరాస్తి సేవల సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా తన తాజా నివేదిక 'ఇండియా డేటా సెంటర్ మార్కెట్ అప్‌డేట్ –2025'లో వెల్లడించింది.

# బిజినెస్

## ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్ సూచీలు




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. రోజంతా మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీలు.. స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు శుక్రవారం వెలువడనున్న వేళ మదుపర్లు అప్రమత్తత పాటించారు. డాలరుతో రూపాయి మారకం విలువ 95.84గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 96.61 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,469 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. సెన్సెక్స్ ఉదయం 73,935.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,346.17) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభనష్టాల మధ్య కదలాడింది. ఇంట్రాడేలో 73,807.30 – 74,544.24 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 13.84 పాయింట్ల లాభంతో 74,360.01 వద్ద ముగిసింది. నిఫ్టీ 10.95 పాయింట్ల లాభంతో 23,416.55 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో టైటాన్, ఎటర్నల్, ఐటీసీ, టెక్ మహీంద్రా, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి.

## మారుతీ నుంచి తొలి ఫ్లెక్స్ ఫ్యూయల్ కారు


చమురు దిగుమతులు తగ్గించి, ఇథనాల్ వినియోగాన్ని పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఆటోమొబైల్ కంపెనీలు ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలను రూపొందిస్తున్నాయి. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని (జూన్ 5) పురస్కరించుకుని హీరో మోటోకార్ప్ రెండు ఫ్లెక్స్ ఫ్యూయల్ మోటార్ సైకిళ్లను బుధవారం లాంచ్ చేయగా.. తాజాగా ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ తొలి ఫ్లెక్స్‌ఫ్యూయల్ కారు వ్యాగనార్‌ను పరిచయం చేసింది. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, హర్‌దీప్ సింగ్ పురి ఈ కారును గురువారం ఆవిష్కరించారు.




భారతదేశ ఇంధనరంగంలో సరికొత్త అధ్యాయం మొదలైందని మారుతీ సుజుకీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హిసాషీ టకేయుచి ఈసందర్భంగా పేర్కొన్నారు. క్రూడాయిల్ దిగుమతులు తగ్గించుకోవడం, కర్బన ఉద్గారాలు తగ్గించుకోవడం భారత్ ముందున్న రెండు ప్రధాన లక్ష్యాలని వివరించారు. ఈ రెండూ ఫ్లెక్స్ ఫ్యూయల్‌తో సాకారం అవుతాయన్నారు. బయో ఫ్యూయల్, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు మళ్లేలా ఆటోమొబైల్ కంపెనీలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మార్గనిర్దేశం చేశారని చెప్పారు. ఫ్లెక్స్‌ఫ్యూయల్ టెక్నాలజీ వల్ల ఆటోమొబైల్‌కు మాత్రమే కాకుండా రైతులకు, ఇథనాల్ ఉత్పత్తిదారులకూ మేలు చేకూరుతుందన్నారు. ఇందులోభాగంగా మారుతీ సుజుకీ ఆ దిశగా కీలక ముందడుగు వేసిందన్నారు.

ఇక ఈ కారు విషయానికొస్తే.. 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ కారు సాధారణ పెట్రోల్‌తో పాటు 85 శాతం వరకు ఇథనాల్ బ్లెండ్ చేసిన E85 ఫ్యూయల్‌తోనూ నడుస్తుంది. డిజైన్ పరంగా E20 మోడల్‌ను పోలి ఉంది. ధర, ఇతర వివరాలు వెల్లడించలేదు. అయితే, రూ.8.50 లక్షల వరకు ఉండొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫ్లెక్స్ ఫ్యూయల్ కారు లాంచ్ చేసిన నేపథ్యంలో మారుతీ సుజుకీ కంపెనీ షేర్లు రాణించాయి. ఓ దశలో 1.5 శాతం లాభంతో షేరు విలువ రూ.13,250కి పెరిగాయి. మధ్యాహ్నం 12.50 గంటల సమయానికి దాదాపు ఒక శాతం లాభంతో రూ.13,152 వద్ద ట్రేడవుతోంది.

## విమానయాన కంపెనీలకు కేంద్రం ఊరట



విమానయాన కంపెనీలకు కేంద్రం ఊరటనిచ్చింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఆకాశాన్నంటుతున్న ఇంధన ధరల నుంచి విమానయాన సంస్థలను ఆదుకోవడానికి, ఛార్జీల అస్థిరతను పరిమితం చేయడం లక్ష్యంగా కేంద్ర మంత్రివర్గం బుధవారం రూ.10,000 కోట్ల విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ప్రకటన ప్రకారం, ఈ నిధి ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీ (ఓఎంసీ)లకు వడ్డీ లేని అడ్వాన్స్‌లను అందిస్తుంది. దీనివల్ల ఆ కంపెనీలు దేశీయ, అంతర్జాతీయ కార్యకలాపాల కోసం భారతీయ విమానయాన సంస్థలకు ఏటీఎఫ్‌ను స్థిరమైన ధరకు సరఫరా చేయగలుగుతాయి. విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చుల్లో ఇంధనం సుమారు 40 శాతం, కొన్ని సందర్భాల్లో తీవ్ర అస్థిరత ఉన్న కాలంలో 60 శాతం వరకు వాటా కలిగి ఉంటుంది. మార్చిలో లీటరుకు రూ.60.50గా ఉన్న అంతర్జాతీయ ఏటీఎఫ్ ధర మే నెలలో లీటరుకు రూ.142కు పెరగడంతో విమానయాన సంస్థలపై ఆర్థిక ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో కేంద్రం ఈ సహాయక చర్యలను చేపట్టింది. ఈ నిర్ణయంపై సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, దేశీయ విమానయాన సంస్థలకు ఏటీఎఫ్ ధరను లీటరుకు రూ.75.60గా ప్రభుత్వం నిర్ణయించిందని, ఇది ప్రస్తుత మార్కెట్ ధర కంటే గణనీయంగా తక్కువని తెలిపారు. ఈ పథకం విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చులను స్థిరీకరించడానికి, ప్రయాణికులకు ఛార్జీల హెచ్చుతగ్గులను పరిమితం చేయడానికి, దేశీయ–అంతర్జాతీయ విమాన అనుసంధానాన్ని పరిరక్షించడానికి సహాయపడుతుందని వైష్ణవ్ వెల్లడించారు. ఈ నిధి ప్రపంచ చమురు ధరల పెరుగుదల కారణంగా ఏర్పడే ఛార్జీల పెరుగుదల నుంచి విమాన ప్రయాణికులను కాపాడటంతో పాటు విమానయానంపై ఆధారపడిన 77 లక్షల మంది ఉద్యోగాలను కూడా పరిరక్షిస్తుందని వివరించారు. ఈ పరిమితి విమానయాన సంస్థలకు తక్షణ ఉపశమనం కలిగిస్తుందని అంచనా వేస్తున్నప్పటికీ, ఇది రిఫైనరీలు, ఇంధన రిటెయిలర్లపై ఆర్థిక ఒత్తిడిని పెంచవచ్చు. దీనికి స్థిరీకరణ నిధి ద్వారా పరిహారం అందిస్తారు. ఆమోదించిన పథకం కింద నిర్ణయించిన ప్రామాణిక ధరను, ప్రస్తుత దిగుమతి సమాన ధర మించినప్పుడల్లా ఓఎంసీలకు ఈ నిధి ద్వారా పరిహారం అందిస్తుంది.

## విప్రో సీఈఓ వేతనం రూ.49.64 కోట్లు



గత ఆర్థిక సంవత్సరం (2025–26)లో విప్రో ముఖ్య కార్య నిర్వాహక అధికారి (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) శ్రీనివాస్ పల్లియా మొత్తంగా రూ.49.64 కోట్ల (5.29 మిలియన్ డాలర్లు) పారితోషికాన్ని అందుకున్నారు. ఇందులో వేతనాలు, ఇతర భత్యాలు 1.65 మిలియన్ డాలర్లు కాగా.. కమీషన్, వేరియబుల్ పే రూపేణా 1.05 మిలియన్ డాలర్లు, ఇతర ప్రయోజనాల కింద 2.47 మిలియన్ డాలర్లు, దీర్ఘకాలిక కంపెన్సేషన్ కింద 1,08,464 డాలర్లను ఆయన పొందినట్లు విప్రో వార్షిక నివేదిక తెలిపింది. విప్రో సీఈఓ, ఎండీగా ఏప్రిల్ 2024లో పల్లియా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. 2025–26లో విప్రో ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రిషద్ ప్రేమ్‌జీకి 7,73,231 డాలర్ల (సుమారు రూ.7.25 కోట్లు) పారితోషికం లభించింది. ఎటువంటి స్టాక్ ఆప్షన్స్ ఆయనకు ఇవ్వలేదు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో నమోదైన ఏకీకృత నికర లాభం వృద్ధిపై 0.35 శాతం కమీషన్‌ను ప్రేమ్‌జీ, పల్లియా పొందారు.

కంపెనీ ముఖ్య ఆర్థిక అధికారి అపర్ణ సి అయ్యర్ 7,17,749 డాలర్ల (రూ.6.73 కోట్లు) పారితోషికం అందుకున్నారు. విప్రోకు పోటీ సంస్థలైన ఇన్ఫోసిస్, టీసీఎస్ సీఈఓల వేతనాలను గమనిస్తే.. ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్ 2025–26లో మొత్తంగా రూ.82.60 కోట్ల పారితోషికం పొందారు. ఈ మూడు సంస్థలో సారథుల్లో పరేఖ్‌కే అత్యధిక పారితోషికం లభించింది. టీసీఎస్ సీఈఓ, ఎండీ కృతివాసన్ రూ.28 కోట్ల పారితోషికాన్ని అందుకున్నారు. ఇన్ఫోసిస్, టీసీఎస్ సీఈఓల పారితోషికాల మధ్యలో విప్రో సీఈఓ పారితోషికం ఉంది.

## షావోమీ నుంచి మిడ్‌రేంజ్ స్మార్ట్‌ఫోన్..



చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ షావోమీ 17T స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. కెమెరా అంటే ఇష్టపడే వారి కోసం లైకా భాగస్వామ్యంతో ట్రిపుల్ కెమెరాను ఇచ్చారు. మీడియాటెక్ డైమెన్సిటీ 8500 అల్ట్రా ప్రాసెసర్, 6500mAh బ్యాటరీ, 67W ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్టుతో మిడ్‌రేంజ్ సెగ్మెంట్‌లో వచ్చిన స్మార్ట్‌ఫోన్ విశేషాలివీ.. 6.59 అంగుళాల 1.5K అమోలెడ్ డిస్‌ప్లేతో వస్తోంది. 120Hz రిఫ్రెష్ రేటు, 3500 నిట్స్ పీక్‌బ్రైట్‌నెస్ ఉంది. మీడియాటెక్ డైమెన్సిటీ 8500 అల్ట్రా ప్రాసెసర్ ఇచ్చారు. ఆండ్రాయిడ్ 16 ఆధారిత హైపర్‌ఓఎస్ 3తో పనిచేస్తుంది. ఫోన్ వెనుక వైపు 50 ఎంపీ లైట్ ఫ్యూజియన్ 800 ప్రధాన కెమెరా+ 50 ఎంపీ పెరిస్కోప్ టెలిఫొటో కెమెరా+ 12 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. ముందు వైపు 32 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. బ్లూటూత్ 6.0, వైఫై 7 వంటి కనెక్టివిటీ సదుపాయాలు ఉన్నాయి. ఐపీ68 రేటింగ్ ఉంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్‌తో వస్తోంది. 6,500mAh సిలికాన్ కార్బన్ బ్యాటరీ, 67W ఫాస్ట్ ఛార్జింగ్+ 22.5W రివర్స్ ఛార్జింగ్ సదుపాయం ఉంది.

ధర విషయానికొస్తే.. Xiaomi 17T రెండు వేరియంట్లలో లభిస్తుంది. 12GB + 256GB వేరియంట్ ధర రూ.59,999, 12GB+512GB వేరియంట్ ధర రూ.64,999గా కంపెనీ నిర్ణయించింది. జూన్ 10 నుంచి షావోమీ వెబ్‌సైట్, అమెజాన్, సంబంధిత రిటైల్ స్టోర్‌లలో ఈ స్మార్ట్‌ఫోన్లను విక్రయించనున్నారు. పరిచయ ఆఫర్ కింద హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, ఐసీఐసీఐ బ్యాంకు కార్డు హోల్డర్స్‌కు రూ.5 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభిస్తుంది. లేదా ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.5 వేల వరకు ఆఫర్ ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు హోల్డర్స్‌కు అదనంగా రూ.5 వేల వరకు క్యాష్‌బాక్‌ను కంపెనీ ఆఫర్ చేస్తోంది.

# క్రీడలు

## క్రికెట్‌లో.. 'లార్డ్స్' అరుదైన ఘనత



క్రికెట్ అనగానే ఠక్కున గుర్తుకొచ్చేది లార్డ్స్ మైదానం. తాజాగా ఇంగ్లాండ్ – న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి టెస్టు మొదలైంది. ఈ క్రమంలో లార్డ్స్ స్టేడియం అరుదైన ఘనతను సాధించింది. ప్రపంచ క్రికెట్‌లో మరే ఇతర మైదానం కూడా తన దరిదాపుల్లో లేకపోవడం గమనార్హం. ఇంతకీ ఆ ఘనత ఏంటంటే? ఇప్పటి వరకు కేవలం మూడు మైదానాల్లోనే వందకుపైగా టెస్టులు జరిగాయి. అందులో లార్డ్స్‌దే తొలి స్థానం. అంతేకాకుండా మరో విషయంలోనూ ముందుంది. 150 టెస్టుల మైలురాయిని చేరుకున్న ఏకైక మైదానం లార్డ్స్. ఇప్పుడు ఇంగ్లాండ్ – కివీస్ మధ్య మ్యాచ్ ఇక్కడ 150వ టెస్టు. లార్డ్స్ తర్వాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో 118, సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో 114 టెస్టులు జరిగాయి.

## హార్దిక్‌తో విభేదాలు అంటూ ప్రచారం..

ఐపీఎల్ 2026లో హార్దిక్ పాండ్య, కృనాల్ పాండ్య మధ్య విభేదాలు తలెత్తినట్లు వార్తలొచ్చాయి. ఆర్సీబీతో మ్యాచ్ సమయంలో హార్దిక్ ఔటైన తర్వాత కృనాల్ పెద్దఎత్తున సంబరాలు చేసుకోవడం.. అతడిని చూస్తూ హార్దిక్ డగౌట్‌కు వెళ్లడం సోషల్ మీడియాలో వీడియోలు వైరల్‌గా మారాయి. వరుసగా ఆర్సీబీ రెండో టైటిల్ సాధించడంలో కృనాల్ పాండ్య (Krunal Pandya) కీలకపాత్ర పోషించినప్పటికీ అతడికి హార్దిక్ అభినందనలు తెలుపుతూ కనీసం ఒక్క పోస్ట్ కూడా సోషల్ మీడియాలో పెట్టలేదు. సోదరుడితో విభేదాల కారణంగానే హార్దిక్ మౌనంగా ఉన్నాడంటూ ప్రచారం జరిగింది. అయితే, వీటన్నింటిని కృనాల్ పాండ్య కొట్టిపారేశాడు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టతనిచ్చాడు.

'మేం ఇద్దరం కలిసి ఆడాం. క్రికెట్‌ను ఎల్లప్పుడూ వ్యూహాత్మక, సాంకేతిక అంశాల పరంగానే చర్చించాం. మా మధ్య ఎప్పుడూ ఎంతో ఆరోగ్యకరమైన చర్చ జరుగుతూనే ఉంది. సోదరులిద్దరూ ఒకే క్రీడ ఆడుతుంటే అది ఎప్పుడూ ఒకరికొకరు సహాయపడటానికి దోహదపడుతుంది. పాండ్య కుటుంబంలో 10 ఐపీఎల్ ట్రోఫీలు ఉండటం అనేది తక్కువ సంఖ్యేమీకాదు. దేవుడి దయ ఉంది'' అని కృనాల్ వివరించాడు. హార్దిక్ ముంబయి తరపున నాలుగు, గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా ఒకసారి ఐపీఎల్ ట్రోఫీ సాధించిన విషయం తెలిసిందే. కృనాల్ ముంబయి తరపున మూడు, ఆర్సీబీ తరపున రెండు టైటిళ్లు సాధించాడు.





## కోహ్లీ ఆటోగ్రాఫ్ దక్కలేదని..



ఐపీఎల్ సమయంలో ఆర్సీబీ ఆటగాడు విరాట్ కోహ్లీ ఆటోగ్రాఫ్ ఇవ్వలేదని ఓ పిల్లాడు బాధపడిన వీడియో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అతడికి నెట్టింట మద్దతు లభించింది. చాలామంది గిఫ్ట్‌లూ పంపించారు. తాజాగా ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ కూడా ఓ బహుమతి పంపించారు. అదేంటో ఆ పిల్లాడే ఓ వీడియో చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. దానిని రీపోస్ట్ చేసిన లలిత్ మోదీ స్పందించారు. యుగ్‌వీర్ బుధిరాజా అనే ఆ పిల్లాడు విరాట్ కోహ్లీకి వీరాభిమాని. ''నా దగ్గర విరాట్ కోహ్లీ ఒక్కడే సంతకం చేసిన బ్యాట్ లేదు. కానీ, తొలి సీజన్‌లో అందరూ తమ ఆటోగ్రాఫ్ చేసిన బ్యాట్ ఉంది. అందులో విరాట్ సైన్ కూడా ఉంది. దానిని నేను యుగ్‌వీర్‌కు పంపించా. త్వరలోనే అతడికి వ్యక్తిగతంగా బ్యాట్‌ను అందించేందుకు ఒకరిని పురమాయించా'' అని లలిత్ మోదీ తెలిపారు. జూన్ 3న తనకు ఓ వీడియో కాల్ వచ్చిందని.. లలిత్ మోదీ సర్ ఫోన్ చేసినట్లు యుగ్‌వీర్ తెలిపాడు. తనకు బ్యాట్‌ను పంపించినందుకు ధన్యవాదాలు చెప్పాడు. ''థాంక్యూ లలిత్ మోదీ సర్. మీరు చేసిన వీడియో కాల్‌తోనే నా ఉదయం మొదలైంది. ఎప్పటికీ మరిచిపోలేని క్షణం. నన్ను గుర్తించి మీరు బహుమతి పంపినందుకు చాలా సంతోషంగా ఉంది. మీ నుంచి బ్యాట్‌ను అందుకోవడానికి ఆత్రుతగా ఎదురు చూస్తున్నా'' అని యుగ్‌వీర్ తెలిపాడు.

## టాప్ సీడ్ ప్లేయర్లు ఔట్..



టాప్ సీడ్‌లు బరిలోకి దిగితేనే గ్రాండ్‌స్లామ్ పోటీలకు ఆకర్షణ. ఆ ప్లేయర్లు ఫైనల్ వరకూ వెళ్తేనే వీక్షించేందుకు ప్రేక్షకులు పెద్దసంఖ్యలో వస్తారు. కానీ, ఈసారి ఫ్రెంచ్ ఓపెన్‌కు 'స్టార్' కళ తగ్గిపోయింది. క్వార్టర్ ఫైనల్ నాటికే ఇటు పురుషులు.. అటు మహిళల విభాగంలో టాప్ ప్లేయర్లు బయటకు వెళ్లిపోయారు. ఎందుకిలా జరిగిందనే ప్రశ్నలు తలెత్తడం సహజమే. ఇదంతా ఓ ప్రణాళిక ప్రకారం సాగుతోందా? అనే అనుమానాలు రాకమానవు. ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభానికి ముందే స్టార్ ఆటగాడు అల్కరాజ్ దూరమైన సంగతి తెలిసిందే. ఇక తొలి రౌండ్‌లోనే ఆరో సీడ్ ప్లేయర్ డాని మెద్వెద్వెవ్ ఓటమితో బయటకు వెళ్లిపోయాడు. రెండో రౌండ్‌లో టాప్ సీడ్ జనిక్ సినర్ నిష్క్రమించడం సంచలనం కాగా.. 25వ టైటిల్‌పై కన్నేసిన నొవాక్ జకోవిచ్ (3)కు ఎదురులేదని అంతా భావించారు. కానీ, మూడో రౌండ్‌లోనే జకో కూడా ఇంటిబాట పట్టాడు. టేలర్ ఫ్రిట్జ్ (7వ సీడ్), ఆండ్రే రుబ్లెవ (11), కాస్పెర్ రూడ్ (15), ఫ్రాన్సెస్ టియాఫో (19)కూ చుక్కెదురైంది. జ్వెరెవ్ (2) ఒక్కడే కాస్త అభిమానులకు తెలిసిన స్టార్ ప్లేయర్. ఇక మహిళల విభాగంలో.. టాప్ సీడ్ అర్యానా సబలెంకా క్వార్టర్ ఫైనల్స్‌లో ఓడింది. కొకొగాఫ్, రెబకినా కూడా మూడు, రెండు రౌండ్ల లోనే ఇంటిముఖం పట్టారు. ఫ్రెంచ్ ఓపెన్ పురుషులు, మహిళల విభాగంలో కొత్త ఛాంపి యన్లు అవతరించనున్నారు. 2021 యూఎస్ ఓపెన్ తర్వాత ఇప్పుడే టాప్‌సీడ్ ప్లేయర్లు లేకుండా సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లు జరగనుండటం గమనార్హం. టాప్ సీడ్‌గా జనిక్ సినర్, మూడో సీడ్ ప్లేయర్ నొవాక్ జకోవిచ్‌లో ఎవరో ఒకరు ఫ్రెంచ్ ఓపెన్‌ను గెలుస్తారని అంతా భావించారు. కానీ, వారిద్దరూ నిష్క్రమించారు. ఇక మహిళల విభాగంలోనూ సబలెంకా, కొకొ గాఫ్ మధ్యే పోటీ అనుకుంటే.. ఇంటిబాట పట్టడం గమనార్హం.

## ఏదైనా మేమే సమాచారమిస్తాం..

ఐపీఎల్ ముగిసిన వారం రోజులకే అఫ్గానిస్థాన్‌తో టీమ్‌ఇండియా ఒక టెస్టు, మూడు వన్డేల సిరీస్‌ను ఆడనుంది. శనివారం నుంచి ఏకైక టెస్టు ప్రారంభం కానుంది. శుభమన్ గిల్ నాయకత్వంలోని భారత ఆటగాళ్లు ఇప్పటికే




ముల్లాన్‌పూర్ చేరుకుని ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆ తర్వాత మూడు వన్డేల సిరీస్ జరగనుంది. సీనియర్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి అవకాశం కల్పించారు. కానీ, గాయం కారణంగా విరాట్ సిరీస్‌కు దూరంగా ఉంటాడని వార్తలు వచ్చాయి. రోహిత్ కూడా ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో భారత అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే అప్‌డేట్ ఇచ్చాడు. ''బయట ఏం చర్చ జరిగినా అనవసరం. అధికారికంగా మేం త్వరలోనే సమాచారం ఇస్తాం. విరాట్ లేదా రోహిత్ వంటి పెద్ద ఆటగాళ్లు సిరీస్‌లో ఆడకపోవడం బిగ్ న్యూస్ అవుతుందని తెలుసు. ఫిట్‌నెస్‌కు సంబంధించి ప్రోటోకాల్స్ అందరికీ ఒకేలా ఉంటాయి. సిరీస్ ప్రారంభానికి కొద్ది సమయం ఉంది. ఆలోగా మేం నిర్ణయం తీసుకుంటాం. ఫిట్‌గా ఉంటే తుది జట్టులో ఉంటారు. లేకపోతే అందుకు తగినట్టుగా మార్పులు చేసుకుంటాం. వైద్య బృందం ఖరారు చేసిన అనంతరం పరిస్థితి ఏంటో అధికారికంగా వెల్లడిస్తాం'' అని డస్కటే తెలిపాడు.

# వుదయం సినిమా
MOVIE TIME!



## కుట్రలు, కుతంత్రాలను అధిగమించి బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ "పెద్ది"

**వుదయం సినిమా** "పెద్ది" సినిమా ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన అసాధారణ నటనతో సినిమాను పూర్తిగా తన భుజాలపై మోసి ముందుకు నడిపించారు. ఆయన నటనను చూసిన అభిమానులు, ప్రేక్షకులు "న భూతో న భవిష్యతి" అనే స్థాయిలో ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ చిత్రంలో కుస్తీ పోరాటాలు, యాక్షన్ సన్నివేశాలు, భావోద్వేగాల ప్రదర్శనలో రామ్ చరణ్ చూపించిన అంకితభావం ప్రత్యేకంగా నిలిచింది. ఇలాంటి సాహసోపేతమైన కథను, క్లిష్టమైన పాత్రను చేయడానికి ఎంతో ధైర్యం కావాలి. కానీ రామ్ చరణ్ ఈ పాత్ర కోసం ప్రాణం పెట్టి పనిచేసినట్లు ప్రతి సన్నివేశంలో కనిపిస్తోంది. ఇలాంటి కథలు చాలా అరుదుగా వస్తాయి. ఇప్పటికే భారీ స్టార్‌డమ్ ఉన్న హీరో ఇలాంటి విభిన్నమైన సబ్జెక్ట్‌ను ఎంచుకుని దాన్ని విజయవంతం చేయడం నిజంగా గొప్ప విషయం. అందుకే "పెద్ది" కేవలం ఒక సినిమా కాకుండా ప్రేక్షకులకు ఒక ప్రత్యేకమైన అనుభూతిగా మారింది.

# #చిరుబాబీ2 / #చిరు158 పొల్లాచ్చిలో కీలక షెడ్యూలు ప్రారంభం



**వుదయం సినిమా:** మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్ లో #ChiruBobby2 / #Chiru158 చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'వాల్తేరు వీరయ్య' భారీ బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ విజయవంతమైన కాంబో మరోసారి చేతులు కలపడంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పలు భాషల్లో భారీ విజయాలు అందుకున్న కేవీఎన్ ప్రొడక్షన్స్‌కు ఇది తొలి తెలుగు చిత్రం కావడం విశేషం.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా తమిళ నాడులోని పొల్లాచ్చిలో కీలక షెడ్యూల్‌ను ప్రారంభించారు. ఈ షెడ్యూల్‌లో మెగాస్టార్ చిరంజీవితో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటూ కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.ఇదిలా ఉండగా, రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ #Chiru-Bobby2 యూనిట్ విడుదల చేసిన స్పెషల్ వీడియో సోషల్ మీడియాలో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దర్శకుడు బాబీ కొల్లి మరింత భారీ స్థాయిలో కథను సిద్ధం చేశారు. దశాబ్దాలుగా తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న చిరంజీవి ఈ చిత్రంలో తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్, ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. ఇందుకోసం ఆయన మరోసారి అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సంగీతాన్ని ఎస్. థమన్ అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తిక్ కన్నన్ చిత్రానికి అద్భుతమైన విజువల్స్ అందించనున్నారు. ప్రొడక్షన్ డిజైన్ అవినాశ్ కొల్లా నిర్వహిస్తుండగా, ఎడిటింగ్‌ను ఆంటోని ఎల్. రూబెన్ చేస్తున్నారు.

# రాంచరణ్ నటించిన "పెద్ది" చిత్రం రివ్యూ...



**వుదయం సినిమా:** ఏ దర్శకుడు అయినా పెద్ద హీరోలతో ఫిలిం చేస్తున్నపుడు కథను పూర్తి Commercial చిత్రంగా చేసుకోవలసి ఉంటుంది. కాని " పెద్ది "కథను అలా చేయలేకపోయాడు దర్శకుడు బుచ్చిబాబు. ఒక Artistic ఫార్ములతో దర్శకుడు బుచ్చిబాబు కథను చివరివరకు నడిపించాడు. విజయనగరం జిల్లాలోని కొండల మధ్య రవాణా సౌకర్యం లేని, ఓ మారుమూల గ్రామం లో నివసిస్తున్న ప్రజల గుర్తింపు కోసం ఈ కథను తయారుచేసుకొన్నాడు దర్శకుడు .ఆ ప్రాతంలో లో వెళుతున్న ఒకే ఒక రైలు ను ఆపడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు ఆ ఊరి వ్యక్తి అప్పల సూరి (జగపతి బాబు ) .చివరికి తన ప్రాణాన్ని సైతం త్యాగం చేయడం తో బెల్లం పల్లెలో కూలి వాడిగా పని చేస్తున్న పెద్ది (రామ్ చేరణ్ మనసు కలచి వేస్తుంది .ఎన్నో అవమానాల మధ్య పెద్ది, జాతీయ స్థాయిలో గర్తింపు తెచ్చు కొంటె అప్పలసూరి ఆశయం పలిస్తుందని, తన ఎడమ కాలును సైతం త్యాగం చేసి, పోగొట్టు కొంటాడు. తరువాత Sportsman గా మారి, 400 మీటర్ల పరుగు పందెంలో గెలుపొంది, మొదట తన వూరికి మేలు జరిగే తన ప్రతిపాదన నిరాకరించిన కేంద్ర మంత్రిని సైతం. చివరికి దిగివచ్చేలా చేసిన పెద్ది (Ramcheran) సాహసం చాలా గొప్పగా కథను ముందుకు నడిపించింది .అప్పట్లో దానికులు ఆడుకొనే క్రికెట్ ఆటలో ,ఓ కూలి ఆటగాడి గా తనకు ఎవ్వరు సాటిలేరు అన్నట్లు గా పెద్ది(రాంచరణ్ ) గుర్తింపు తెచ్చుకొంటాడు. దాంతో ఆ ఊరి ఇరుపక్షాల ధనికులు ఒకటై పెద్ది ఆశయాన్ని అడుగడుగునా ఆటంకపరుస్తూ వుంటారు .

# ఖైదీల వేటలో పవర్‌ఫుల్ పోలీస్

**వుదయం సినిమా:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న అత్యంత ప్రతిష్టాత్మక యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్'. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి ఇండస్ట్రీ హిట్ల తర్వాత సందీప్ తెరకెక్కిస్తున్న చిత్రం కావడంతో దీనిపై అటు ఇండస్ట్రీలోనూ, ఇటు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, ముఖ హెయిర్ స్టైలిస్ట్‌తో కలిసి ప్రభాస్ దిగిన ఈ సెల్ఫీ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఇందులో ప్రభాస్ సరికొత్త హెయిర్ స్టైల్, గడ్డంతో ఊరమాస్ రఫ్ లుక్‌లో కనిపిస్తుండటంతో అభిమానులు పండగ చేసుకుంటున్నారు. సినిమాలో ప్రభాస్ క్యారెక్టర్ లుక్ ఇదేనంటూ ప్రచారం జరుగుతోంది. అయితే, సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన కొద్దిసేపటికే ఈ ఫోటోను తొలగించినట్లు వార్తలు వస్తుండటంతో.. 'స్పిరిట్' లీక్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈ క్రేజ్ చూస్తుంటే, ఇకనైనా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా అధికారిక ఫస్ట్ లుక్‌ను విడుదల చేయాలని అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా డిమాండ్ చేస్తున్నారు.అంతర్జాతీయ బ్యాక్‌డ్రాప్‌లో హై-వోల్టేజ్ యాక్షన్:ఈ చిత్రంలో ప్రభాస్ సరికొత్త మేకోవర్‌లో ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచా రం. అంతర్జాతీయ నేర ముఠాల గుండె ల్లో నిద్రపోయే ధైర్యవంతుడైన అధికారిగా ఆయన క్యారెక్టరైజేషన్ ఉంటుం దని వినికిడి. అందుకనుగుణంగానే ఇటీవలే హైదరాబాద్‌లోని చారిత్రాత్మక విమల్ థియేటర్‌లో ప్రభాస్, విలన్





తాజాగా సెట్స్ నుంచి లీకైన ప్రభాస్ సెల్ఫీ ఒకటి సామాజిక మాధ్యమాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది.రఫ్ అండ్ రగ్గడ్ లుక్‌లో డార్లింగ్ :ప్ర

పాత్రధారి వివేక్ ఒబెరాయ్‌లపై ఒక హై-వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరించినట్లు సినీ వర్గాల భోగట్టా.

# మరోసారి సంక్రాంతి రేసులో అనిల్ రావిపూడి..

వుదయం సినిమా

యద్దనపూడి: ఈ ఏడాది సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్‌గారు' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి, మరోసారి సంక్రాంతి బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్‌రామ్ ప్రధాన పాత్రల్లో ఆయన తెరకెక్కించనున్న క్రేజీ మల్టీస్టారర్ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ తాజాగా పూర్తయింది. ఈ నేపథ్యంలో, దర్శకుడు అనిల్ రావిపూడి తన స్వగ్రామమైన బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం చిలుకూరి వా రి పా లెం లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ ఆం జ నే య స్వామి ఆలయంలో పండితుల వేదమంత్రాల మధ్య నూతన చిత్ర స్క్రిప్ట్‌కు పూజా కార్యక్రమాలు జరిపారు. పసుపు, కుంకుమలతో అలంకరించిన ఈ స్క్రిప్ట్‌ను అనిల్ రావిపూడి తన తల్లిదండ్రులు రావిపూడి బ్రహ్మయ్య, అనంతలక్ష్మి చేతుల మీదుగా అందుకుని ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సాయికృష్ణ, రచయిత నారాయణ, కోడైరెక్టర్ సూర్య, ఎడిటర్ తమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు. దర్శకుడి రాకతో చిలుకూరివారిపాలెంలో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలోనూ ఈ నూతన చిత్రం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్క్రిప్ట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. జులై లేదా ఆగస్టులో షూటింగ్ ప్రారంభం: భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ చిత్రం జులై లేదా ఆగస్టు నెలల్లో సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు సమాచారం. కథాంశానికి అనుగుణంగా ప్రతి సినిమాకు సంగీత దర్శకులను మార్చే అనిల్ రావిపూడి.. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి.ప్రకాష్‌కుమార్‌ను ఎంపిక చేశారు. కథ, కథనాల పరంగా ఈ సినిమా సరికొత్తగా, మరింత ప్రత్యేకంగా ఉండేలా అనిల్ రావిపూడి స్క్రిప్ట్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో వెంకటేష్ సరసన కీర్తి సురేశ్, కల్యాణ్ రామ్ జంటగా కృతిశెట్టి నటించనున్నారు.



# "సిగ్మా" ఎనర్జిటిక్ ఫస్ట్ సింగిల్

**వుదయం సినిమా:** సందీప్ కిషన్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిత్రం 'సిగ్మా'. జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచ యం అవుతున్న ఈ చిత్రం అనౌన్స్మెంట్ నాటి నుంచే సినీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించింది. టీజర్‌కు అద్భుతమైన స్పందన రావడంతో మరింత హైప్‌ను సొంతం చేసు కుంది. ఈ సినిమా కోసం మ్యూజిక్ సెన్సేషన్ ఎస్. తమన్ బ్లాక్ బస్టర్ ఆల్బమ్ కంపోజ్ చేశారు. తాజాగా హీరో దుల్కర్ సల్మాన్ 'సిగ్మా' ఫస్ట్ సింగిల్ 'సిగ్మా స్టైల్' ను లాంచ్ చేశారు. తమన్ స్వయంగా కంపోజ్ చేసి ఆలపించిన ఈ ఎనర్జిటిక్ ట్రాక్ మాస్ బీట్‌లతో అదిరిపోయింది. థమన్ సిగ్నేచర్ స్టైల్ మ్యూజిక్, హై-వోల్టేజ్ రిథమ్స్ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సందీప్ కిషన్ తన స్టైలిష్ డ్యాన్స్ మూమెంట్స్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకోగా, ఫారియా అబ్దుల్లా కూడా టు అదిరిపోయే డ్యాన్స్ స్టెప్స్‌తో పాటకు మరింత కలర్ తీసుకొచ్చింది. జేసన్ సంజయ్ రాసిన క్యాచీ లిరిక్స్, థమన్ మాస్ ట్యూన్, సందీప్-ఫారియా డైనమిక్ పెర్ఫార్మెన్స్ కలిసి 'సిగ్మా స్టైల్'ను ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్‌గా నిలబెట్టాయి. ఈ సాంగ్‌తో సినిమాపై క్యూరియాసిటీ, ఎక్స్‌పెక్టేషన్స్ మరింతగా పెరిగాయి.ఈ చిత్రంలో రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్, అంబు దాసన్, యోగ్ జాపీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ నిర్వహిస్తున్నారు.



# 'ఫన్, ఫెస్ట్, కెయాస్' క్యాప్షన్‌తో ఆకట్టుకుంటున్న బర్త్ డే పోస్టర్

వుదయం సినిమా

"మ్యాడ్" చిత్రంతో యువ ప్రేక్షకుల్లో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న యంగ్ టాలెంటెడ్ హీరో రామ్ నితిన్ మరో యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రాన్ని వల్లభనేని గిరిబాబు సమర్పణలో ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు. "యూత్" మూవీని తెలుగు ఆడియన్స్ ముందుకు తీసుకొచ్చిన ప్రొడ్యూసర్స్ వినీత్, సందీప్ తమ ఈ2సీ టాకీస్ బ్యానర్ పై కో ప్రొడ్యూస్ చేస్తున్నారు. నారా రోహిత్ "సుందరకాండ" ఫేమ్ డైరెక్టర్ వెంకటేష్ నిమ్మలపూడి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. హీరో రామ్ నితిన్ బర్త్ డే సందర్భంగా ఆయన నటిస్తున్న కొత్త సినిమా బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ మూవీ బర్త్ డే స్పెషల్ పోస్టర్ కలర్ ఫుల్ కాలేజ్ ఫెస్ట్ వైబ్స్ తో ఆకట్టుకుంటోంది. 'ఫన్, ఫెస్ట్, కెయాస్..బిగిన్స్ సూన్' అంటూ పోస్టర్ లో పెట్టిన క్యాప్షన్ ఈ మూవీ ఎంత ఎంటర్ టైనింగ్ గా ఉండబోతుందో తెలియజేస్తోంది. కాకినాడ లోని ఓ కాలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పక్కా యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ చిత్రమిది. "మ్యాడ్" మూవీలో రామ్ నితిన్ చేసిన సందడి ఏ ప్రేక్షకుడూ మర్చిపోలేదు. "ది గర్ల్ ఫ్రెండ్" వంటి పర్పస్ ఫుల్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ రూపొందించిన ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని, కెన్ అండ్ గ్యాంగ్ "యూత్" మూవీ ని తెలుగు ప్రేక్షకులకు అందించి ఫస్ట్ వెంచర్ లోనే సక్సెస్ అందుకున్న యంగ్ ప్రొడ్యూసర్స్ వినీత్, సందీప్, "సుందరకాండ" సినిమాతో యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ ను అలరించిన డైరెక్టర్ వెంకటేష్ నిమ్మలపూడి కాంబినేషన్ లో వస్తున్న సినిమా కాబట్టి అనౌన్స్ మెంట్ నుంచే మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ సినిమాకు "లిటిల్ హార్ట్స్" ఫేమ్ సింజిత్ యెర్రమల్లి మ్యూజిక్ మరో ప్రత్యేక ఆకర్షణ కాబోతోంది. ఈ సినిమాకు పనిచేస్తున్న కోర్ టీమ్ అంతా యూత్ ఫుల్ ఎంటర్ టైనర్స్ తో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నవారే కావడం విశేషం. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేకర్స్ ఇవ్వబోతున్నారు.




Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.